సెప్టెంబర్
2016

125

సంపుటి : 11 సంచిక : 5 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

సిపిఐ నూతన కార్యక్రమం
కేంద్రీకృత ప్రజాస్వామ్యం
మోడీ ప్రభుత్వ విధానాలకు ప్రతిఘటన
సరళీకరణ విధానాలు ప్రజారోగ్యం
వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం
మహిళలు సోషలిజం కోసం పోరాటం
మతోన్మాదాన్ని బలహీనపర్చటానికి సమగ్ర వ్యూహం ఉండాలి
నేతన్నల కనురెప్ప 'కస్తూరి' కుటుంబరావు

స్ఫూర్తి

# నేతన్నల కనురెప్ప
# 'కస్తూరి' కుటుంబరావు

వై. సిద్దయ్య



"అన్నా! నాటి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన అమర వీరులకు భార్యాబిడ్డలు లేరా?! ఆ ఆదర్శ మూర్తులను ఎప్పటికీ ఆరాధిస్తాం కదా! మేమూ బడుగు, బలహీన వర్గాల భవితవ్యం కోసం ఆరాట పడుతున్నాం. సమ సమాజ స్థాపనే మా ధ్యేయం. ఆ ధ్యేయం మా రదు. కుటుంబం కోసం ఉద్యమాలను వీడేది లేదు. ఏనాటికైనా అంతిమ విజయం పోరా టానిదే. జై తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం... వర్ధిల్లాలి భారత కమ్యూనిస్టు పార్టీ" అని నినదించాడా వీరుడు!

పోలీసు తూటాలకు బలవుతానని తెలిసిన సమయంలోనూ ధైర్యసాహసాలను ప్రదర్శించిన ఆ వీరుడే కస్తూరి కుటుంబరావు! గుంటూరు జిల్లా పాలపర్తిలో మలబారు పోలీసు క్యాంపులో చిత్రహింసలకు గురవుతూనే ఆయన ఆ విప్లవ నినాదం చేశారు. పోలీసులకు లొంగిపొమ్మన్న తన సోదరులకు సర్దిచెబుతూ ఆదర్శాల బాట వీడనని, ఉద్యమాన్ని ఆపేదిలేదని తేల్చి చెప్పా రు. ప్రజల కోసం మృత్యువునైనా ఆనందంగా ఆహ్వానిస్తానన్న ఆయన చేనేత కార్మికుల కనురెప్పగా నిలిచారు. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకున్నాడు. 1906లో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా కనగాల గ్రామంలో పున్నయ్య, పున్నమ్మ దంపతులకు ఆయన జన్మించారు. ఐదుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లల్లో ఆయన నాల్గవ సంతానం. కుల కట్టుబాట్లు సంప్రదా యాలు ఎక్కువగా ఆచరించే సనాతన బ్రాహ్మణ కుటుంబం అది. చిన్నతనం నుంచే చదువులో తెలివైన విద్యార్థిగా కుటుంబరావు మన్నన పొందారు. చదువు పూర్తయ్యాక ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉపాధ్యాయ ఉద్యమ బాట పట్టారు. రాత్రి పాఠశాలల్లో ఆయన ప్రజలను చైతన్య పరిచేవారు. దళితులు, యాదవులు, చేనేత కార్మికులు వంటి నిరుపేదలుండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని పని చేశారు. రోజుకొక ప్రాంతానికి లాంతరు తీసుకుని వెళ్లేవారు. వెంట తీసుకెళ్లిన పత్రికలు చదివి వినిపించే వారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆయన గాంధేయవాదిగా గుర్తింపు పొందారు. గుంటూరు జిల్లాలో పలు గ్రామాల్లో గ్రంథాల యాల ఏర్పాటుకు కృషి చేశారు. రాష్ట్రంలోనే గ్రంథాలయ ఉద్యమ నిర్మాతల్లో ఆయన ఒకరు. అంటరానితనం నిర్మూలన కోసం కుటుంబరావు నిత్యం తపించేవారు. రేపల్లె తాలూకా ఇసుక పల్లి, రేపల్లె, భట్టిప్రోలు, ఐలవరం, రాజోలు, కనగాల, చెరుకుపల్లి గ్రామాల్లో చేనేత కార్మికులే ఎక్కువ. వారి వృత్తి మనుగడకు జరిగే ఉ ద్యమాలకు కస్తూరి వేగుచుక్క అయ్యారు. ఈ నేపథ్యంలోనే ఆయన భారత కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులయ్యారు. కష్టజీవుల భవితవ్యాన్ని తీర్చిదిద్దాలంటే కమ్యూనిస్టు సిద్ధాంతమే సరైన మార్గమని నమ్మారు. ఆనాటి నుంచి కమ్యూనిస్టు ఉద్యమాలకు సారథ్యం వహించసాగారు. ఉద్యోగం వదలి పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా మారారు. తన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆయన పని ప్రారంభించారు. గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని చీరాల, వేటపాలెం ప్రాంత పార్టీ ఆర్గనైజరుగా రాష్ట్ర పార్టీ ఆయనను నియమిం చింది. అప్పటి నుండి ఈ ప్రాంతంలో ఆయన ఉద్యమ ప్రస్థానం మొదలైంది. భార్య హైమవతి, నలుగురు పిల్లలతో 1944లో తన నివాసాన్ని పందిళ్ళపల్లికి మార్చారు. ఆ తర్వాత జాండ్ర పేటలోనూ కొంతకాలం నివసించారు. తదు పరి వేటపాలెంలో స్థిరనివాసం ఏర్పరుచు కొన్నారు. అదే ఆయన కేంద్ర కార్యస్థానమైంది. కుటుంబరావు నేతృత్వంలోనే 1946 జూన్ 19వ తేదీన రాష్ట్ర చేనేత మహాసభను పందిళ్ళపల్లిలో నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుండి వృత్తిదారులు, నాయకు లు, కార్యకర్తలు వేల సంఖ్యలో ఈ సభకు వచ్చారు. రాష్ట్ర కేంద్రం నుండి పుచ్చల సత్యనారా యణ, కడుపు రాములు హాజరయ్యారు. సంగీత దర్శకులు బి.గోపాలం, సినీనటి వసంత (జూ పూడి) పాల్గొన్నారు. 'నాజర్ దళం' బుర్రకథ ప్రజలను ఉర్రూత లూగించింది. ఆ సభలు విజయవంతం కావడంతో కుటుంబరావు మంచి కార్యదీక్షా పరుడుగా గుర్తింపు పొందారు.

చేనేత రంగంలో కృషి చేస్తూనే బంజరు భూముల సమస్యపైనా ఆయన ఆందోళనలు నిర్వహించారు. బీడీ కార్మికుల హక్కుల సాధనకు ప్రజా ఉద్యమాలు నిర్మించారు. చీరాల ప్రాం తంలో పార్టీ విస్తరణకు కృషి చేశారు. చేనేత కార్మిక కుటుంబాల నుండి మాణిక్యాల వంటి కార్యకర్తలను తయారు చేశారు. అలాంటి వారిలో సజ్జా సూర్య బాలానందం, బండారు వెంకటేశ్వర్లు వంటి వారు ముఖ్యులు. వారిని మగ్గం గుంటల నుండి వెలికితీసి విప్లవ యోధు లుగా తీర్చిదిద్దారు. వేటపాలెంలో బలమైన ప్రజా పునాదిగల కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారు.

1936లో ఏర్పడిన వేటపాలెం చేనేత సొసైటీ ఆది నుండి కమ్యూనిస్టుల ఆధ్వర్యంలోనే సాగింది. కుటుంబరావు ఆ ప్రాంతానికి వచ్చేనాటికి సొసైటీ అప్పుల్లో మునిగి ఉంది. బండ్ల గరటయ్యను కలుపుకొని అప్పుల నుంచి బయట పడేందుకు కుటుంబరావు కృషి చేశారు. వేటపాలెంలో సజ్జా భాస్కరరావు మేడ మీదగల చేనేత సంఘం కార్యాలయమే కేంద్రంగా కుటుంబరావు పనిచేసే వారు. ఆయనకు సజ్జా పిచ్చయ్య అన్ని విధాలా అండగా నిలిచారు. సజ్జా భాస్కరరావు ఇంటి వద్దే పార్టీ సమావే శాలు జరిగేవి. అక్కడే రాజకీయ పాఠశాల నడిపే వారు. రైలుకట్టకు పడమర తోటల్లో జరిపే పార్టీ రహస్య సమావేశాల్లో కుటుంబ రావు, బండారు వెంకటేశ్వర్లు, సూర్య బాలానం దం తదితరులు పాల్గొనే వారు. అప్పటికే పార్టీ బాపట్ల తాలూకా కమిటీలో కుటుంబరావు నాయకులు.

ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులు ప్రగడ కోటయ్య కమ్యూనిస్టు పార్టీ, చేనేత కార్మిక సంఘమంటేనే మండిపడేవారు. 1948లో ప్రకాశం మంత్రివర్గం కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది. కమ్యూనిస్టు నాయకులను కనిపిస్తే కాల్చి వేయమని ఆర్డరు జారీ చేసింది. ఆ సమయంలో గుర్తింపు కలిగిన కార్యకర్తలం దరూ రహస్య జీవితానికి వెళ్ళారు. జాండ్రపేట మునసబు పార్టీ హిట్ లిస్టులో ఉన్నాడని తెలుసుకున్న పోలీసులు తమ వేటను ముమ్మరం చేశారు. రహస్య స్థావరాల్లో తలదాచుకుంటూ కూడా రహస్య సమావేశాల ద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించేందుకు కస్తూరి ప్రయత్నిం చారు. నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడే ధైర్యాన్ని కార్యకర్తల్లో కలిగించారు. పోలీసులు పెట్టే హింసలకు కుంగిపోకుండా ముందుకు సాగే మనోధైర్యాన్ని నూరిపోశారు. ప్రలోభాలకు లొంగక తమ నాయకుల శ్రేయస్సే ధ్యేయంగా భావించిన స్థానిక పేదలు వారిని రక్షించారు. కుటుంబరావుకు కొరియర్‌గా బండారు సుబ్బా రావు పని చేశారు. చీరాల, బాపట్ల నాయక త్వంతో కుటుంబరావు నిరంతరం చర్చలు జరిపేవారు.

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...

1. నేతన్నల కనురెప్ప 'కస్తూరి' కుటుంబరావు
వై. సిద్దయ్య ............ 2

2. సిపిఐ నూతన కార్యక్రమం
ప్రకాశ్ కరత్ ............ 4

3. కేంద్రీకృత ప్రజాస్వామ్యం
ఎస్ వీరయ్య .......... 12

4. మోడీ ప్రభుత్వ విధానాలకు ప్రతిఘటన
డా|| కె. హేమలత ..... 15

5. సరళీకరణ విధానాలు ప్రజారోగ్యం
ఆర్. రామచంద్రన్ ..... 19

6. వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం
డా|| అర్చనా ప్రసాద్ ... 23

7. మహిళలు సోషలిజం కోసం పోరాటం
అలెన్ ఉడ్స్ ............ 25

8. మతోన్మాదాన్ని బలహీనపర్చటానికి సమగ్ర వ్యూహం ఉండాలి
బి.వి. రాఘవులు .... 33

సంపాదకుడు:
**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
ముద్రణ : ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
ఫోన్: ఎడిటోరియల్ 0866-2577248
మేనేజర్: 040-27673787
email:venkataraosankarapu@gmail.com
visit cpi(m) site at : cpim.org

# కాశ్మీర్ కల్లోలం

**కా**శ్మీర్ మరోసారి భగ్గుమన్నది. ప్రజల ఆందోళనలు, భద్రతాదళాల కాల్పులు, కర్ఫ్యూలతో కాశ్మీర్‌లోయ కల్లోలంగా మారింది. ఇప్పటికి 70 మంది వరకు పోలీసు కాల్పుల్లో చనిపోయారు. ప్రజలపై ప్రభుత్వం ప్రయోగిస్తున్న సరికొత్త ఆయుధం పెల్లెట్ గన్ అనేక మంది యువకులను అంధులుగా మార్చింది. ఆందోళనలు, కాల్పులు, మరణాలు ఒక ఎత్తయితే కాశ్మీర్ సమస్యలపై ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం, దాని పర్యవసానాలు మరో ఎత్తు.

బిజెపి నాయకత్వంలో మోడి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి రావడంతోనే ఆర్ఎస్ఎస్ వ్యూహాన్ని లోయలో అమలుపరచబూనుకోవడమే సరికొత్త అలజడికి కారణం. 370 అధికరణం కాశ్మీర్‌కు ఇస్తున్న స్వయం ప్రతిపత్తి హక్కులను హరించడానికి మోడీ ప్రభుత్వం కొత్త ఎత్తుగడలు ప్రారంభించింది. కాశ్మీరీ పండిట్లకు పునరావాసం, భద్రతా దళాల స్థావరాల పేరుతో కాశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను 370 అధికరణం పరిధి నుండి తప్పించ బూనుకుంది. పాలస్తీనా ఆక్రమణకు ఇజ్రాయిల్ అనుసరించిన వ్యూహాన్ని చేపట్టింది. ఇది సహజంగానే కాశ్మీరీల్లో అసంతృప్తినీ, అలజడినీ సృష్టించింది. రాష్ట్రంలో జరిగిన గత ఎన్నికల్లో కాశ్మీర్ లోయలోని ప్రజలు బిజెపిని పూర్తిగా తిరస్కరించారు. అక్కడ బిజెపీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా రాలేదు. మతపరమైన చీలికను సృష్టించడం ద్వారా జమ్మూ ప్రాంతంలో ఆ పార్టీ ఎక్కువ స్థానాలు దక్కించుకున్నా ఏ పార్టీకీ మెజారిటీ రాని స్థితిలో పిడిపితో జతకట్టి రాష్ట్రంలో పరోక్షంగా బిజెపి అధికారంలోకి వచ్చింది. అలా వచ్చింది మొదలు అది అనుసరించిన విధానాలు కాశ్మీర్‌ను మరోసారి కల్లోలంలో ముంచాయి.

హక్కుల కోసం, స్వయం ప్రతిపత్తి కోసం, నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న కాశ్మీర్ ప్రజలందరినీ వేర్పాటు వాదులుగా పరిగణించి వారిపై నిర్బంధానికి దిగడం ద్వారా బిజెపి ప్రభుత్వం వేర్పాటు వాదులకు మరింత బలం చేకూరుస్తోంది. కాశ్మీర్ సమస్యకు అంతర్గత పరిష్కారాలు వెదకకుండా మొత్తం సమస్యకు పాకిస్తాన్ కారణమని పదేపదే చెప్పడం ద్వారా ఈ సమస్యను అంతర్జాతీయ సమస్యగా మార్చాలని చూస్తున్నది. పైగా ఒకవైపు కాశ్మీర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదని చెబుతూ మరోవైపు పాకిస్తాన్‌లో బెలూచిస్తాన్, గిల్గిట్-బాల్టిస్తాన్ ఆందోళనల గురించి స్వతంత్ర దినోత్సవ ప్రసంగంలో నరేంద్ర మోడీ ప్రస్తావించడం ద్వారా మనం కూడా పాక్‌లో ఉగ్రవాదానికి మద్దతిస్తున్నామన్న పాక్ వాదనలకు బలం చేకూర్చారు. కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయ సమస్యగా మార్చడానికి ఏ అవకాశం దొరుకుతుందా అని కాచుక్కూర్చున్న పాకిస్తాన్‌కు మోడి తన దుస్సాహస ప్రకటనలతో మంచి అవకాశాన్ని ఇచ్చాడు. ఇప్పుడు నవాజ్ షరీఫ్ ప్రభుత్వం కాశ్మీర్ సమస్యను అంతర్జాతీయం చేసి దానిపై ఐక్యరాజ్యసమితి జోక్యాన్ని కోరుతూ ప్రపంచంలోని వివిధ దేశాల రాజధానులకు దూతలను పంపింది.

కాశ్మీర్ సమస్య కేవలం భారత్-పాక్ సమస్య కాదు. కాశ్మీర్‌లో ప్రజలున్నారు. వారికి ఆలోచనలు, ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయి. వాటిని పరిగణలోకి తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అందులోనూ కాశ్మీర్ కీలకమైన, సున్నితమైన సరిహద్దు రాష్ట్రం గనుక ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వానికే ఎక్కువ బాధ్యత ఉంది. నిర్బంధ విధానాలు, కయ్యానికి కాలుదువ్వే వైఖరితో కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో, ఇరుగుపొరుగుతో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యను పరిష్కరించుకోవడం ద్వారానే దేశ ప్రయోజనాలు రక్షించబడతాయని ప్రభుత్వాలు గుర్తెరగడం మంచిది. కానీ మోడి ప్రభుత్వ హిందూత్వ సిద్ధాంతం దీనికి అడ్డుపడుతోంది. ముస్లిం వ్యతిరేకత, పాకిస్తాన్ వ్యతిరేకత, అఖండ భారత్ అనే ఆర్ఎస్ఎస్ కల, ఇవన్నీ కలగలసి కాశ్మీర్ విషయంలో మన ప్రభుత్వ విధానాన్ని దేశానికి నష్టదాయకంగా మార్చేస్తున్నాయి. మన దేశ ప్రయోజనాలను ప్రమాదంతో పడవేసే కేంద్ర ప్రభుత్వ దుస్సాహస విధానాలను వ్యతిరేకించాలి.

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ. 10**, సంవత్సర చందా: **రూ. 100**, పోస్టు ద్వారా **రూ. 120**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
మేనేజర్,
మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),
ఎం.బి. విజ్ఞానకేంద్రం,
డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520 002

# సిపిఐ నూతన కార్యక్రమం

**ప్రకాశ్ కరత్**



రచయిత సిపిఐ (ఎం)
పొలిట్‌బ్యూరో సభ్యులు

ఏదైనా కమ్యూనిస్టు పార్టీకి పార్టీ కార్యక్రమం అత్యంత కీలకమైన పత్రం. ఒక విప్లవ దశకు సంబంధించి పార్టీ నిర్దేశించుకున్న వ్యూహాత్మక లక్ష్యాల గురించిన ప్రస్తావన ఈ పత్రంలో ఉంటుంది.

భారత కమ్యూనిస్టు ఉద్యమంలో, ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం అటువంటి కార్యక్రమాన్ని రూపొందించటం అంటే భిన్నాభిప్రాయాలు, వైవిధ్యాల మధ్య ఘర్షణే. స్వాతంత్ర్యానంతరం రాజ్యాధికారం చేపట్టిన పాలకవర్గ స్వభావం, తదనుగుణంగా భారత దేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన వ్యూహం గురించి దశాబ్దకాలం పాటు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అంతర్గత చర్చలు జరిగాయి.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో అటువంటి కార్యక్రమంపై ఏకాభిప్రాయానికి వచ్చేందుకు 1961లో విజయవాడలో జరిగిన పార్టీ మహాసభ సందర్భంగా చివరిసారిగా ఓ ప్రయత్నం జరిగింది. ఈ మహాసభలో రెండు ముసాయిదా కార్యక్రమాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఏకాభిప్రాయ సాధన అసాధ్యం కావటంతో పార్టీ కార్యక్రమాన్ని రూపొందించే కసరత్తు వాయిదా పడింది.

చివరకు 1964లో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి సిపిఐ(ఎం) ఏర్పడిన తర్వాతనే రెండు పార్టీలు తమ తమ కార్యక్రమాలు చర్చించి ఆమోదించుకున్నాయి. బొంబాయిలో జరిగిన ఏడవ జాతీయ మహాసభల్లో సిపిఐ, కలకత్తాలో జరిగిన ఏడవ మహాసభల్లో సిపిఐ (ఎం) తమ కార్యక్రమాన్ని ఆమోదించుకున్నాయి.

సుదీర్ఘ చర్చోపచర్చల తర్వాత కూడా భారతదేశంలో విప్లవ సాధనకు అనుసరించాల్సిన విప్లవ వ్యూహం ఏమిటన్న ప్రశ్న అపరిష్కృతంగానే మిగిలింది. దాంతో రెండు పార్టీలు చీలిపోయి రెండు వేర్వేరు కార్యక్రమాలు ఆమోదించుకున్నాయి. అనుసరించే ఎత్తుగడల వైఖరికి సంబంధించిన భిన్నాభిప్రాయాలు అయితేనో, కొన్ని సైద్ధాంతిక అంశాలపై వేర్వేరు అభిప్రాయాలు అయితేనో భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం చీలిపోయి ఉండేదే కాదు.

రెండు కమ్యూనిస్టు పార్టీలు తమ మౌలికమైన వ్యూహాత్మక పత్రాలు ఆమోదించుకుని ఐదు దశాబ్దాలు గడిచాయి. అనేక రాజకీయ అంశాలకు సంబంధించి రెండు కమ్యూనిస్టు పార్టీలు ఈ కాలంలో ఏకాభిప్రాయానికి వచ్చాయి. సమకాలీన రాజకీయ పరిస్థితుల్లో అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో కూడా ఏకాభిప్రాయానికి వచ్చాయి. తద్వారా వామపక్ష ఐక్యతను బలోపేతం చేయగలిగాయి.

త్రివేండ్రంలో 2000 సంవత్సరంలో జరిగిన ప్రత్యేక మహాసభల్లో సిపిఐ(ఎం) తన కార్యక్రమాన్ని తాజాపరుచుకున్నది. జాతీయ, అంతర్జాతీయ పరిస్థితుల గురించిన విశ్లేషణ, ప్రత్యేకించి వర్గ సంబంధాల గురించిన అవగాహనను తాజాపరుచుకున్నది. అయితే విప్లవ దశ, రాజ్యాంగయంత్ర స్వభావం, జనతా ప్రజాతంత్ర విప్లవ సాధన కోసం రూపొందించాల్సిన వర్గ పొందిక, ఈ విప్లవానికి నాయకత్వం వహించే వర్గం గురించి 1964 కార్యక్రమంలో చెప్పిన మౌలిక అవగాహనను సిపిఐ(ఎం) కొనసాగిస్తూ వచ్చింది. పార్టీ కార్యక్రమాన్ని తాజాపరుచుకోవటానికి ప్రారంభమైన కృషి పూర్తి కావటానికి ఎనిమిది సంవత్సరాల సమయం పట్టింది. 1992లో జరిగిన పార్టీ 14వ మహాసభల్లో పార్టీ కార్యక్రమాన్ని తాజాపరుచుకోవాలన్న నిర్ణయం జరిగింది.

### సుదీర్ఘ ప్రయత్నాలు

సిపిఐకి సంబంధించినంతవరకు ఈ తాజాపరుచుకునే ప్రక్రియ సుదీర్ఘకాలం పాటు పొడిగించబడింది. 1964లో ఆమోదించబడిన సిపిఐ కార్యక్రమాన్ని తాజాపర్చాలని 1986లో జరిగిన 13వ మహాసభలో పార్టీ నిర్ణయించింది. పార్టీ కార్యక్రమ రచనా సంఘాన్ని నియమించింది. ఏడుగురు సభ్యులు రూపొందించిన ముసాయిదా కార్యక్రమాన్ని 1989లో జరిగిన పార్టీ 14వ మహాసభ ముందు చర్చకు పెట్టారు. ముసాయిదా కార్యక్రమాన్ని మహాసభ ఆమోదించలేకపోయింది. 1992లో హైదరాబాద్‌లో జరిగిన పార్టీ 15వ మహాసభల్లో పార్టీ కార్యక్రమ పత్రాన్ని చర్చించి ఆమోదించుకున్నారు. మారిన జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను అవగాహన చేసుకోవటంలో ఇది మధ్యంతర దశ అని చెప్పవచ్చు. అయితే 1992లో ఆమోదించుకున్న పత్రం కీలకమైన రాజ్యాంగ యంత్ర స్వభావం, ప్రజాతంత్ర విప్లవ సాధనకు అవసరమైన వర్గ పొందిక వంటి కీలక అంశాలతో కూడిన పూర్తిస్థాయి పార్టీ కార్యక్రమం అని చెప్పటానికి వీల్లేదు.

ఈ దిశగా 1995లో జరిగిన పార్టీ 16వ మహాసభలో ఎన్నికయ్యే జాతీయ మండలి పార్టీ కార్యక్రమ రచనా సంఘాన్ని నియమించాలని తీర్మానించింది. దాంతో 1986లో ప్రారంభమైన ప్రయత్నాలు కొనసాగుతూ వచ్చాయి.

చివరకు 2015 మార్చిలో పాండిచ్చేరిలో జరిగిన పార్టీ 22వ జాతీయ మహాసభల్లో పార్టీ నూతన కార్యక్రమ పత్రాన్ని ఆమోదించుకున్నారు. సుదీర్ఘ చర్చలు, ప్రయత్నాల తర్వాత ఆమోదించుకున్న ఈ కార్యక్రమం సిపిఐ భవిష్యత్తుకు, భారతదేశంలో వామపక్ష ఉద్యమ భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన పత్రంగా ఉండబోతోంది.

అందువల్ల సిపిఐ కార్యక్రమాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించటం, అధ్యయనం చేయటం ప్రయోజనకరంగా ఉంటుంది.

పార్టీ కార్యక్రమం వర్గ విశ్లేషణ, విప్లవ దశ, రాజ్యాంగ యంత్ర స్వభావం, విప్లవ సాధనకు నిర్మించాల్సిన వర్గ శక్తుల ఐక్యత, దానికి ప్రస్తుత రాజ్యాంగ వ్యవస్థ స్థానంలో ప్రత్యామ్నాయ రాజ్యాంగ యంత్రాన్ని అధికారానికి తేవటం, తద్వారా సోషలిజం స్థాపన వరకు ఈ ప్రయత్నాలకు నాయకత్వం వహించే వర్గం గురించిన అంశాలపై ఆధారపడి ఉంటుంది.

రాజ్యాంగ యంత్ర స్వభావం

1964లో ఆమోదించబడిన సిపిఐ, సిపిఐ (ఎం) కార్యక్రమాలు విప్లవ దశను ప్రజాతంత్ర విప్లవ దశగా నిర్ధారించాయి. అపరిష్కృతంగా మిగిలిపోయిన సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక లక్ష్యాలను నెరవేర్చాల్సిన అవసరం ఉన్నదన్న విషయాన్ని అంగీకరించటంలో భాగమే విప్లవదశను ప్రజాతంత్ర

విప్లవదశగా వర్గీకరించటం.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అధికారానికి వచ్చిన ప్రభుత్వ వర్గ స్వభావం, ఈ రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా సాగే విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లటానికి అనుసరించాల్సిన వర్గ వ్యూహం వంటి కీలక అంశాలకు సంబంధించి విప్లవోద్యమంలో విభేదాలు తలెత్తాయి. భారతీయ సమాజంలో వర్గ విశ్లేషణ అంటే పాలకవర్గాల్లో కీలక స్థానం ఆక్రమిస్తున్న దోపిడీ వర్గాలను గుర్తించటమే. ఈ దోపిడీ వర్గమే రాజ్యాంగ యంత్రాన్ని నియంత్రిస్తుంది. రాజ్యాంగ యంత్ర స్వభావాన్ని నిర్ధారిస్తుంది. విప్లవ వ్యూహంలో ఇది కీలకమైన అంశం. ఈ వ్యూహంలో ప్రధాన శత్రువు ఎవరు, విప్లవోద్యమం ఏ వర్గ శత్రువుకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టాలి అన్న అంశాలకు సంబంధించిన స్పష్టతనిస్తుంది.

**రాజ్యాంగ యంత్రం గురించిన భిన్నాభిప్రాయాలు**

సిపిఐ(ఎం) రాజ్యాంగ యంత్రాన్ని నిర్ధారించి దాని లక్షణాన్ని అంచనా వేస్తూ ఈ విధంగా చెప్పింది:

"బడా బూర్జువాల నాయకత్వంలో ఉన్న బూర్జువా భూస్వామ్య వర్గాల చేతుల్లో సాధనం భారత ప్రభుత్వం. ఈ వర్గాలు పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాను అనుసరిస్తూ అంతకంతకూ విదేశీ ద్రవ్య పెట్టుబడితో మిలాఖత్ అవుతాయి. దేశ జీవనంలో ప్రభుత్వం పోషించే పాత్రను ప్రభావితం చేసేది ఈ వర్గ స్వభావమే"

తాజా పర్చబడిన కార్యక్రమంలో రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన ఈ అంచనాను యథాతథంగా కొనసాగించింది సిపిఐ(ఎం).

భారత కమ్యూనిస్టు పార్టీ తన 1964 నాటి పార్టీ కార్యక్రమంలో రాజ్యాంగ యంత్ర స్వభావం గురించి ప్రస్తావిస్తూ ఇలా చెప్పింది:

భారతదేశంలో ప్రభుత్వం యావత్తు జాతీయ బూర్జువా వర్గ పాలనా సాధనం. ఈ వర్గం పెట్టుబడిదారీ విధానాన్ని సమర్థించి జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తిలోనూ, పంపిణీలోనూ, మారకంలోనూ పెట్టుబడిదారీ సంబంధాలను అభివృద్ధి చేస్తుంది.

ప్రభుత్వ ఏర్పాటు, అధికార చలాయింపును బడా బూర్జువా వర్గం గణనీయంగా ప్రభావితం చేస్తుంది.

జాతీయ బూర్జువావర్గం భూస్వాములతో రాజీ పడుతుంది. వారిని ప్రభుత్వంలో ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా నియమించుకుంటుంది.

ఈ సూత్రీకరణను 1968లో జరిగిన పార్టీ 8వ మహాసభల్లో సవరించి కొత్త పేరాగ్రాఫ్ జోడించారు. జోడించిన పేరాగ్రాఫ్ ఇలాఉంది

> **"సిపిఐ, సిపిఐ(ఎం) కార్యక్రమాల్లో పైన పేర్కొన్న రెండు పేరాగ్రాఫ్‌లలో ఉన్న అర్థంలో గణనీయమైన వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం వర్గ పొందిక, విప్లవ వ్యూహం, అనుసరించాల్సిన ఎత్తుగడలపై పెద్దఎత్తున ప్రభావం చూపుతుంది. రెండు పార్టీల కార్యక్రమాల్లో ఉన్న మౌలిక వ్యత్యాసాలు ఈ విధంగా వర్గీకరించుకోవచ్చు."**

భారతదేశంలోని రాజ్యాంగ యంత్రం యావత్తు జాతీయ బూర్జువా వర్గం చేతుల్లో వర్గ పాలనా సాధనంగా ఉంటుంది. ఈ ప్రభుత్వంలో బడా బూర్జువా వర్గం గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఈ వర్గం భూస్వాములతో బలమైన సంబంధాలు కలిగి ఉంటుంది. ఈ సంబంధాలు రాజ్యాధికార నిర్వహణలో మితవాద ధోరణులకు దారితీస్తాయి.

సిపిఐ, సిపిఐ(ఎం) కార్యక్రమాల్లో పైన పేర్కొన్న రెండు పేరాగ్రాఫ్‌లలో ఉన్న అర్థంలో గణనీయమైన వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం వర్గ పొందిక, విప్లవ వ్యూహం, అనుసరించాల్సిన ఎత్తుగడలపై పెద్దఎత్తున ప్రభావం చూపుతుంది. రెండు పార్టీల కార్యక్రమాల్లో ఉన్న మౌలిక వ్యత్యాసాలు ఈ విధంగా వర్గీకరించుకోవచ్చు :

సిపిఐ(ఎం) కార్యక్రమం ప్రకారం బడా బూర్జువా వర్గం రాజ్యాంగయంత్రానికి నాయకత్వం వహించే స్థానంలో, మొత్తం రాజ్యాంగ యంత్రాన్ని నియంత్రించే స్థానంలో ఉంది. సిపిఐ కార్యక్రమం బడా బూర్జువావర్గానికి నాయకత్వ పాత్రను తిరస్కరిస్తోంది. 1964 సిపిఐ కార్యక్రమంలో బడా బూర్జువావర్గం గురించి ప్రస్తావిస్తూ రాజ్యాంగ యంత్రంపై "గణనీయమైన ప్రభావం కలిగి ఉంది" అని అంచనా వేస్తే 1968 నాటి సవరణ 'శక్తివంతమైన ప్రభావాన్ని కలిగి ఉంది' అని అంచనా వేసింది.

ఉభయ పార్టీల కార్యక్రమాల మధ్య ఉన్న కీలకమైన వ్యత్యాసం ఇది. భారత రాజ్యాంగ యంత్రం స్వభావాన్ని అంచనా వేయటంలో ఉన్న ఈ వ్యత్యాసమే రెండు పార్టీల కార్యక్రమాల మధ్య కీలకమైనది. ఆరంభం నుండీ బడా బూర్జువా వర్గం భారతదేశపు పెట్టుబడిదారీ వర్గంలో శక్తివంతమైన ప్రభావాన్ని కలిగి ఉన్న వర్గంగా ఉంది. యూరప్‌లో ఆవిర్భవించి అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ విధానానికి భిన్నంగా భారతదేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందింది. యూరోపియన్ దేశాల్లో పెట్టుబడిదారీ వర్గం బడా బూర్జువావర్గంగానూ, గుత్తపెట్టుబడిదారీ వర్గంగానూ ఎదగటానికి చాలా సమయం పట్టింది. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి పరిపక్వానికి చేరాక గానీ ఈ వర్గం ఏర్పడలేదు. దీనికి భిన్నంగా వలస పాలనలో ఉన్న భారతదేశంలో ఉన్న నిర్దిష్ట పరిస్థితుల కారణంగా భారతదేశంలో బడా బూర్జువా వర్గం తయారు కావటానికి అట్టే సమయం పట్టలేదు. స్వాతంత్ర్యానంతరం తొలి దశాబ్దాల్లో బడా బూర్జువావర్గం విస్తరించటమే కాక రాజ్యాంగ యంత్రంపై దాని పట్టు కూడా విశేషంగా పెంచుకుంటూ పోయింది.

ఈ బడా బూర్జువా వర్గమే భారత రాజ్యాంగ యంత్రానికి నాయకత్వ స్థానంలో ఉండటంతో దేశంలో వేళ్లూనుకున్న పెట్టుబడిదారీ విధానం దశ, దిశలను అది శక్తివంతంగా ప్రభావితం చేయగలిగింది. ఈ బడా బూర్జువావర్గం అటు సామ్రాజ్యవాదంతో రాజీపడటమే కాదు. ఇటు భూస్వామ్య వర్గంతో కూడా సత్సంబంధాలు కొనసాగిస్తూ వచ్చింది. సిపిఐ(ఎం) కార్యక్రమం విశ్లేషించిన విధంగా :

రాజ్యాంగ యంత్రంపై తనకున్న పట్టును ఉపయోగించుకుని ఒకవైపు సాధారణ ప్రజానీకంపై దాడి చేయటంతో పాటు మరో వైపున సామ్రాజ్యవాదం, భూస్వామ్య వ్యవస్థలతో ఉన్న వైరుధ్యాన్ని పరిష్కరించుకోవటానికి బేరసారాలకు దిగింది.

ఈ క్రమంలో విదేశీ గుత్తపెట్టుబడిదారులతో బలమైన సంబంధాలు నెలకొల్పుకోవటమే కాక భూస్వామ్య వర్గంతో అధికారం పంచుకున్నది.

సిపిఐ(ఎం) విశ్లేషణకు భిన్నంగా సిపిఐ కార్యక్రమం భారత దేశంలో రాజ్యాంగ యంత్రానికి జాతీయ బూర్జువావర్గం నాయకత్వం వహిస్తోంది. బడా బూర్జువా వర్గం కేవలం నాయకత్వ పాత్రకు బదులుగా గణనీయమైన

**"అటువంటి విప్లవ సాధనలో రాజ్యాంగ యంత్రం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ బూర్జువావర్గం కార్మికవర్గానికి చెప్పుకో దగ్గ మిత్రుడుగా ఉంటుందని సిపిఐ కార్యక్రమం ప్రతిపాదిస్తోంది. పాలకవర్గ కూటమిలో సామ్రాజ్య వాదులు, భూస్వాములు భాగస్వాములు కారు అన్న అవగాహన నుండే ఇటువంటి నిర్ధారణలు ఉత్పన్నమవుతాయి."**

ప్రభావం చూపే స్థాయికి పరిమితం అయిన వర్గంగా ఉంది అని విశ్లేషించింది. అంతేకాదు. రాజ్యాంగ యంత్రానికి బూర్జువా భూస్వామ్య వర్గాల మిలాఖత్ బలమైన పునాదులు వేసిందని విశ్లేషించిన సిపిఐ(ఎం) కార్యక్రమానికి భిన్నంగా సిపిఐ కార్యక్రమం బూర్జువావర్గానికి భూస్వామ్య వర్గంతో బలమైన సంబంధాలు ఉన్నాయని మాత్రమే అంచనా వేసింది. భూస్వామ్య వర్గం పాలకవర్గంలో ముఖ్యమైన అంతర్భాగమా కాదా అన్నదానిపైనే విప్లవ వ్యూహంలో వారిపట్ల అనుసరించాల్సిన వైఖరి నిర్ధారితమవుతుంది. సిపిఐ కార్యక్రమం వ్యాఖ్యానం ప్రకారం భూస్వామ్య వర్గం పాలకవర్గంలో అంతర్భాగం కాదు.

ఉభయ పార్టీల కార్యక్రమాల్లో మరో చెప్పుకోదగ్గ వ్యత్యాసం కూడా ఉంది. భారతదేశంలో పాలకవర్గాలు అనుసరించిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా పర్యవసానంగా విదేశీ గుత్త పెట్టుబడి దేశీయ బడా బూర్జువా వర్గంతో మిలాఖత్ అయి ఉంటుంది అని సిపిఐ (ఎం) కార్యక్రమం విశ్లేషించింది. అందువల్ల సామ్రాజ్యవాదం, భూస్వామ్య వర్గాలు రాజ్యాంగ యంత్రం, పాలక వర్గాలతో అత్యంత సన్నిహితమైన సంబంధాలు కలిగి ఉంటారు అని సిపిఐ(ఎం) కార్యక్రమం విశ్లేషిస్తే దీనికి భిన్నంగా సిపిఐ కార్యక్రమం పాలకవర్గాలతో సామ్రాజ్యవాదానికీ, విదేశీ ద్రవ్య పెట్టుబడికీ ఎటువంటి సంబంధం ఉండదని విశ్లేషించింది.

రాజ్యాంగ యంత్రపు వర్గ స్వభావం గురించిన అంచనా, విశ్లేషణ ఎన్నో ముఖ్యమైన పర్యవసానాలకు దారితీస్తుంది. సిపిఐ కార్యక్రమం ప్రకారం రాజ్యాంగ యంత్రంపై జాతీయ బూర్జువావర్గం పూర్తి స్థాయి ఆధిపత్యం కలిగి ఉంటుంది. బడా బూర్జువావర్గం కేవలం శక్తివంతమైన ప్రభావాన్ని మాత్రమే చూపుతుంది తప్ప రాజ్యాంగయంత్రంలో భాగస్వామి కాదు. ఈ అవగాహన సిపిఐ(ఎం) కార్యక్రమం ఇచ్చిన అవగాహనకు పూర్తి భిన్నమైనది. అతేకాదు. సిపిఐ కార్యక్రమం ప్రకారం భూస్వాములు కూడా పాలకవర్గంలో భాగస్వాములు కాదు. రాజ్యాంగయంత్రాన్ని నియంత్రించటంలో వారు భాగస్వాములు కాదు అని అంచనా వేయటం ద్వారా భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక కర్తవ్యాన్ని నెరవేర్చటంలో జాతీయ బూర్జువావర్గం పాత్రను అతిగా అంచనా వేసింది సిపిఐ కార్యక్రమం. జాతీయ బూర్జువా వర్గం విషయంలో కూడా ఇటువంటి అతి అంచనాలకే దారితీసింది సిపిఐ కార్యక్రమం.

రాజ్యాంగ యంత్రం జాతీయ బూర్జువా వర్గపు రాజ్యాంగ యంత్రం అని వర్గీకరించటం అంటే సదరు రాజ్యాంగ యంత్రం వర్గ శత్రువు చేతుల్లో లేదని నిర్ధారించటమే అవుతుంది. సిపిఐ కార్యక్రమం ప్రకారం జాతీయ బూర్జువా వర్గం ఒకవైపున రాజ్యాధికారంపై సంపూర్ణ పెత్తనం చెలాయిస్తూనే మరోవైపున జాతీయ ప్రజాతంత్ర విప్లవ సాధనలో కూడా భాగస్వామిగా ఉంటుంది. కార్మికవర్గం ఈ జాతీయ బూర్జువా వర్గాన్ని ఒప్పించి, మెప్పించి ప్రజా తంత్ర లక్ష్యాల సాధన దిశగా కలుపుకు రావటానికి కృషిచేయాలని సిపిఐ కార్యక్రమం ప్రతిపాదిస్తోంది. ఈ విధంగా కార్మికవర్గంతో జతకట్టిన జాతీయ బూర్జువావర్గం రాజ్యాంగ యంత్రంపై సామ్రాజ్యవాదులు, బడా బూర్జువా వర్గం, భూస్వామ్యవర్గపు ప్రగతి నిరోధక ప్రభావాన్ని నియంత్రించేందుకు కృషి చేయాలి. భారత రాజ్యాంగ యంత్రం గురించి 1956లో నాటి సోవియట్ కమ్యూనిస్టు పార్టీ వేసుకున్న అంచనాలకు అనుగుణంగానే సిపిఐ కార్యక్రమం లోని అంచనాలు ఉన్నాయన్న విషయాన్ని మనం స్పష్టంగా గమనించవచ్చు.

ఈ అవగాహనే పాలకవర్గం, పాలకవర్గాల ప్రధాన ప్రతినిధిగా ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్ల సిపిఐ సానుకూల వైఖరి ప్రదర్శించటానికి పునాదిగా ఉంది. సిపిఐ ప్రతిపాదించిన జాతీయ ప్రజాతంత్ర విప్లవం సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, గుత్త పెట్టుబడి దారి వ్యతిరేక స్వభావాన్ని కలిగి ఉంటుంది. అటువంటి విప్లవ సాధనలో రాజ్యాంగ యంత్రం, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ బూర్జువావర్గం కార్మికవర్గానికి చెప్పుకో దగ్గ మిత్రుడుగా ఉంటుందని సిపిఐ కార్యక్రమం ప్రతిపాదిస్తోంది. పాలకవర్గ కూటమిలో సామ్రాజ్యవాదులు, భూస్వాములు భాగస్వాములు కారు అన్న అవగాహన నుండే ఇటువంటి నిర్ధారణలు ఉత్పన్నమవుతాయి. ఇటువంటి అవగాహన కారణంగానే జాతీయస్థాయిలో (1996, 2004 సంవత్సరాల్లో వచ్చినట్లుగా) అవకాశాలు వచ్చినపుడు బూర్జువావర్గం నాయకత్వంలో ఏర్పాటయ్యే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములు కావటానికి సిపిఐ వెనకాడలేదు.

ముసాయిదా కార్యక్రమం తాజాపర్చటానికి జరిగిన ప్రయత్నాల్లో రాజ్యాంగయంత్రం వర్గ స్వభావాన్ని పునఃపరిశీలించే ప్రయత్నం జరగలేదు. 1989లో జరిగిన పార్టీ 14వ మహాసభల్లో ప్రతిపాదించిన ముసాయిదా కార్యక్రమంలో రాజ్యాంగ యంత్రం గురించిన అంచనా 1968 నాటి పార్టీ కార్యక్రమంలో వేసుకున్న అంచనా మధ్య తేడా లేకపోవటాన్ని గమనించాలి.

భారతదేశంలో రాజ్యాంగయంత్రం యావత్తు జాతీయ బూర్జువావర్గ పాలనకు సాధనంగా ఉంటుంది. దానిపై బడా బూర్జువా వర్గం గణనీయమైన ప్రభావం కలిగి ఉంటుంది. ఈ పాలకవర్గం భూస్వామ్య వర్గంతో బలమైన సంబంధాలు కలిగి ఉంటుంది. రాజ్యాంగ యంత్రంలో ప్రతికూల ధోరణులకు ఈ వర్గాల ప్రభావమే కారణం.

ముసాయిదా కార్యక్రమ రచన బాధ్యత స్వీకరించిన కార్యక్రమ రచనా సంఘం కన్వీనరుగా ఉన్న జగన్నాథ్ సర్కార్ అభిప్రాయం పైన ప్రస్తావించిన అభిప్రాయానికి భిన్నంగా ఉంది. రాజ్యాంగ యంత్ర స్వభావం గురించి సర్కార్ తన భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ సవరణ ప్రతిపాదించారు.

భారతదేశంలో రాజ్యాంగ యంత్రం భారతీయ బూర్జువా వర్గ పాలన సాధనం. ఈ పాలక వర్గానికి భూస్వాములు మిత్రులుగా ఉన్నారు. ఈ రాజ్యాంగ యంత్రంపై బడా బూర్జువావర్గం నిర్ణయాత్మక ప్రభావాన్ని కలిగి ఉంటుంది. భారతీయ బూర్జువా వర్గానికి భూస్వామ్య వర్గంతో ఉన్న మిత్రత్వం, రాజ్యాంగ యంత్రంపై బడా బూర్జువావర్గం కలిగి ఉన్న నిర్ణయాత్మక ప్రభావం వలన మితవాద ధోరణులు తలెత్తుతున్నాయి.

పాలకవర్గంలోని కీలక పాత్రదారుగా ఉ

న్న బూర్జువావర్గం చారిత్రకంగా భూస్వామ్య వర్గంతో సన్నిహిత సత్సంబంధాలు కలిగి ఉంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో సాధారణంగా సంస్థానాధీశులు, పెద్ద పెద్ద భూస్వాములు బ్రిటిష్ పాలన వైపు మొగ్గితే మధ్యశ్రేణి, చిన్న భూస్వాములు వలసవాద బానిసత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి మద్దతు ఇచ్చారు. రాజకీయరంగంలో ఈ పరిణామం బూర్జువాలను, భూస్వాములను సన్నిహిత మిత్రులుగా మార్చటానికి దోహదం చేసింది. స్వాతంత్ర్యానంతరం కూడా ఈ వర్గ ఐక్యత కొనసాగించబడింది. (భారత కమ్యూనిస్టు పార్టీ ముసాయిదా కార్యక్రమం, కమ్యూనిస్టు పార్టీ ప్రచురణ, 1989)


సర్కార్ ప్రతిపాదనలో బడా బూర్జువా వర్గం భారత రాజ్యాంగ యంత్రంపై నిర్ణయాత్మక ప్రభావాన్ని కలిగి ఉంది. అంతేకాదు. బూర్జువా భూస్వామ్య వర్గాల మధ్య మిత్రత్వాన్ని కూడా ఈ సవరణ గుర్తిస్తోంది. పెట్టుబడిదారీ వర్గంలోనే బడా బూర్జువా వర్గం అత్యంత శక్తిశాలి అయిన వర్గం అని దాని స్వభావాన్ని, వర్గ లక్షణాన్ని ప్రత్యేకంగా గుర్తించేందుకువీలుగా ఆయన జాతీయ బూర్జువా అన్న పదబంధాన్ని వాడకపోవటాన్ని మనం గమనించవచ్చు.

ముసాయిదా కార్యక్రమం రచనా సంఘంలో మరో సభ్యునిగా ఉన్న పికె వాసుదేవన్ నాయర్ సైతం బడా బూర్జువా వర్గం రాజ్యాంగ యంత్రంపై నిర్ణయాత్మక ప్రభావాన్ని కలిగి ఉందన్న సవరణ ప్రతిపాదిస్తారు.

22వ మహాసభల్లో ఆమోదించిన సిపిఐ కార్యక్రమంలో పాలకవర్గ స్వభావం గురించిన అంచనాలో ముఖ్యమైన మార్పులు జరిగాయి. తాజా కార్యక్రమం అంచనా మేరకు :

8.1. భారతదేశంలో ప్రభుత్వం గుత్త పెట్టుబడిదారీ వర్గం నాయకత్వాన ఉన్న కార్పొరేట్ బడా బూర్జువా వర్గాల నాయకత్వాన ఉన్న బూర్జువా వర్గ ప్రభుత్వం. ఈ వర్గాలకు అర్ధ భూస్వామ్య, పెట్టుబడిదారీ భూస్వామ్య వర్గాలతో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ వర్గాల మధ్య ఉన్న సంబంధాలు ప్రభుత్వాలు నిర్ణయించే ఆర్థిక విధానాలను ప్రభావితం చేస్తున్నాయి. వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ సంబంధాలకు దిశా నిర్దేశం చేస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ పరిధిలో పని చేస్తూ అమెరికా, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ప్రతినిధులుగా ఉన్న సంస్థలతో సంబంధాలను పెంపొందించుకొంటోంది.

“జాతీయ బూర్జువావర్గం అన్న పదబంధాన్ని వదులుకున్నట్లు పై పేరాగ్రాఫ్‌ను పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఇది సరైన చర్య. ఇంతకు పూర్వం ఉనికిలో ఉన్న పార్టీ కార్యక్రమాల్లో ఉన్న నిర్ధారణల నుండి వైదొలగిన తాజా కార్యక్రమం భారత ప్రభుత్వాన్ని గుత్తపెట్టుబడిదారీ వర్గం నాయకత్వాన ఉన్న కార్పొరేట్ బడా బూర్జువా వర్గాల నాయకత్వాన ఉన్న బూర్జువా ప్రభుత్వం గా గుర్తిస్తోంది.”



ఎబి బర్ధన్

జాతీయ బూర్జువావర్గం అన్న పదబంధాన్ని వదులుకున్నట్లు పై పేరాగ్రాఫ్‌ను పరిశీలిస్తే అర్థం అవుతుంది. ఇది సరైన చర్య. ఇంతకు పూర్వం ఉనికిలో ఉన్న పార్టీ కార్యక్రమాల్లో ఉన్న నిర్ధారణల నుండి వైదొలగిన తాజా కార్యక్రమం భారత ప్రభుత్వాన్ని గుత్తపెట్టుబడిదారీ వర్గం నాయకత్వాన ఉన్న కార్పొరేట్ బడా బూర్జువా వర్గాల నాయకత్వాన ఉన్న బూర్జువా ప్రభుత్వంగా గుర్తిస్తోంది. తాజా కార్యక్రమంలో పాలక వర్గాలకు భూస్వాములతో బలమైన సంబంధాలు ఉన్నాయని చెప్పటం వరకే పరిమితం అయ్యింది. పైగా భూస్వాములను అర్థఫ్యూడల్ భూస్వాములు, పెట్టుబడిదారీ భూస్వాములు అని వర్గీకరించింది. భారతదేశంలో పాలకవర్గాలు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో సంబంధ బాంధవ్యాలు పెంపొందించుకుంటున్నాయి అన్నది తాజా కార్యక్రమంలో మరో కొత్త నిర్ధారణ.

భారతదేశంలో ప్రభుత్వాన్ని బడా బూర్జువాలు, కార్పొరేట్ బూర్జువావర్గ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రభుత్వంగా గుర్తించిన సిపిఐ తాజా కార్యక్రమంలో ప్రభుత్వ వర్గ స్వభావం గురించి వాస్తవానికి మరింత దగ్గరగా అంచనా వేసింది. ఈ అంచనాకు రావటానికి గాను పార్టీ దేశంలో ఉన్న వర్గాల గురించి ఈ విధమైన విశ్లేషణ చేసింది :

పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాకు సంబంధించినంత వరకు అత్యంత ప్రముఖ లక్షణం ఏమిటంటే బడా గుత్తపెట్టుబడిదారుల చేతుల్లో ఆర్థిక శక్తిని కేంద్రీకరిందుకు దారితీసే పెట్టుబడి కేంద్రీకరణ. సాధారణ ప్రజలను దోపిడీ చేయటం ద్వారా ఈ వర్గాలు తమ సంపదను పెంచుకుంటాయి. కొన్ని సందర్భాల్లో ఈ వర్గాల ధన దాహానికి బూర్జువావర్గంలోని దిగువ శ్రేణులు సైతం బలవుతాయి.

అయితే పార్టీ కార్యక్రమంలో పాలకవర్గాల గురించి ప్రస్తావించేటపుడు బడా బూర్జువా వర్గం అన్న పదబంధానికి బదులుగా కార్పొరేట్ బూర్జువా వర్గం, గుత్తపెట్టుబడిదారులు అన్న పదబంధాన్ని ఎందుకు వాడారు అన్నది అంతుబట్టని విషయం. బడా బూర్జువా వర్గంలోని అన్ని తరగతులకు ప్రాతినిధ్యం వహించే పదబంధం బడా బూర్జువా వర్గం అన్న పదబంధం. కార్పొరేట్లు లేదా కార్పొరేషన్లు అన్నది ఒక చట్టబద్ధమైన గుర్తింపు మాత్రమే. అంటే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలను ఈ పేర్లతో ప్రస్తావించటం సాధారణంగా కనిపించే అంశం. బడా కార్పొరేట్ కంపెనీలు బడా బూర్జువావర్గంలో అంతర్భాగం మాత్రమే. అదేవిధంగా బడా గుత్తసంస్థలు కూడా. అంతేకాదు. ఉత్పాదక రంగాల బయట కూడా పెద్దఎత్తున పెట్టుబడి పంపిణీ అవుతోంది. క్రోడీకరించబడుతోంది. (ఉదాహరణకు ప్రసారమాధ్యమాల రంగంలో ఉన్న బడా పెట్టుబడిదారీ సంస్థలను ప్రస్తావించుకోవచ్చు) ఈ పరిణామాలన్నీ పెట్టుబడి కేంద్రీకరణను ఏదో ఒక దశ వరకు ప్రతిబింబిస్తాయి. అందువల్ల ఆయా సంస్థలను బడా బూర్జువావర్గంలో అంతర్భాగాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. కార్పొరేట్ బడా బూర్జువాలు, గుత్త సంస్థలు అన్న వర్గీకరణ ఉద్దేశ్యం సరైనదే అయినప్పటికీ బడా బూర్జువావర్గం అన్న వర్గీకరణ ఇచ్చే విశాల అర్థాన్ని ఈ వర్గీకరణ ఇవ్వటం లేదు.

భూస్వాములు పాలకవర్గాల్లో అంతర్భాగం కాదు అన్న అవగాహన సిపిఐ తాజా కార్య

> **“ఉభయ పార్టీల కార్యక్రమాలు విప్లవ దశను ప్రజాతంత్ర విప్లవ దశ అనే నిర్ధారించాయి. ఈ విప్లవ దశను చేరుకోవటానికి విప్లవ సంఘటనను నిర్మించాలని పిలుపునిచ్చాయి. అయితే ఈ విప్లవ సంఘటనకు ఎవరు నాయకత్వం వహించాలి అన్న అంశంపై రెండు పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.”**

క్రమంలో ప్రధాన లోపంగా కొనసాగుతూ ఉంది. భూస్వాములు పాలకవర్గాల పరిధికి బయట ఉన్న వర్గంగా ఈ తాజా కార్యక్రమం వర్గీకరిస్తోంది. వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలు ప్రధాన లక్షణంగా ఆవిర్భవించిన నేటి పరిస్థితుల్లో క్రమంగా కనుమరుగయ్యే అర్ధ ఫ్యూడల్ భూస్వాముల ఆధిపత్యం కంటే నిరంతరం ఎదుగుతూ ఉన్న పెట్టుబడిదారీ భూస్వాముల ఆధిపత్యం ప్రధాన లక్షణంగా కనిపిస్తోంది. భూస్వామ్యవర్గంతో బూర్జువా వర్గానికి బలమైన సంబంధాలు మాత్రమే ఉన్నాయని నిర్ధారించుకోవటానికి ఉపకరించే ఆధారాలు ఏమీ కనిపించటం లేదు. భూస్వామ్య వర్గం కూడా పాలకవర్గంలో అంతర్భాగంగానే ఉంది. భూస్వామి అన్న తరగతిని నేటికీ ప్రత్యేకంగా చూడటం జరుగుతుంది. ఎందుకంటే సమాజంలో ఉన్న అర్ధ భూస్వామ్య సంబంధాలను ధ్వంసం చేయాల్సి ఉంది కాబట్టి.

సిపిఐ కార్యక్రమం ఒక దశలో గ్రామీణ బూర్జువా వర్గం అన్న ఒక పదబంధాన్ని ప్రయోగించింది. పెట్టుబడిదారీ భూస్వాములు గ్రామీణ బూర్జువావర్గంలో అంతర్భాగం. అటువంటి వర్గం రాజ్యాంగ యంత్రం చట్రానికి బయట ఉంది అని నిర్ధారించుకోవటం అంటే అది అవాస్తవిక నిర్ధారణే అవుతుంది. భారతదేశంలో ప్రభుత్వపు నిజమైన స్వభావాన్ని అంచనా వేయటానికి అర్థం చేసుకోవటానికి సంపూర్ణంగా భూసంస్కరణలు అమలు చేసే కర్తవ్యానికి తూట్లు పొడుస్తూ బడా బూర్జువా వర్గం భూస్వామ్య వర్గంతో షరీకైన తీరు, రాజీ పడిన తీరును కూడా మనం అర్థం చేసుకోవాలి. ప్రజాతంత్ర విప్లవ సాధనకు సమూలమైన భూ సంస్కరణలు ఒక కీలకమైన సాధనం.

భారత పాలకవర్గాలకు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారీ వర్గంతో ఉన్న సంబంధాన్ని గుర్తించటం కూడా పాలకవర్గాల స్వభావాన్ని అంచనా వేయటంలో సరైన నిర్ధారణకు దోహదపడే చర్య. ఈ నిర్ధారణను తార్కిక ముంగింపు దిశగా పొడిగించాల్సి ఉంది. భారతదేశంలో పాలక వర్గాలు అనుసరిస్తున్నన్న పెట్టుబడిదారీ అభివృద్ధి పంథాను ముందుకు తీసుకెళ్లాలంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి, భారతీయ బూర్జువావర్గం మధ్య సంబంధాలు అనివార్యం అన్నదే ఈ తార్కిక ముగింపు అవుతుంది. సిపిఐ(ఎం) కార్యక్రమంలో “ పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా కొనసాగింపులో భాగంగా భారత పాలక వర్గాలు విదేశీ ద్రవ్య పెట్టుబడితో అంతకంతకూ మిలాఖత్ అవుతున్నాయి” అని నిర్ధారించటం వెనక ఉన్న ఉద్దేశ్యం ఇదే.

నేటికీ కొన్ని కీలక అంశాలు, అవగాహనల విషయంలో బలహీనతలు కొనసాగుతున్నప్పటికీ భారత పాలకవర్గాల స్వభావాన్ని సరైన దిశలో అంచనా వేయటంలోనూ, నిర్ధారణకు రావటంలోనూ సిపిఐ ఆమోదించుకున్న తాజా కార్యక్రమం పూర్వపు కార్యక్రమంలో పొందుపర్చుకున్న నిర్ధారణలు, విశ్లేణలతో పోల్చి చూసుకున్నపుడు ఎంతో మెరుగైన ముందగుడు అని చెప్పుకోవాలి.

### ప్రజాతంత్ర విప్లవానికి ఎవరు నాయకత్వం వహించాలి?

ఉభయ పార్టీల కార్యక్రమాల్లో ఉన్న మరో కీలకమైన వైరుధ్యం ప్రజాతంత్ర విప్లవ సంఘటనకు సంబంధించినది. ప్రజాతంత్ర విప్లవ సాధనకు నిర్మించాల్సిన వర్గ పొందిక, దానికి నాయకత్వం వహించే వర్గం ఎవరు అన్న అంశాలకు సంబంధించినది.

ఉభయ పార్టీల కార్యక్రమాలు విప్లవ దశను ప్రజాతంత్ర విప్లవ దశ అనే నిర్ధారించాయి. ఈ విప్లవ దశను చేరుకోవటానికి విప్లవ సంఘటనను నిర్మించాలని పిలుపునిచ్చాయి. అయితే ఈ విప్లవ సంఘటనకు ఎవరు నాయకత్వం వహించాలి అన్న అంశంపై రెండు పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సిపిఐ కార్యక్రమంలో ఈ విప్లవ సంఘటనను జాతీయ ప్రజాతంత్ర సంఘటన అని ప్రస్తావిస్తే, సిపిఐ(ఎం) కార్యక్రమం జనతా ప్రజాస్వామిక సంఘటన అని ప్రస్తావించింది.

1964నాటి కార్యక్రమంలో సిపిఐ జాతీయ ప్రజాతంత్ర సంఘటనకు నాయకత్వం వహించే వర్గం గురించి ఈ విధంగా వివరించింది :

జాతీయ ప్రజాతంత్ర సంఘటన నాయకత్వంలో ఏర్పడే జాతీయ ప్రజాతంత్ర ప్రభుత్వం మధ్యంతర దశ మాత్రమే. ఈ దశలో సామ్రాజ్యవాద శక్తులను, సామ్రాజ్యవాద శక్తుల ప్రయోజనాలను, అర్థభూస్వామ్య శక్తులను, విస్తరిస్తున్న గుత్త శక్తుల ఆధిపత్యాన్ని దునుమాడాలని భావించే శక్తులు, వర్గాలు ఈ సంఘటనకు ఉమ్మడిగా నాయకత్వం వహిస్తాయి. ఈ సంఘటనలో కార్మికవర్గం ఒక్కటే నాయకత్వం వహించే స్థాయికి ఎదగలేదు. అదేసమయంలో బూర్జువావర్గం ఒక్కటే నాయకత్వం వహించే స్థితిలో లేదు. (పేరా 41)

ఈ విధంగా అటు కార్మికవర్గం, బూర్జువా వర్గం దేనికదే సంపూర్ణ నాయకత్వం వహించగల స్థితిలో లేకపోవటం అంటే ఈ రెండు వర్గాల ఉమ్మడి నాయకత్వంలో విప్లవ సంఘటన నిర్మాణం జరగాలని సిపిఐ ఆశిస్తోందా అని సిపిఐ(ఎం) విమర్శించింది. ఈ విమర్శకు సమాధానంగా సిపిఐ తన ఎనిమిదవ మహాసభలో ఆమోదించిన కార్యక్రమంలో మరో పేరాగ్రాఫ్‌ను జోడించింది. ఆ జోడించిన పేరాగ్రాఫ్ ప్రకారం “ ఈ విప్లవ సంఘటనకు నాయకత్వం వహించే శక్తులు నికరమైన సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక, గుత్త సంస్థల వ్యతిరేక స్వభావాన్ని కలిగి ఉంటాయి” అని వివరించింది. ఈ వివరణ కూడా చివరకు విప్లవానికి అనేక వర్గాలు ఉమ్మడిగా నాయకత్వం వహిస్తాయన్న అవగాహననే ఇస్తోంది. 1964 నాటి కార్యక్రమంలో తదుపరి పేరాలో ఉన్న వివరణ ఇలా ఉన్నది :

జాతీయ ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వం, దానికి ప్రాతినిధ్యం వహించే వర్గ పొందికకు కార్మిక కర్షక మైత్రి ఇరుసుగా ఉండనున్నందున కార్మికవర్గం ఈ సంఘటనలో అనతికాలంలో నాయకత్వ స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఎందుకంటే కార్మికవర్గమే జాతీయ ప్రజాతంత్ర సంఘటనకు చైతన్యవంతమైన వారసురాలు. (పే. 48)

సిపిఐ కార్యక్రమం ప్రతిపాదించిన కార్మిక వర్గం, బూర్జువా వర్గపు ఉమ్మడి నాయకత్వంలోని జాతీయ ప్రజాతంత్ర సంఘటనకు భిన్నంగా సిపిఐ(ఎం) కార్యక్రమం ఇలా చెప్పింది.

7.1. ప్రస్తుత దశలో భారతదేశ విప్లవం నెరవేర్చాల్సిన కర్తవ్యాలను సంపూర్ణంగా


నెరవేర్చేందుకు, సాధించేందుకు ప్రస్తుతం ఉన్న బూర్జువా, భూస్వామ్య ప్రభుత్వం స్థానంలో కార్మికవర్గం నేతృత్వంలోని జనతా ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది అని పేర్కొంది. తన నిర్ధారణను మరింత విపులీకరిస్తూ సిపిఐ(ఎం) :

ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించాల్సి ఉంది. సోషలిజం సాధనలో ఈ విప్లవదశకు కార్మికవర్గం నాయకత్వం వహించటం అనివార్యమైన అవసరం. ఇది పాత తరహాకు చెందిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవం కాదు. కార్మికవర్గ నాయకత్వంలో ముందుకు సాగే కొత్త తరహా జనతా ప్రజాస్వామిక విప్లవం. (పే.7.2)

కార్మికవర్గ నాయకత్వం అన్నది పిడివాదం కాదు. చారిత్రక అనుభవాల నుండి నేర్చుకున్న సూత్రం. ఈ అనుభవం నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాల్లో అపరిష్కృతంగా మిగిలిపోయిన ప్రజాతంత్ర విప్లవ లక్ష్యాలను పరిపూర్ణం గావించటంలో బూర్జువావర్గం సఫలం కాలేదు అని రుజువు చేసింది. ప్రత్యేకించి భారతదేశంలో ప్రభుత్వానికి బడా బూర్జువా వర్గం నాయకత్వం వహిస్తున్నందున బడా బూర్జువావర్గం నాయకత్వంలో ఉన్న బూర్జువా భూస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోయటం జనతా ప్రజాస్వామిక విప్లవ దశలో కీలక కర్తవ్యంగా ఉంటుంది. కార్మికవర్గం నాయకత్వంలో మాత్రమే కార్మిక, కర్షక మైత్రిని బలోపేతం చేయటం సాధ్యం అవుతుంది. జనతా ప్రజాస్వామిక సంఘటనలో బూర్జువా వర్గానికి చెందిన కొన్ని శ్రేణులు భాగస్వాములు అయ్యే అవకాశం ఉంది. అయితే వారు నమ్మదగ్గ మిత్రులు కాబోరు. కార్మిక, కర్షక మైత్రి ఎంత బలమైంది అన్నదాన్ని బట్టి బూర్జువావర్గంలోని కొన్ని శ్రేణులు పోషించే పాత్ర ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్దాలు పాటు అమలు జరిగిన పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా, ప్రత్యేకించి నయ ఉదారవాద పెట్టుబడిదారీ విధాన దశలో అమలు జరుగుతున్న విధానాల వలన బడా బూర్జువావర్గం, బడా యేతర బూర్జువావర్గం మధ్య ఉన్న వైరుధ్యం స్తబ్దుగా మారింది. సమకాలీన చరిత్రకు సంబంధించిన ఈ పరిణామాన్ని సిపిఐ కార్యక్రమం పరిగణలోకి తీసుకోలేదు.

సిపిఐ ఆమోదించిన తాజా కార్యక్రమం కూడా జాతీయ ప్రజాతంత్ర విప్లవాన్ని పూర్తి చేసి, సోషలిస్టు విప్లవానికి పునాదులు వేసే కర్తవ్యం వివిధ వర్గాల ఉమ్మడి నాయకత్వంలో సాగుతుంది అన్న పాత ధోరణినే కొనసాగించింది. తాజా కార్యక్రమం :

**"సిపిఐ కార్యక్రమం ఈ పరిణామ దశను కార్మికవర్గం నాయకత్వ స్థానంలో లేకుండానే అధిగమించవచ్చు అని ప్రతిపాదిస్తోంది. కేవలం సుదీర్ఘమైన ఈ దశలో చివరకు కార్మికవర్గ నాయకత్వం, విశాల ప్రజాతంత్ర శక్తుల నాయకత్వం ఖరారు అవుతుంది అని మాత్రమేచెప్పటానికి సిపిఐ కార్యక్రమం పరిమితం అయ్యింది."**



పి.కె. వాసుదేవన్ నాయర్

కార్మికవర్గం, గ్రామీణ కార్మికవర్గం, సాగు చేస్తున్న రైతాంగం, ప్రజాతంత్ర లౌకిక భావాలు కలిగిన మేధావి వర్గం, మధ్యతరగతికి చెందిన విప్లవకర తరగతులు, చిన్న మధ్యతరహా బూర్జువావర్గానికి చెందిన కొన్ని తరగతులు ప్రాప్తకాలజ్ఞతతోగానీ, చైతన్యవంతమైన ప్రయత్నాలతో గానీ జాతీయ ప్రజాతంత్ర విప్లవ దశలో కర్తవ్యాలు నెరవేర్చటానికి గాను పని చేసే వర్గాలు, ప్రజలు. శక్తివంతమైన కార్మిక, కర్షక మైత్రి ప్రాతిపదికన ఈ వర్గాలు బడా బూర్జువావర్గం నాయకత్వాన్ని కూలదోసి, దేశాన్ని ప్రజాతంత్ర విప్లవ దిశగా ముందుకు నడిపిస్తాయి. (పే 9.1)

సోషలిజం సాధనా దిశలో వచ్చే ఈ మధ్యంతర దశకు కార్మికవర్గం మొదలు గ్రామీణ కార్మికవర్గం, బూర్జువా వర్గాలు ఉమ్మడిగా నాయకత్వం వహిస్తాయి అని ఆశించటం అంటే సామ్రాజ్యవాదానికి, బడా బూర్జువా వర్గానికి, అర్ధ ఫ్యూడల్ భూస్వామ్యపు అవశేషాలకు వ్యతిరేకంగా సాగే ఈ పోరాటానికి నిలకడైన, నికరమైన నాయకత్వం ఎవరిది అన్న ప్రశ్నను అస్పష్టంగా వదలిపెట్టడమే అవుతుంది.

సిపిఐ కార్యక్రమం ఈ పరిణామ దశను కార్మికవర్గం నాయకత్వ స్థానంలో లేకుండానే అధిగమించవచ్చు అని ప్రతిపాదిస్తోంది. కేవలం సుదీర్ఘమైన ఈ దశలో చివరకు కార్మికవర్గ నాయకత్వం, విశాల ప్రజాతంత్ర శక్తుల నాయకత్వం ఖరారు అవుతుంది అని మాత్రమేచెప్పటానికి సిపిఐ కార్యక్రమం పరిమితం అయ్యింది.

ఎన్నో ఆకస్మిక ఘటనలు, సామాజిక తిరుగుబాట్ల ద్వారా మాత్రమే అంతిమంగా బూర్జువా వర్గపు నాయకత్వాన్ని కూలదోసి కార్మికవర్గం, విశాల ప్రజాతంత్ర శక్తుల నాయకత్వాన్ని సుస్థిరం చేయగలుగుతాము.

సిపిఐ ఆలోచనలోనూ, సిపిఐ(ఎం) అవగాహనలోనూ మౌలికమైన చెప్పుకోదగ్గ వ్యత్యాసాలు ఉన్నాయి. సిపిఐ(ఎం) అవగాహనలో జనతా ప్రజాస్వామిక విప్లవ దశ నుండి సోషలిస్టు దశను చేరుకోవటం కేవలం విప్లవ శక్తుల వర్గ సంఘటనలో కార్మికవర్గం నాయకత్వ స్థానానికి చేరినపుడు మాత్రమే సాధ్యం అవుతుంది. దీనికి భిన్నంగా ఈ విప్లవ దశ ముగింపుకు వచ్చే సమయానికి కార్మికవర్గం నాయకత్వం స్థానానికి చేరుకుంటుంది అని సిపిఐ అంచనా వేస్తోంది.

ప్రస్తుత బడా బూర్జువావర్గం నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాన్ని కూలదోసి కార్మికవర్గం నాయకత్వాన జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పాలన్న సిపిఐ(ఎం) లక్ష్యం పట్ల సిపిఐకి విశ్వాసం లేదు. సమాజంలో మౌలికమైన మార్పులను సాధించటానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే ముఖ్యమైన సాధనం అన్న సిపిఐ అంచనాలోనే పై నిర్ధారణలకు మూలాలు ఉన్నాయి. సిపిఐ కార్యక్రమం :

విశాలమైన, శక్తివంతమైన విప్లవోద్యమాన్ని నిర్మించటం, అన్ని వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యతను బలోపేతం చేయటం, అటువంటి ప్రజా ఉద్యమాల దన్నుతో పార్లమెంట్‌లో అవసరమైన సంఖ్యాపరమైన ఆధిపత్యాన్ని సంపాదించటం, మితవాద శక్తుల ప్రతిఘటనను అధిగమించి కార్మికవర్గం, దాని మిత్రులు పార్లమెంట్‌ను నిజమైన ప్రజాభీష్టం నెరవేర్చే సాధనంగా మార్చటం ద్వారా సమాజంలో మౌలికమైన మార్పును

**“ ఈ పేరాగ్రాఫ్‌లో ప్రస్తావించినదాని ప్రకారం అనేక అంశాలపై జరిగే పోరాటాల్లో గ్రామీణ బూర్జువావర్గం, ధనిక రైతాంగం, పెట్టుబడిదారీ భూస్వాములు కలిసి వస్తారన్న అంచనా వ్యక్తమవుతోంది. కానీ అటువంటి అంచనాకు రావటం గ్రామీణ బూర్జువా వర్గం పాత్ర గురించి తప్పుడు అంచనాకు రావటమే అవుతుంది. ”**

సాధించాలి. (పే. 9.4)

ఈ విధంగా నిర్ధారించుకోవటం అంటే ప్రస్తుతం ఉన్న రాజ్యాంగ యత్రం పరిధిలో పనిచేస్తూనే సమాజంలో మౌలికమైన మార్పులు సాధించగలుగుతాము అని నిర్ధారించుకోవటం తప్ప మరోటి కాదు. భారతదేశపు రాజ్యాంగ యంత్రంలో కొన్ని సామ్రాజ్యవాద వ్యతిరేకత, గుత్తపెట్టుబడి వ్యతిరేక, అర్థభూస్వామ్య వ్యతిరేక శక్తులు అంతర్భాగంగా ఉన్నాయని 1964 నాటి సిపిఐ కార్యక్రమంలో వేసుకున్న అంచనాను యథాతథంగా స్వీకరింటమే ఈ తాజా అంచనాలకు ఆశలకు కారణం అయ్యింది.

### వర్గ విశ్లేషణ

తాజా పర్చుబడిన సిపిఐ విప్లవ వ్యూహంలో కొనసాగుతున్న కొన్ని బలహీనతలకు మూలం అసమగ్రమైన, కొన్ని సందర్భాల్లో పరిమితమైన వర్గ విశ్లేషణలో ఉంది. భారతీయ సమాజంలో వర్గ సంబంధాల గురించి శాస్త్రీయమైన విశ్లేషణ ద్వారా సామాజిక ఆర్థిక దోపిడీకి గురి అవుతున్న వర్గాలు ఎవరు, దోపిడీ చేయబడు తున్న వర్గాలు ఎవరు అన్న అంశాలపైనే పార్టీ కార్యక్రమం రూపొందించటం జరగాలి.

### భూస్వామ్యవర్గం గురించిన ప్రస్తావన లేకపోవటం

స్వాతంత్ర్యానంతరం వ్యవసాయరంగంలో వచ్చిన మార్పులు శీర్షికన వ్యవసాయరంగంలో పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణకు సంబంధించిన అనేక లక్షణాలు ప్రస్తావించింది సిపిఐ కార్యక్రమం. కానీ భూస్వామ్య వర్గం గురించిన ప్రస్తావన గానీ, విశ్లేషణ గానీ లేదు. పెట్టుబడిదారీ భూస్వామ్య తరగతి ఆవిర్భావం, పెట్టుబడిదారీ రైతాంగం ఆవిర్భావం, గ్రామీణ ప్రాంతాల్లో వారి శక్తి సామర్థ్యాలు, పాత్ర గురించిన విశ్లేషణ లేదు. భూస్వాములు, పెట్టుబడిదారీ రైతాంగం చేతుల్లో భూకేంద్రీకరణ గురించి ప్రస్తావనే లేదు. గ్రామీణ ప్రాంతంలో భూమి, ఇతర వనరులపై ఘనీభవిస్తున్న భూస్వామ్యవర్గ పెత్తనం గురించి ప్రస్తావన లేకుండానే భూసంస్కరణలు, భూమి కోసం పోరాటాలు వంటి అంశాలను ప్రస్తావించారు. పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా అమలు పర్యవసానంగా రైతాంగంలో చోటు చేసుకుంటున్న వర్గ విభజన గురించి నామమాత్రపు ప్రస్తావన చోటు చేసుకుంది. రైతాంగంలోని వివిధ తరగతుల పాత్ర గురించిన విశ్లేషణ లేదు. వర్గపోరాటంలో వారి స్థానం, పాత్ర గురించిన అంచనా లేదు.

పార్టీ కార్యక్రమంలో గ్రామీణ వర్గాల గురించి వివరించిన ఒక పేరాగ్రాఫ్‌ను పరిశీలిస్తే ఈ విశ్లేషణలోని డొల్లతనం వ్యక్తమవుతుంది.

పెద్ద రైతుల్లో ఒక వర్గం నూతన విధానం పట్ల అస్పష్ట వైఖరి తీసుకున్నది. తొలుత వాణిజ్య సరళీకరణ, వ్యవసాయోత్పత్తుల వాణిజ్యం తమకు ప్రయోజనకరం అని భావించాయి. కాలక్రమంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని వ్యతిరేకించింది ఈ వర్గం. తమ ఆర్థిక భద్రతకు ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్న డిమాండ్‌ను ముందుకు తెచ్చింది.

సాధారణంగా పెద్ద రైతులు ఎంచుకున్న దారినే చిన్న రైతులు కూడా తమకు లాభం కలుగుతుందన్న అంచనాతో అంగీకరిస్తారు.

చిన్న, సన్నకారు రైతులకు సంబంధించినంత వరకు అత్యధికులు భూమి నుండి, తమ మౌలిక వనరుల నుండి వైదొలగాల్సిన పరిస్థితులు తలెత్తాయి. (పే. 6.6.)

ఈ పేరాగ్రాఫ్‌లో ప్రస్తావించబడ్డ పెద్ద రైతులు ఎవరు? భూస్వాములా ? పెట్టుబడిదారీ రైతాంగమా? ధనిక రైతాంగమా? మధ్యతరగతి, చిన్న రైతులు అంటే బహుశా పేదరైతులు, మధ్యతరగతి రైతులు అయి ఉండవచ్చు.

ఈ విషయాన్ని పరిశీలించేటపుడు “ వర్గాలు ఇతర తరగతులు” అన్న శీర్షిక కింద ప్రస్తావించబడిన గ్రామీణ బూర్జువావర్గం, పెట్టుబడిదారీ రైతాంగం గురించిన అంచనాను కలిపిచూడాల్సి ఉంది.

భూమి లేని పేదలు భూ పంపిణీ కోసం సాగించే పోరాటాల్లో గ్రామీణ బూర్జువావర్గం, పెట్టుబడిదారీ భూస్వాములు, ధనిక రైతాంగం భాగస్వాములు కాబోరు. అయితే కొన్ని ఇతర సందర్భాల్లో ఉదాహరణకు : ముడిసరుకుల ధరలు విషయంలో, మౌలిక వసతుల విషయంలో, కనీస మద్దతు ధర విషయంలో, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటానికి సంబంధించిన డిమాండ్లపైనా, ప్రభుత్వం బలవంతంగా భూమిని సేకరించటానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఈ తరగతులు ఉమ్మడి పోరాటాల్లో భాగస్వాములు అవుతారని ఆశించవచ్చు. (పే. 7.15)

ఈ పేరాగ్రాఫ్ లో ప్రస్తావించినదాని ప్రకారం అనేక అంశాలపై జరిగే పోరాటాల్లో గ్రామీణ బూర్జువావర్గం, ధనిక రైతాంగం, పెట్టుబడిదారీ భూస్వాములు కలిసి వస్తారన్న అంచనా వ్యక్తమవుతోంది. కానీ అటువంటి అంచనాకు రావటం గ్రామీణ బూర్జువా వర్గం పాత్ర గురించి తప్పుడు అంచనాకు రావటమే అవుతుంది. నిజానికి భూస్వాములు, ధనిక రైతాంగం ప్రభుత్వ వనరులు, రాయితీలు, మౌలిక వసతుల్లో అత్యధిక భాగాన్ని స్వంతం చేసుకోవటానికి పోరాడతాయి. పోటీ పడతాయి. ఈ లక్ష్య సాధన కోసం రైతాంగంలోని ఇతర తరగతులను ఈ వర్గాలు సమీకరిస్తాయి. అదే సమయంలో ఈ వర్గాలు బూర్జువా భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా సాగే పోరాటాల్లో భాగస్వాములు కావటానికి సిద్ధంకారు. నిజానికి రైతాంగంలోని వివిధ తరగతులను అటువంటి పోరాటాలకు వ్యతిరేకంగా ఉపయోగించుకుంటాయి.

ఈ విశ్లేషణలో భూస్వాములు కూడా రాజ్యాధికారాన్ని నియంత్రించే పాలకవర్గాల్లో అంతర్భాగం అన్న వాస్తవాన్ని పూర్తిగా విస్మరించింది సిపిఐ. ఈ తరగతులు వ్యవసాయ కార్మికులపై, పేద రైతులు, గ్రామీణ పేదలపై సాగించే వర్గ దోపిడీ గురించిన విశ్లేషణకు ఈ కార్యక్రమంలో ఏ మాత్రం చోటు దక్కలేదు. అటువంటి వర్గ విశ్లేషణ లేకుండా, అవగాహన లేకుండా పాలకవర్గాలకు వ్యతిరేకంగా శక్తివంతమైన వ్యవసాయరంగ ఉద్యమాన్ని నిర్మించటం అసాధ్యం. బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా పోరాడే కార్మిక కర్షక మైత్రిని నిర్మించటం కూడా అసాధ్యం.

పారిశ్రామిక పెట్టుబడి, వాణిజ్య పెట్టుబడికి సంబంధించి ఈ విశ్లేషణ కేవలం నయాఉదారవాద ఆర్థిక విధానాల ఒక్క పార్శ్వాన్ని మాత్రమే ప్రస్తావిస్తోంది. ఈ విశ్లేషణ దేశీయ బూర్జువావర్గంలో ఒక వర్గం శక్తివంతమైన కార్పొరేట్ వర్గంగా ఎదిగిందని, భారత దేశానికి చెందిన పలు బహుళజాతి కంపెనీలు విదేశీ

> "తాజాపర్చబడిన సిపిఐ కార్యక్రమంలో ప్రభుత్వ వర్గ స్వభావం గురించిన విశ్లేషణలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ విషయంలో సిపిఐ అవగాహన సిపిఐ(ఎం) అవగాహనకు దగ్గరగా వచ్చింది. పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా గురించిన విశ్లేషణలో కూడా మరికొన్ని అంశాలు సరైన విశ్లేషణగా ఉన్నాయి."

కంపెనీలతో పొత్తు పెట్టుకుంటున్నాయని, తద్వారా సిపిఐ కార్యక్రమం కార్పొరేట్ పెట్టుబడి దారీ విధానంపైనే దృష్టి కేంద్రీకరించిందని అర్థమవుతుంది.

బడా బూర్జువావర్గంలో ఉన్న అన్ని తరగతులు, పెట్టుబడిదారుల గురించి విశ్లేషించేలా కార్యక్రమం పరిధిని విస్తరించాలి. ఇంతకు ముందే ప్రస్తావించినట్లు సిపిఐ కార్యక్రమం బడా కార్పొరేట్ శక్తుల గురించి మాత్రమే ప్రస్తావిస్తుంది. కానీ ఈ వర్గం పరిధికి బయట బడా బూర్జువావర్గంలో అంతర్భాగంగా ఉన్న తరగతుల చేతుల్లో కేంద్రీకృతమవుతున్న పెట్టుబడి, ఇతర వనరులపై వారి పెత్తనం గురించి కూడా విశ్లేషించాల్సి ఉంది.

### ప్రాంతీయ బడాయేతర బూర్జువావర్గం

సిపిఐ కార్యక్రమంలో తడమని, విశ్లేషించని మరో అంశం ప్రాంతీయ బూర్జువావర్గం గురించి అవగాహన. ప్రాంతీయ బూర్జువా వర్గంలో అత్యధికులు బడా బూర్జువావర్గం నిర్వచనంలో ఇమడని వారు. స్థూలంగా పెట్టుబడిదారీ వర్గ పొందికలోనే ప్రాంతీయ బూర్జువావర్గం స్థానంలో ఎన్నో మార్పులు వచ్చాయి. బడా బూర్జువావర్గంతో ఈ ప్రాంతీయ బూర్జువావర్గపు సంబంధాల తీరుతెన్నులు పెద్దఎత్తున మార్పులకు లోనయ్యాయి. కేవలం బడా బూర్జువావర్గం, చిన్నబూర్జువా వర్గాల మధ్య ఉన్న వైరుధ్యాలను ప్రస్తావించినంత మాత్రాన సరిపోదు. నయాఉదారవాద విధానాల నేపథ్యంలో బడా బూర్జువావర్గం పరిధికి బయట ఉన్న చిన్న బూర్జువావర్గం కూడా తమ పెట్టుబడి పరిధి, విస్తృతిని పెంచుకుని అఖిల భారత స్థాయి బూర్జువావర్గం సరసన చేరింది. ఈ క్రమంలో కొందరు బడా బూర్జువావర్గంలో స్థానం కూడా సంపాదించారు. అదే సమయంలో తమ మూల పునాదులను మాత్రం ఒక ప్రాంతంలో సజీవంగా కాపాడుకుంటూ ఉన్నారు.

బడాయేతర బూర్జువా వర్గానికి విదేశీ ద్రవ్య పెట్టుబడికి మధ్య విశ్వసనీయమైన సంబంధాలు లేకపోవటం బడా బూర్జువా వర్గం, బడాయేతర బూర్జువా వర్గాల మధ్య ఉన్న వైరుధ్యంలో ఒక కోణం. సరళీకరణ తర్వాత ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. నయా ఉదారవాద విధానాల నేపథ్యంలో వచ్చిన అవకాశాలు వినియోగించుకుని బడాయేతర బూర్జువావర్గంలో ఒక సెక్షన్ విదేశీ పెట్టుబడులతో సంబంధాలు పెట్టుకుని లబ్ది పొందింది. ఈ పరిణామాలన్నీ ఈ రెండు వర్గాల మధ్య ఉడాల్సిన వైరుధ్యాన్ని సద్దుమణిగేలా చేసేందుకు దోహదం చేశాయి.

ప్రాంతీయ పార్టీల వర్గ స్వభావాన్ని అంచనా వేయటానికి ప్రయత్నించిన సిపిఐ కార్యక్రమం ఈ ప్రయత్నంలో పైన ప్రస్తావించిన కోణాలు వేటినీ ప్రస్తావించలేదు. స్థూలంగా కొన్ని పరిమితులకు లోబడి ప్రాంతీయ పార్టీలు సానుకూల పాత్ర పోషించే శక్తులుగా సిపిఐ వర్గీకరించింది. ఆ పార్టీ కార్యక్రమం ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ :

నిర్దిష్ట ప్రాంతం/ రాష్ట్రానికి సంబంధించిన ప్రజల్లో కొన్ని కీలక సెక్షన్లకు సంబంధించి ఆశలు, కోర్కెలు, లక్ష్యాలను ఈ ప్రాంతీయ పార్టీలు ప్రతిబింబిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజల్లో ముందుకొస్తున్న సాధికారత వాంఛలను కూడా ఈ పార్టీలు ప్రతిబింబిస్తున్నాయి... వీరికి నిర్దిష్ట రాజకీయ దృక్పధం లేదు. ఈ పార్టీలు అవకాశం వచ్చినపుడు కమ్యూనిస్టు పార్టీలతో చేతులు కలపటానికి సిద్ధం అవుతున్నాయి. ఇటువంటి నిర్ధారణ, ప్రాంతీయ పార్టీల వర్గ స్వభావం గురించిన అంచనా కారణంగానే సిపిఐ నిర్మించ తలపెట్టిన వామ పక్ష ప్రజాతంత్ర సంఘటనలో వీరికి స్థానం కల్పించేందుకు దారితీస్తుంది.

గత రెండు దశాబ్దాల కాలంలో ప్రాంతీయ బూర్జువా పార్టీల స్వరూప స్వభావాల్లో చోటుచేసుకున్న ఈ పరిణామాలను, వాటి పర్యవసానాలను సిపిఐ(ఎం) కార్యక్రమం ప్రతిఫలించనప్పటికీ తదనంతర కాలంలో పార్టీ ఆమోదించిన కొన్ని తీర్మానాలు ఈ మార్పుల గురించి ప్రస్తావించాయి. ఈ మార్పుల నేపథ్యంలో మారుతున్న ప్రాంతీయ పార్టీల వర్గ స్వభావం గురించి అంచనాకు వచ్చింది. ప్రాంతీయ పార్టీల పట్ల అనుసరించాల్సిన వైఖరి మౌలికంగా ఎత్తుగడలకు సంబంధించిన అంశమే అయినప్పటికీ మారుతున్న ప్రాంతీయ బూర్జువావర్గపు వర్గస్వభావం వ్యూహాత్మక పర్యవసానాలతో కూడుకున్న అంశంగా ఉందన్న విషయాన్ని గమనించాలి.

### కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై చర్చ

తాజాపర్చబడిన సిపిఐ కార్యక్రమంలో ప్రభుత్వ వర్గ స్వభావం గురించిన విశ్లేషణలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ విషయంలో సిపిఐ అవగాహన సిపిఐ(ఎం) అవగాహనకు దగ్గరగా వచ్చింది. పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా గురించిన విశ్లేషణలో కూడా మరికొన్ని అంశాలు సరైన విశ్లేషణగా ఉన్నాయి. అయితే వివిధ వర్గాల స్వభావం, విప్లవ సాధనలో వాటి పాత్ర, విప్లవ సంఘటనలో వాటి స్థానం వంటి అంశాలకు సంబంధించి అనేక విషయాలు ఇంకా అస్పష్టంగానే మిగిలాయి. ప్రజాతంత్ర విప్లవాన్ని సాకారం చేయటంలోనూ, దేశాన్ని సోషలిస్టు విప్లవం దిశగా నడిపించటానికి అవసరమైన కృషిలో కార్మిక వర్గపు నాయకత్వ పాత్రను సిపిఐ ఇంకా గుర్తించలేదు. ఈ విషయంలో పార్టీకి సంబంధించిన పాత అవగాహనే నేటికీ కొనసాగుతోంది. ఫలితంగా ఈ అవగాహన సిపిఐ ఆయా సందర్భాల్లో అనుసరించే ఎత్తుగడలను ప్రభావితం చేస్తుంది. అయితే ఈ విషయాలన్నింటినీ మరింత లోతుగా పరిశీలించాలని ఆ పార్టీ నిర్ణయించుకోవటం ఆశాజనకమైన విషయం. 22వ మహాసభలో తాజా కార్యక్రమాన్ని ఆమోదించుకున్న సిపిఐ, తదుపరి అంశాలను పరిశీలన కోసం పార్టీ కార్యక్రమ రచనా సంఘాన్ని కూడా మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి బర్దన్ అధ్యక్షతన నియమించింది. దురదృష్టవశాత్తూ కామ్రేడ్ బర్దన్ దివంగతులయ్యారు. అయినప్పటికీ ఆయన స్ఫూర్తితో పార్టీ కార్యక్రమ పునఃసమీక్ష కృషి ముందుకు సాగుతుందని ఆశిస్తున్నాము.

సమకాలీన రాజకీయ పరిణామాలు, సదరు పరిణామాల నేపథ్యంలో అనుసరించాల్సిన ఎత్తుగడల విషయంలో సిపిఐ, సిపిఐ(ఎం) నిరంతరం చర్చిస్తూ ఉన్నాయి. సహకారం, సమన్వయం నేపథ్యంలో పార్టీ కార్యక్రమానికి సంబంధించిన అంశాలను చర్చించటం సముచితంగా ఉంటుంది.

**అనువాదం : కొండూరు వీరయ్య**

# కేంద్రీకృత ప్రజాస్వామ్యం

**ఎస్ వీరయ్య**



*రచయిత సిపిఐ (ఎం)*
*కేంద్రకమిటీ సభ్యులు*

శక్తివంతమైన రాజ్యాంగయంత్రం పాలకవర్గాల చేతుల్లో ఉంది. రాజ్యాంగం, చట్టం, న్యాయవ్యవస్థ, మిలటరీ, పోలీస్‌వ్యవస్థ, ఆర్థికవ్యవస్థ మీద పట్టు పాలకవర్గాల గుప్పిట్లో ఉన్నది. సమాజంలో కుల విభజన, మతం, మూఢవిశ్వాసాల వంటి అంశాలు కూడా ప్రజలను బుజ్జగించడానికి, పక్కదారులు పట్టించడానికి, విభజించడానికి పాలకవర్గాలకు సాధనంగా ఉపయోగపడుతున్నాయి. అందువల్ల సమాజ మార్పుకోసం కృషి చేసే కమ్యూనిస్టు పార్టీ రాజ్యాంగయంత్రంతో తలపడక తప్పదు. పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేయడం కోసం సర్వశక్తులూ ఒడ్డవలసి ఉంటుంది. ఈ కర్తవ్య నిర్వహణలో జయప్రదం కావాలంటే కమ్యూనిస్టు పార్టీలో గరిష్ట స్థాయిలో ఐక్యత అవసరం. ఆశయ ఐక్యత, ఆచరణ ఐక్యత రూపంలో ఇది వ్యక్తం కావాలి. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం పట్ల, అందుకనుగుణంగా రూపొందించుకునే రాజకీయ విధానం పట్ల పార్టీలో ఐక్య అవగాహనను పెంపొందించుకోవాలి. సరైన విధానం మాత్రమే ఉంటే సరిపోదు. దానిని సమర్ధవంతంగా అమలు చేయగలిగిన పార్టీ యంత్రాంగం అవసరం. ఇందుకనుగుణంగానే పార్టీని నిర్మించుకోవాలి.

**కేంద్రీకృత ప్రజాస్వామ్యం :**

కమ్యూనిస్టు పార్టీలో ఐక్యతను సాధించే సూత్రమే కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఇది కమ్యూనిస్టు పార్టీకి గుండెకాయ వంటిది. పార్టీ నిర్మాణ పద్ధతుల్లో బూర్జువా, భూస్వామ్య పార్టీల నుండి కమ్యూనిస్టు పార్టీని వేరు చేసే పద్ధతి కేంద్రీకృత ప్రజాస్వామ్యం. బూర్జువా, భూస్వామ్య పార్టీలకు సమాజాన్ని మార్చవలసిన బాధ్యత లేదు. అమలులో ఉన్న దోపిడీ వ్యవస్థను కాపాడుకోవటం, మరింత బలపర్చుకోవటం వారి లక్ష్యం. ఇందుకోసం అధికారం ఇప్పటికే వారి చేతుల్లో ఉన్నది. కానీ కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం సమాజాన్ని మార్చటం. మార్చే ప్రయత్నానికి పాలకవర్గాల నుండి ప్రతిఘటన ఎదుర్కోవలసి ఉంటుంది. అందుకు శ్రామిక ప్రజానీకాన్ని ఐక్యం చేయాలి. ఈ కర్తవ్య నిర్వహణలో జయప్రదం కావాలంటే పార్టీ శ్రేణులు అత్యంత క్రమశిక్షణను పాటించాలి. ఐక్యతను ప్రదర్శించాలి. అందుకే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలను పాటించటం కార్మికవర్గ పార్టీ అవసరం. ఇది కార్మికవర్గ పార్టీ విప్లవ పోరాట సాధనం. ఇది ఏమాత్రం బలహీనపడినా కమ్యూనిస్టు పార్టీ నిరాయుధమవుతుంది. కమ్యూనిస్టు పార్టీలో క్రమశిక్షణను పార్టీ శ్రేణులు స్వచ్ఛందంగా పాటిస్తారు. సమాజం కోసం త్యాగం చేయడానికి సిద్ధపడి పనిచేస్తున్నందున ఈ స్వచ్ఛంద క్రమశిక్షణ సాధ్యపడుతుంది. తమ లక్ష్య సాధన కోసం క్రమశిక్షణ ఆవశ్యకతను ఏ మేరకు అర్థం చేసుకోగలిగితే ఆ మేరకు ఐక్యతను సాధించగలుగుతారు.

కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తులు పార్టీకి లోబడి పనిచేయడానికి, ప్రజాస్వామ్యం అరాచకంగా మారకుండా చూడటానికి, కేంద్రీకృతం నియంతృత్వంగా మారకుండా చూసేందుకు కేంద్రీకృత ప్రజాస్వామ్యం తోడ్పడుతుంది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం అభివృద్ధికి ఉపయోగపడుతుంది. అందువల్లనే పార్టీలో ఐక్యతను సాధించగల సాధనంగా కేంద్రీకృత ప్రజాస్వామ్యం పనిచేయగలుగుతున్నది.

కమ్యూనిస్టు పార్టీలో వ్యక్తులు పార్టీకి లోబడి పనిచేస్తారు. ఎంత గొప్ప వ్యక్తి అయినా పార్టీకన్నా అతీతం కాదు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో గొప్ప నాయకులుగా ఒక వెలుగు వెలిగిన నాయకులు ఎంతోమంది పార్టీని వీడిన తర్వాత ప్రజల్లో గుర్తింపు కోల్పోయిన విషయం తెలిసిందే. వ్యక్తుల కృషికి, సామర్ధ్యానికి కూడా విలువ ఉన్నది. కానీ దానికి పార్టీ సిద్ధాంతం, క్రమశిక్షణ తోడైనప్పుడే ఆ వ్యక్తిగత సామర్థ్యాలను శక్తివంతంగా ప్రదర్శించటానికి తగిన ప్రాతిపదిక దొరుకుతుంది. ఆ పునాదిని వీడిన తర్వాత పార్టీలో నాయకులుగా లేదా కార్యకర్తలుగా ఉన్నప్పుడు ప్రజలలో ఉన్న గుర్తింపు పార్టీని వీడిన తర్వాత కూడా ఉంటుందనుకుంటే భ్రమ. ఎవరైనా పార్టీని వీడే సందర్భంలో కమ్యూనిస్టు పార్టీని గందరగోళపర్చడం కోసం బూర్జువా మీడియా కొంత ఎక్కువ ప్రాధాన్యతనివ్వవచ్చు. ఆ ప్రయోజనం నెరవేరిన మరుక్షణం పట్టించుకోదు. వ్యక్తిగత సామర్థ్యాలు కేవలం కమ్యూనిస్టులకే ఉంటాయనుకుంటే పొరపాటు. సమాజంలో అనేకమందికి అనేక రకాల శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు ఉంటాయి. అలాంటి వ్యక్తులు పాలకవర్గాలకు ఉపయోగపడుతున్నారా లేక కార్మికవర్గానికి ఉపయోగపడుతున్నారా అన్నదే కీలకమైన విషయం. కార్మికవర్గ ప్రయోజనాల కోసం తమ శక్తిసామర్థ్యాలను వినియోగించినప్పుడు వచ్చే గుర్తింపు కార్మికవర్గానికి దూరమైనప్పుడు కూడా ఉంటుందనుకోవటం పొరపాటు. అందుకే ఎంతటి వారైనా పార్టీ సిద్ధాంతం, పార్టీ తరపున పనిచేసే అవకాశం మూలంగా ఎదుగుతారన్న విషయం గమనించాలి. తిరుగుతున్న బండి చక్రం మీద ఉన్న ఈగ చక్రాన్ని తానే తిప్పుతున్నట్టుగా భ్రమించటం ఎంత అసంబద్ధమో తన మూలంగానే పార్టీ ఎదుగుతున్నదని భావించడం కూడా అంతే అవాస్తవం.

ప్రజాస్వామ్యం పేరుతో ఎవరికి తోచినట్టు వారు వ్యవహరించటం విప్లవ లక్ష్యానికి హాని చేస్తుంది. అరాచకానికి దారితీస్తుంది. బూర్జువా, భూస్వామ్య పార్టీలలో నాయకుల వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం ముఠా తగాదాలను, అరాచకాలను ప్రజాస్వామ్యంగా వక్రీకరిస్తారు. నిజానికి నిర్ణయాలు చేయడంలోనూ, వాటిని అమలు చేయడంలోనూ సభ్యుల భాగస్వామ్యాన్ని పెంచేది ప్రజాస్వామ్యం. దీనికి బూర్జువా, భూస్వామ్య పార్టీల నాయకత్వాలు వ్యతిరేకం. నిర్ణయాలు నాయకులే చేస్తారు. వారి ఆదేశాలను పార్టీ శ్రేణులు పాటించాలంటారు. ఇందులో వ్యక్తిగత ప్రయోజనాలు ముఖ్యపాత్ర వహిస్తాయి. పదవులు, కాంట్రాక్టులు, అక్రమ సంపా

దనలు వీటికి ప్రాతిపదికగా ఉంటాయి. అందుకే ముఠా కుమ్ములాటలు సహజం. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులు స్వప్రయోజనాల కోసం చేరటం లేదు. సమిష్టి, సామాజిక ప్రయోజనమే వీరి ప్రయోజనం. వందలాది లేదా వేలాదిమంది సభ్యులు సమావేశమై నిర్ణయాలు చేయటం ఆచరణ సాధ్యం కాదు. అనుక్షణం పాలకవర్గాల నిఘాలో పనిచేయవలసిన నేపథ్యంలో ఈ పద్ధతుల వల్ల పార్టీ రహస్యాలు కూడా కాపాడటం సాధ్యం కాదు. సభ్యులను, కార్యకర్తలను అందరినీ నిర్ణయాలలో భాగస్వాములను చేస్తూనే పార్టీ రహస్యాలను కాపాడుకునేందుకు తోడ్పడేదే కేంద్రీకృత ప్రజాస్వామ్యం. అందుకే చర్చలు, నిర్ణయాలు శాఖల్లోనూ, కమిటీల్లోనూ జరుగుతాయి. జనరల్ బాడీ సమావేశాల్లో కేవలం రిపోర్టింగ్‌లు, సందేహాలు నివృత్తి చేసుకోవడం వరకే పరిమితమవుతాము.

కేంద్రీకృతం నియంతృత్వంగా మారకుండా చూడటానికి కూడా కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు అవసరం. కమిటీల స్థానంలో నాయకులు నిర్ణయాలు చేయకూడదు. సమిష్టి నిర్ణయాల స్థానంలో వ్యక్తిగత నిర్ణయాలకు అవకాశం ఇవ్వకూడదు. వ్యక్తుల ఆదేశాలు పార్టీకి శిరోధార్యంగా మారకూడదు. ఈ సమిష్టితత్వాన్ని కాపాడేందుకు తోడ్పడే సాధనమే కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఎంతటి నాయకులైనా సమిష్టి నిర్ణయాలకు కట్టుబడి ఉండవలసిందే. పార్టీ చరిత్రలో అనేక సందర్భాలలో ఇలాంటి ఘటనలు చూస్తాం. జ్యోతిబసు ప్రధానమంత్రి పదవిని స్వీకరించాలా లేదా అనే విషయంలో పార్టీ సమిష్టి నిర్ణయానికి కట్టుబడిన విషయం అందరికీ తెలిసినదే. పార్టీ నిర్ణయాన్ని శిరసావహించి అందివచ్చిన అత్యున్నత పదవిని తృణప్రాయంగా తిరస్కరించటం కమ్యూనిస్టు పార్టీ నాయకులకే సాధ్యమైంది. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నేత, పార్టీ ప్రధాన కార్యదర్శి పుచ్చలపల్లి సుందరయ్య పార్టీ విధానాన్ని అమలు జరపడం కోసం ఏ స్థాయిలో పనిచేయడానికైనా వెనకాడలేదు. కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు అందిస్తున్న సమిష్టితత్వం గొప్పతనమిది.

**కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు :**

1) అన్ని స్థాయిల్లోనూ నాయకత్వాన్ని ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవాలి. బూర్జువా, భూస్వామ్య పార్టీలలో అనుసరించినట్టుగా సీల్డ్ కవర్ పద్ధతిని కమ్యూనిస్టు పార్టీ అంగీకరించదు. బిజెపిలో నాయకులను ఆర్‌ఎస్‌ఎస్ నియమిస్తుంది. ఇతర బూర్జువా, భూస్వామ్య పార్టీలు స్వంత కుటుంబ పార్టీలుగా నడుస్తున్నాయి. వ్యక్తులమీద ఆధారపడి పార్టీలు పనిచేస్తున్నాయి.

> **“శాఖ కార్యదర్శి మొదలు ప్రధాన కార్యదర్శి వరకు అన్ని స్థాయిల్లో టీమ్ లీడర్‌నుగాని, కమిటీ, కార్యదర్శివర్గ సభ్యులను గాని ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవాలి. అందుకే పార్టీ ఆవిర్భవించినప్పటినుండీ నేటి వరకు అనేక అనుభవాలను క్రోడీకరించుకుని పార్టీ ఎన్నికల విధానంలో మార్పులు చేసుకున్నది.”**



అఖిలభారత మహాసభ డెలిగేట్స్ సెషన్

పార్టీ అధ్యక్షులే కిందిస్థాయి కమిటీలకు అధ్యక్షులను నామినేట్ చేస్తున్నారు. ఈ అధ్యక్షులే ఆయా స్థాయిల్లో కమిటీసభ్యులను నియమించుకుంటున్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఇందుకు పూర్తి భిన్నమైన పద్ధతి అమల్లో ఉన్నది. శాఖ కార్యదర్శి మొదలు ప్రధాన కార్యదర్శి వరకు అన్ని స్థాయిల్లో టీమ్ లీడర్‌నుగాని, కమిటీ, కార్యదర్శివర్గ సభ్యులను గాని ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకోవాలి. అందుకే పార్టీ ఆవిర్భవించినప్పటినుండీ నేటి వరకు అనేక అనుభవాలను క్రోడీకరించుకుని పార్టీ ఎన్నికల విధానంలో మార్పులు చేసుకున్నది. ప్రజాస్వామ్య పద్ధతిని మరింత విస్తరించింది. అనుభవాల నుంచి నేర్చుకుంటూనే భవిష్యత్తులో కూడా ఈ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని మరింత పరిపుష్టం చేసుకునేందుకు కమ్యూనిస్టు పార్టీ ఎల్లవేళలా సిద్ధంగానే ఉంటుంది.

బూర్జువా, భూస్వామ్య పార్టీలలో జరుగుతున్నట్టు నాయకత్వం ఎన్నిక కోసం క్యాంపెయిన్ చేయడాన్ని, లాబీయింగ్ చేయడాన్ని కమ్యూనిస్టు పార్టీ అనుమతించదు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఓటర్లను ఆశపెట్టేందుకు, లోబర్చుకునేందుకు, సంఖ్యాబలాన్ని తమ వెనక సమీకరించుకుని బలప్రదర్శన చేసేందుకు ఆ పార్టీలలో పూనుకుంటారు. కమ్యూనిస్టు పార్టీలో కార్యకర్తలకు, నాయకులకు అలాంటి అవసరాలు లేవు. ఇక్కడ నాయకత్వం హోదా కాదు. అదొక బాధ్యత. అందుకే తమ అనుభవంలో ఆయా కార్యకర్తల శక్తిసామర్థ్యాలను బేరీజు వేసుకుని వారి అంచనాలకు అనుగుణంగా నాయకులను ఎన్నుకునేందుకు స్వచ్ఛందంగా నిర్ణయించుకోగల పరిపక్వత ప్రతినిధులకు ఉంటుంది. కార్యదర్శిని ఎన్నుకునేటప్పుడు కమిటీని ఐక్యంగా నడపగల సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తారు. దీనితోపాటు ప్రజా ఉద్యమాల్లో అనుభవం, సైద్ధాంతిక పటుత్వం, నిర్మాణదక్షతలకు ప్రాధాన్యతనిస్తారు. ఇవన్నీ మహాసభ నాటికే వారి అనుభవంలో అర్థమయ్యే విషయాలు. ఎన్నిక సమయంలో ప్రత్యేకంగా క్యాంపెయిన్ చేస్తేనే తెలిసే విషయాలు కాదు. అందుకే అలాంటి క్యాంపెయిన్ అవసరం లేదు. ఇలాంటి క్యాంపెయిన్ నిర్మాణరాహిత్యానికి దారితీస్తుంది.

2)పార్టీలో అత్యున్నత నిర్ణాయక వేదిక పార్టీ అఖిలభారత మహాసభ. మహాసభ నిర్ణయాలు పార్టీ శ్రేణులందరికీ శిరోధార్యం. పార్టీ అఖిల భారత మహాసభ రాజకీయ విధానాన్ని, ప్రజా ఉద్యమాలను, పార్టీ నిర్మాణ పరిస్థితిని, దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను సమీక్షిస్తుంది. మహాసభకు రెండు మాసాలు ముందే భవిష్యత్తులో అనుసరించవలసిన

> **"ఇంతటి ప్రజాస్వామ్య ప్రక్రియ కమ్యూనిస్టు పార్టీలో తప్ప మరో పార్టీలో లేదు. ఇది కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేకత. వేల సంఖ్యలో ఈ ముసాయిదా తీర్మానం మీద సూచనలు, సవరణలు కేంద్ర కమిటీకి అందుతున్న తీరే ఇందుకు తార్కాణం. వాటిని క్రోడీకరించి కేంద్రకమిటీ ముందుంచుతారు. వాటిని కూడా పరిగణలోని తీసుకున్న తర్వాత తుది ముసాయిదా నివేదికను కేంద్రకమిటీ రూపొందిస్తుంది."**

రాజకీయ విధాన ముసాయిదా తీర్మానాన్ని బహిరంగంగా ప్రకటిస్తుంది. పార్టీ శ్రేణులకే కాకుండా ప్రజలందరి ముందుంచుతుంది. పార్టీ శ్రేయోభిలాషులు ఎవరైనా తగిన సూచనలు, సవరణలు కేంద్రకమిటీకి పంపించే అవకాశం ఉంటుంది. పార్టీలో అంతర్గతంగా ఆయా స్థాయిల్లోని శాఖలు, కమిటీల్లోనూ, మహాసభల లోనూ, వాటి పరిధిలోని రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను ఉద్యమాలను, నిర్మాణ పరిస్థితిని సమీక్షిస్తాయి. తమ నివేదికలను పై కమిటీకి పంపిస్తాయి. ఈ నివేదికలన్నీ అఖిలభారత స్థాయిలో నివేదిక రూపొందించేందుకు కేంద్ర కమిటీకి తోడ్పడతాయి. పార్టీ ప్రకటించిన రాజకీయ విధానం ముసాయిదాపైన శాఖలుగా గానీ, కమిటీలుగా గానీ, వ్యక్తులుగా గానీ తమ సూచనలు, సవరణలు నేరుగా కేంద్రకమిటీకి పంపించే అవకాశం ఉంటుంది. పార్టీ రాజకీయ విధానం రూపొందించడంలో, పార్టీ శ్రేణులను అన్ని స్థాయిల్లోనూ భాగస్వాములను చేయడానికి ఈ సుదీర్ఘ ప్రక్రియ తోడ్పడుతుంది. ఇంతటి ప్రజాస్వామ్య ప్రక్రియ కమ్యూనిస్టు పార్టీలో తప్ప మరో పార్టీలో లేదు. ఇది కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేకత. వేల సంఖ్యలో ఈ ముసాయిదా తీర్మానం మీద సూచనలు, సవరణలు కేంద్రకమిటీకి అందుతున్న తీరే ఇందుకు తార్కాణం. వాటిని క్రోడీకరించి కేంద్రకమిటీ ముందుంచుతారు. వాటిని కూడా పరిగణలోని తీసుకున్న తర్వాత తుది ముసాయిదా నివేదికను కేంద్రకమిటీ రూపొందిస్తుంది. వివిధ రాష్ట్రాల నుండి, రంగాల నుండి ఎన్నికై వచ్చిన ప్రతినిధులతో కూడిన మహాసభలో ఈ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ప్రతినిధులందరికీ మరొకసారి లోతుగా చర్చించేందుకు, తమ వాదనలు, అభిప్రాయాలు వినిపించేందుకు, సవరణలు, సూచనలు ప్రతిపాదించేందుకు అవకాశమిస్తారు. వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్న తర్వాత మెరుగులు దిద్దిన ముసాయిదా నివేదికను మహాసభ ముందు ఆమోదానికి పెడతారు. ఒక విధానాన్ని రూపొందించే ముందు ఇలా అనేక దశల్లో అత్యంత ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరిస్తారు. ఒకసారి నిర్ణయం జరిగిన తర్వాత తమ వ్యక్తిగత అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా పార్టీ యావత్తూ దానికి కట్టుబడి అమలు జరపవలసి ఉంటుంది. అందుకే కమ్యూనిస్టు పార్టీలో ఎవరిని కదిలించినా ఒకే మాట వినిపిస్తుందన్న అభిప్రాయాలు మనం వింటూ ఉంటాము. అది నిజమే. అది కమ్యూనిస్టు పార్టీ గొప్పతనం. సభ్యులు, కార్యకర్తలు, నాయకుల నిజాయితీకి, నిబద్ధతకు, క్రమశిక్షణకు నిదర్శనం.

ఈ మహాసభలోనే కేంద్రకమిటీని ఎన్నుకుంటారు. ఆ కమిటీ ప్రధాన కార్యదర్శిని, పొలిట్‌బ్యూరోను ఎన్నుకుంటుంది. నాయకత్వాన్ని, నాయకత్వ బృందాన్ని ఎన్నుకునే క్రమంలో ఎలాంటి అసంతృప్తులు, భిన్నాభిప్రాయాలు, నిరసనలు బహిరంగంగా కనిపించకపోవటంతో అసలు కమ్యూనిస్టు పార్టీలో ప్రజాస్వామ్యమే ఉండదని పాలకవర్గ పార్టీలు వారి సిద్ధాంత కర్తలు తప్పుడు ప్రచారం చేస్తుంటారు. వ్యక్తిగత ప్రయోజనాలతో కూడిన ముఠా కుమ్ములాటలు, ఘర్షణలు తప్ప క్రమశిక్షణ తెలియని బూర్జువా, భూస్వామ్య పార్టీల శ్రేణులకు ఇది ఆశ్చర్యంగానే కనిపిస్తుంది. కమ్యూనిస్టు పార్టీ కూడా వారి లాగానే క్రమశిక్షణా రాహిత్యం ప్రదర్శించాలని, అరాచకంగా వ్యవహరించాలని, దిగజారాలని కోరుకుంటారు. కమ్యూనిస్టు పార్టీ క్రమశిక్షణగా పటిష్టంగా ఎదగడం వారికి ఇబ్బందే కదా!

రెండు మహాసభల మధ్యకాలంలో పార్టీ విధానానికి అనుగుణంగా కేంద్రకమిటీ నిర్ణయాలు చేస్తుంది. కేంద్రకమిటీ సమావేశాలకు మధ్య కాలంలో ఆ నిర్ణయాలు అమలుజరిగే విధంగా పొలిట్‌బ్యూరో పర్యవేక్షణ చేస్తుంది. కేంద్రకమిటీ నిర్ణయాలకు లోబడి తక్షణ సమస్యల మీద పార్టీ నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. అందుకనుగుణంగా అవసరమైన తక్షణ నిర్ణయాలు చేస్తుంది. కేంద్ర కమిటీకి కింది స్థాయిలో కమిటీలు, కార్యదర్శి వర్గాలు ఉంటాయి. అన్ని స్థాయిల్లోను కమిటీలు, కార్యదర్శివర్గాలు అనుసరించే పద్ధతి ఇదే.

మహాసభల్లో గాని, ఆయా కమిటీలలో గాని ఎజెండా అంశాల మీద ప్రజాస్వామ్యయుతంగా చర్చించాలి. ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నించాలి. ఏకాభిప్రాయం సాధ్యం కానప్పుడు మెజారిటీ నిర్ణయానికి అందరూ కట్టుబడి అమలు చేయవలసి ఉంటుంది.

3) పార్టీలో కిందినుండి పైకి, పైనుండి కిందికి అన్ని స్థాయిల్లోనూ రెగ్యులర్‌గా నివేదికలు పంపడం అవసరం. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి కనుగుణమైన నిర్ణయాలు చేయాలన్నా, వివిధ స్థాయిల్లో అనుభవాలను స్వీకరించాలన్నా, వ్యక్తుల, కమిటీల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలన్నా కిందినుండి నివేదికలు రెగ్యులర్‌గా పంపించాలి. వివిధ ప్రాంతాలలో ఆయా స్థాయిల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులను, సైద్ధాంతిక ప్రభావాలను బేరీజు వేసుకునేందుకు, వస్తుగతమైన నిర్ణయాలకు వచ్చేందుకు ఈ ప్రజాస్వామ్య ప్రక్రియ తోడ్పడుతుంది. కింద నుంచి అందే నివేదికలన్నీ క్రోడీకరించి అభిప్రాయాలను, అనుభవాలను పరిగణనలోకి తీసుకుని పై కమిటీలు తగు నిర్ణయాలు చేయవలసి ఉంటుంది. ఈ నిర్ణయాలకు కింది కమిటీలు కట్టుబడి ఉండాలి. కొన్ని సందర్భాలలో ఆ నిర్ణయంతో కింది కమిటీ విభేదించవచ్చు. అలాంటి సమయంలో పునః పరిశీలనకు తగినంత సమయం ఉంటే మళ్ళీ పరిశీలించమని పైకమిటీని కోరవచ్చు. పైకమిటీ తుది నిర్ణయానికి భిన్నాభిప్రాయాలతో నిమిత్తం లేకుండా అందరూ కట్టుబడి అమలు చేయాలి. నిర్ణయం తక్షణం అమలు జరపవలసిందయితే తమ భిన్నాభిప్రాయాలను పైకమిటీకి తెలియజేస్తూనే ఆలస్యం చేయకుండా నిర్ణయాలను అమలు చేయాలి. పై కమిటీ నిర్ణయాలను, సమీక్షలను సకాలంలో నివేదికల రూపంలో కిందికి పంపించాలి. ఈ ప్రక్రియ పార్టీలో నిరంతరం ఏకాభిప్రాయ సాధనకు తోడ్పడుతుంది. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఐక్యంగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.

4) కమిటీలుగాని, నాయకులుగాని కింది కమిటీల నుండి, కార్యకర్తలు, సభ్యుల నుండి వచ్చే అభిప్రాయాలు, సూచనలు, విమర్శలను శ్రద్ధగా వినాలి. స్వీకరించాలి. తమ లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలి. కిందినుండి వచ్చే అభిప్రాయాల్లో లోపాలుంటే వారికర్థమయ్యే రీతిలో వివరించాలి. ఓపికగా సరిదిద్దాలి. లేన

(మిగతా 24వ పేజీలో)

విశ్లేషణ

# మోడీ ప్రభుత్వ విధానాలకు ప్రతిఘటన

**డా॥ కె. హేమలత**

'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదంతో 'అందరికీ ఆసరా - అందరికీ అభివృద్ధి' అందిస్తామని మోడీ ప్రభుత్వం గొప్పలు చెబుతుంది. కానీ ఆచరణలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నది. 2015-16 బడ్జెట్‌లో సామాజిక సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో భారీగా కోత పెట్టడం అందుకు ఒక ఉదాహరణ. కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలకు నిధుల్లో భారీగా కోత విధించారు. మాతా శిశు సంరక్షణ పథకం (ఐ.సి.డి.యస్.) గత 40 ఏళ్ళుగా అమలులో ఉంది. ఈ పథకం సంపూర్ణంగా విజయవంతం కావడానికి అవసరమైన నిధులు పూర్తిగా కేటాయించలేకపోతున్నప్పటికీ గత ప్రభుత్వాలు ఏటా ఈ పథకానికి కేటాయింపులు ఏదో ఒక మేరకు పెంచుతూ వచ్చాయి. అయితే మొట్ట మొదటి సారిగా మోడీ ప్రభుత్వం ఈ పథకానికి నిధుల కేటాయింపుల్లో భారీగా కోత పెట్టింది. 2014-15 బడ్జెట్‌లో ఈ పథకానికి 18,391 కోట్ల రూపాయలు కేటాయించగా, 2015-16 బడ్జెట్‌లో కేవలం 2,754 కోట్ల రూపాయలు కేటాయించింది. జాతీయ ఆరోగ్య పథకానికి కేటాయించిన నిధుల్లో 3,900 కోట్ల రూపాయల మేరకు కోత పడింది. సర్వశిక్షా అభియాన్‌కు, మధ్యాహ్న భోజన పథకాలకు 2014-15లో వరుసగా 27,758 కోట్ల రూపాయలు, 13, 215 కోట్ల రూపాయలు కేటాయించగా, ఈ ఏడాది కేటాయింపులు 22,000 కోట్ల రూపాయలు, 9,236 కోట్ల రూపాయలకు తగ్గించింది.

ఇప్పుడు మనం చెప్పుకున్న కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపుల్లో కోత విధించడం మూలంగా లక్షలాది మంది మహిళలు, శిశువుల ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య వంటివి తీవ్రంగా దెబ్బతింటాయి. అసంఘటితరంగ కార్మికుల, చిన్న-సన్నకారు రైతుల కుటుంబాలలో తొంభైశాతం ఈ పథకాల నుండి లబ్ది పొందుతున్నారు. వీరిలో అత్యధిక శాతం సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందినవారు.

ఒకప్రక్కన మెజార్టీతో పేద ప్రజానీకానికి ఏదో ఒక మేరకు మేలు చేసే ఈ పథకాలను నీరుకారుస్తూ రెండో ప్రక్క నుండి అటల్ పెన్షన్ యోజన, జనధన్ యోజన, పేరిట అనేక పథకాలను పేద ప్రజలకు అందచేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నది. ఉన్న ప్రయోజనాలను ఊడబీకి వస్తుందో రాదో తెలీని పథకాలను ప్రజలకు అంటగట్టడం మోడీ ప్రభుత్వానికే చెల్లింది. ఈ పథకాలకు కేటాయిం పుల్లో కోత విధించడమంటే ఈ సేవలకు కోత పెట్టడమే. అంటే ఇప్పటిదాకా దేశంలో మాతా శిశు సంరక్షణ, వారి ఆరోగ్యం, పిల్లలకు అందే పోషకాహారం, విద్య, వైద్యం తదితర పథకాల్లో సాధించిన పురోగతిని నిలువరించడమే. ఈ పథకాల అమలుకు కృషి చేసే కార్మికుల, కార్యకర్తల కుటుంబాల భవిష్యత్తును రోడ్డున పడవేయడమే.

ఈ మధ్యకాలంలోనే ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా పనిచేసే ఆహార-వ్యవసాయ సంస్థ ప్రపంచ ఆహార భద్రత తీరు తెన్నుల మీద ఒక నివేదిక వెలువరించింది. ఆ నివేదిక ప్రకారం భారతదేశంలో ఈనాటికీ 19.4 కోట్లమంది ప్రజానీకం పౌష్టికాహార లోపంతో జీవిస్తున్నారు. ఈ లోపంలో మన దేశమే ప్రపంచ దేశాలలోకెల్లా అగ్రస్థానంలో ఉంది. గత కొన్నేళ్ళుగా ఎన్నదగిన స్థాయిలో స్థూల జాతీయోత్పత్తి సాధించిందని బూర్జువా మీడియా మన్ననలు అందుకుంటున్న దేశంలో అన్ని కోట్లమంది ప్రజానీకం పౌష్టికాహార లోపంతో జీవించడం దేనికి నిదర్శనం? ప్రపంచ ఆహార సదస్సులో నిర్ణయించిన మిలీనియం లక్ష్యాలను సాధించడంలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో ఈ అంశం పట్టిస్తుంది. అత్యధిక ఆర్థికాభివృద్ధి రేటు తలసరి ఆహార వినియోగం పెరిగేందుకు దోహదపడలేదని, అంటే ఈ ఆర్థికాభివృద్ధి మెజార్టీ ప్రజానీకం జీవితాలను మెరుగుపరిచే సమ్మిళిత వృద్ధి కాదని, ఆహార వ్యవసాయ సంస్థ వ్యాఖ్యానించింది. ఆహార ధరవరలు, ఇంధనం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు

ధరలు హెచ్చుగా ఉండడం, నిరుద్యోగం ప్రబలిపోవడం, ఉన్న ఉపాధి కూడా రోజువారీ అవసరాలు గడుపుకోవడానికి అక్కరకు రాకపోవడం, పరిసరాల అపరిశుభ్రత, వ్యాధుల బారిన పడడం, పరిశుభ్రమైన తాగునీటి వసతి లోపించడం వంటివి జనాభాలో పౌష్టికాహార లోపానికి కారణమని ఆ నివేదిక పేర్కొంది.

ఐ.సి.డి.ఎస్., ఎం.డి.ఎం., యన్.హెచ్.యం, ఎన్.ఆర్.యల్,యం. వంటి కార్యక్రమాలు ప్రత్యేకించి పై సమస్య పరిష్కారానికి ఉద్దేశించినవే. ఈ పథకాల పనితీరును వివిధ ప్రభుత్వ విభాగాలు, స్వతంత్ర సంస్థలు మదింపు చేస్తుంటాయి. ఈ మదింపులో పై పథకాల అమలు సానుకూల ఫలితాలను ఇస్తుందని గుర్తించాయి. ముఖ్యంగా మహిళల, పిల్లల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో, పౌష్టికాహార స్థాయిని పెంచడంలో, అక్షరాస్యత పెంపొందించడంలో ఈ పథకాలు విజయవంతమయ్యాయి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేసే చోట నవజాత శిశువులు బరువు తక్కువగా పుట్టడం, పౌష్టికాహార లోపం, నవజాత శిశువుల మరణాల రేటు వంటి సమస్యలను అధిగమించడం, పిల్లలు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించడం, వారిని స్కూళ్ళల్లో చేర్పించడం, స్కూలు డ్రాపవుట్లను అరికట్టడం వంటి అంశాల్లో మంచి ఫలితాలు వచ్చాయి. మధ్యాహ్న భోజన పథకం మూలంగా స్కూళ్ళల్లో డ్రాపవుట్లు (అర్థాంతరంగా చదువు మానెయ్యడం) తగ్గడమేకాక పిల్లలో సామాజిక అంతరాలు, కుల కట్టుబాటు భావనలు తగ్గి సమానత్వ భావన పెంపొందడానికి దోహదపడింది. యన్.హెచ్.యం. పథకం మూలంగా ప్రసవాలు ఎక్కువలో ఎక్కువగా ఆసుపత్రులలో జరగడం తద్వారా నవజాత శిశు మరణాల రేటు తగ్గించడం సాధ్యపడింది. లబ్ధిదారులు ఈ పథకాలను వేనోళ్ళా

> "ఐ.సి.డి.యస్.ను నిర్వీర్యం చేసి, చాపలా చుట్టెయ్యడానికి చేసిన ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమరశీల పోరాటాలు చేశారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలువరించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇస్కాన్, అక్షయపాత్ర, నాంది ఫౌండేషన్ వంటి కార్పొరేట్ ఎన్జీవో సంస్థలకి కట్టబెట్టే దానికి ప్రయత్నాలు జరిగాయి."



మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రశంసిస్తున్నారు.

మోడీ ప్రభుత్వం 'సబ్ కా వికాస్' అన్న నినాదం ఇచ్చింది. ఊరందరి బతుకులు బాగుపడాలనే ఈ నినాదం సాకారం కావాలంటే ఈ పథకాల ద్వారా అందే సేవలను దేశ పౌరులు అందరూ హక్కుగా పొందేలా చెయ్యాలి. కానీ మోడీ సర్కారు ఇందుకు విరుద్ధంగా ఉన్న పథకాలను ఊడబీకేదానికి ప్రయత్నిస్తూ ఉంది. ప్రజల బాగుకోసం పాటుపడడమే మోడీ సర్కారు లక్ష్యమయి ఉంటే ఈ పథకాలను మరింత సమర్థవంతంగా, మరింత విస్తృతంగా అమలు చేసేదానికి తగిన నిధులు కేటాయించి, క్షేత్రస్థాయిలో ఈ పథకాలను అమలుచేసే కార్మికుల, కార్యకర్తల బాగోగులను కూడా పట్టించుకునేది. కానీ మోడీ సర్కారు వ్యాపారానికి అనువైన పరిస్థితులు కల్పించే పేరిట ప్రపంచ బ్యాంకు సూచించిన ప్రమాణాలు అందుకోవాలని అర్రులు సాచే క్రమంలో 'మానవాభివృద్ధి సూచికలు' ధ్వంసమైపోయినా ఫర్వాలేదనే ధోరణితో ఈ పథకాల మీద చేసే ఖర్చును అనుత్పాదక వ్యయం పేరిట కోత పెట్టేస్తున్నది.

ఈ పథకాలకు నిధుల కేటాయింపులో మోడీ సర్కారు భారీగా కోత పెట్టిన మూలాన ఇప్పుడీ పథకాల కొనసాగింపు గాల్లోదీపంలా ఊగిసలాడుతున్నది. 14వ ఆర్థికసంఘం సిఫార్సుల మేరకు రాష్ట్రప్రభుత్వాలకు గతంలో కన్నా హెచ్చుగా నిధులు అందచేస్తాం కాబట్టి బడ్జెట్‌లో ఈ పథకాలకు కేటాయించే నిధులు తగ్గాయి అని బిజెపి సర్కారు సమర్థించుకో చూస్తున్నది. పైపెచ్చు ఇప్పుడు రాష్ట్రాలకు విరివిగా నిధులు అందించాం కాబట్టి ఈ పథకాల భారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే మోయాలని వాదిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలనేది కుటిల వాదన తప్ప మరొకటి కాదు.

అసలు నిజం ఏంటంటే – నయా ఉదారవాద విధానాలకు బిజెపి సర్కారు కట్టుబడి ఉన్నందునే, ప్రజలకు అందించే సామాజిక సంక్షేమ పథకాల వ్యయం తగ్గించాలనే ప్రపంచ బ్యాంకు, ఇతర అంతర్జాతీయ ఆర్థిక సంస్థల షరతులకు లోబడి ఈ పని చేస్తున్నది. సంస్కరణల పేరిట ప్రపంచబ్యాంకు ఆదేశిత నయా ఉదారవాద విధానాలను తలకెత్తుకున్న నాటి నుండి ప్రజలకు అందించే సామాజిక, సంక్షేమ పథకాల మీద ఈ దాడి మొదలైంది. అప్పటి (1991) నుండి కేంద్రంలో ఏ పార్టీ అధికారం లోకి వచ్చినా ఐ.సి.డి.యస్.ను ప్రైవేటీకరించ డానికి రకరకాలుగా ప్రయత్నాలు జరిగాయి. ఒకసారి ప్రభుత్వేతర సంస్థలకి (ఎన్జీవోలకు) అప్పగిస్తామని, మరొకసారి 'స్వయం సహాయ బృందాలకు' అప్పచెబుతామని, వేరొకసారి పంచాయతీల పరం చేస్తామని యుపిఎ, ఎన్డీయే ప్రభుత్వాలు ప్రకటించాయి. ఐ.సి.డి.యస్.ను నిర్వీర్యం చేసి, చాపలా చుట్టెయ్యడానికి చేసిన ఈ ప్రయత్నాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమరశీల పోరాటాలు చేశారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలను నిలువరించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇస్కాన్, అక్షయపాత్ర, నాంది ఫౌండేషన్ వంటి కార్పొరేట్ ఎన్జీవో సంస్థలకి కట్టబెట్టేదానికి ప్రయత్నాలు జరిగాయి. మధ్యాహ్న భోజన పథకం కార్మికులూ ఈ ప్రయత్నాలను తమ పోరాటాల ద్వారా తిప్పికొట్టారు. తాజాగా వేదాంత, జెపి, ఎయిర్‌టెల్ వంటి కార్పొరేట్ కంపెనీలను 'కమ్యూనిటీల జోక్యం' పేరిట రంగంలోకి దింపి ఈ పథకాన్ని ప్రైవేటీకరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆషా వర్కర్లతో 'ప్రోక్టార్ అండ్ గ్యాంబుల్' వంటి బహుళజాతి సంస్థల ఉత్పత్తులను అమ్మిస్తున్నారు. బడా కార్పొరేట్ విద్యా సంస్థలు 3 నుండి 6 ఏండ్ల లోపు పిల్లలకు 'ప్రీ స్కూల్' విద్యను అందించాలని ప్రభుత్వం చెబుతున్నది. ఇదంతా పిల్లల మీద ప్రేమతోనో, వాళ్ళకు చదువులు అబ్బించాలనే శ్రద్ధతోనో చేస్తున్నది కాదు. ఇప్పటి దాకా పిల్లలకు పౌష్టికాహారం, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాల్సిన తన బాధ్యత నుండి తప్పుకొని, ప్రైవేటు రంగానికి ఆ పనులు అప్పగించి సామాజిక లక్ష్యంతో చేపట్టాల్సిన ఈ కార్యక్రమాలను వ్యాపారంగా మార్చి ప్రైవేటు రంగానికి లాభాలు కట్టబెట్టాలనేదే సర్కారు ఆలోచన.

ఈ స్కీమ్‌లను ప్రైవేటీకరించడమంటే ఈ పథకాల అమలుకు పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను దెబ్బతియ్యడం ఒకటే కాదు మహిళల, పిల్లల ఆరోగ్య, పౌష్టికాహార, విద్య, వైద్య హక్కులను దెబ్బతియ్యడమే. మానవాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ఈ అంశాలను మార్కెట్‌లో సరుకుగా మార్చడమే మోడీ సర్కారు ఉద్దేశ్యం.

2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో బిజెపి ఇచ్చిన అభివృద్ధి నినాదానికి ఆకర్షితులైన జనం. మెజార్టీ సీట్లు కట్టబెట్టారు అయితే అధికారం చేపట్టింది లగాయితు బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి మాటలను విస్మరిం

చి కార్పొరేట్‌లకు, పెట్టుబడిదారులకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకునే పనిలో పడింది. ఇందులో భాగంగానే నయా ఉదారవాద విధానాలను మరింత జోరుగా ముందుకు తీసుకు వెళ్ళేందుకు పనిచేస్తున్నది. అధికారంలోకి రావడంతోనే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసింది. ప్రణాళికా సంఘం పనితీరులో కొన్ని లోపాలు ఉన్నాయి. కాదనలేం. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ప్రాయోజిత పథకాలకు ఈ ప్రణాళికా సంఘమే నిధులు కేటాయించింది. ఈ పథకాల అమలును క్రమం తప్పకుండా సమీక్షించి వాటి కొనసాగింపు గురించి నిర్ణయాలు తీసుకునేది. వెనుకబడిన రాష్ట్రాలు, వెనుకబడిన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని 'స్పెషల్ క్యాటగిరీ స్టేట్స్' పద్దులో వీటికి అదనపు నిధులు సమకూర్చేది. రాష్ట్రాలలో మానవాభివృద్ధి ప్రమాణాలను, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, మహిళా సబ్‌ప్లాన్‌ల అమలును పర్యవేక్షించేది. అటువంటి ప్రణాళికా సంఘాన్ని రద్దుచేసి దానికి బదులుగా బిజెపి ప్రభుత్వం రంగంమీదకి తెచ్చిన 'నీతి ఆయోగ్' అనేది కేవలం 'బాతాఖానీ క్లబ్బు' లాంటిదే తప్ప దానికి ప్రణాళికా సంఘానికి ఉన్నటువంటి పర్యవేక్షణాధికారాలు లేవు. ఇప్పటిదాకా అమలవుతూ ఉన్న కేంద్ర ప్రభుత్వ ప్రయోజిత సంక్షేమ పథకాలను ఇక ముందు కొనసాగించాలా, వద్దా లేక ఈ పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వాల మీదకు నెట్టివెయ్యాలా అనేది సిఫార్సు చెయ్యాలని బిజెపి ప్రభుత్వం 'నీతి ఆయోగ్'ను కోరింది. అంతిమంగా ఈ పథకాల సంఖ్యను గణనీయంగా తగ్గించాలని 'నీతి ఆయోగ్' సిఫార్సు చేసింది.

'నీతి ఆయోగ్' ఇలాంటి సిఫార్సులు చెయ్యక మునుపే బిజెపి ప్రభుత్వం 2015–16 బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ మొత్తం 63 ప్రభుత్వ ప్రాయోజిత సంక్షేమ పథకాలలో ఎనిమిదింటిని రద్దు చెయ్యడానికి, ఐ.సి.డి.యస్., యన్.హెచ్.యం., యన్.ఆర్.ఎల్.యం. వంటి మరో 24 పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటాను తగ్గించాలనే నిర్ణయాన్ని ప్రకటించింది. మరికొన్ని పథకాలకు కేంద్రం వాటాలో ఎలాంటి పెంపుదల లేకుండా యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది.

దీనిమూలంగా రాష్ట్ర ప్రభుత్వాలు 24 పథకాలకు గతంలో కన్నా ఎక్కువ వ్యయాన్ని భరించాల్సి వస్తుంది. 2015–16 కేంద్ర బడ్జెట్‌లోనే ఈ పథకాలకు అయ్యే వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ రెవెన్యూ వ్యయంలోనే భరించాలని ఖరాఖండిగా స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం కేవలం పెట్టుబడి వ్యయాన్ని మాత్రమే

“ నీతి ఆయోగ్' ఇలాంటి సిఫార్సులు చెయ్యక మునుపే బిజెపి ప్రభుత్వం 2015-16 బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ మొత్తం 63 ప్రభుత్వ ప్రాయోజిత సంక్షేమ పథకాలలో ఎనిమిదింటిని రద్దు చెయ్యడానికి, ఐ.సి.డి.యస్., యన్.హెచ్.యం., యన్.ఆర్.ఎల్.యం. వంటి మరో 24 పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటాను తగ్గించాలనే నిర్ణయాన్ని ప్రకటించింది. ”



అంగన్‌వాడీ వర్కర్స్

భరిస్తుందని వివరించింది. అంటే కేంద్ర ప్రభుత్వం ఈ 24 పథకాల అమలుకు అవసరమైన భవనాలు, యంత్ర సామాగ్రి, సాధనాలకు అవసరమయ్యే నిధులను మాత్రమే సమకూరుస్తుంది. ఇహ ఈ పథకాల అమలు కోసం అయ్యే జీతభత్యాలు, వేతనాలు, అద్దెలు వంటి వ్యయాలన్నీ రాష్ట్ర ప్రభుత్వాలే భరించాల్సి ఉంటుంది. నిజానికి పథకాల అమలుకి ఈ నిధులే ఎక్కువ అవసరమవుతాయి. పెట్టుబడి వ్యయం అనేది అతి స్వల్పంగా ఉంటుంది. ఉదాహరణకి చూసుకుంటే ఐ.సి.డి.యస్. పథకం అమలుకి కేంద్ర ప్రభుత్వం కేవలం అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి అయ్యే ఖర్చును మాత్రమే భరిస్తుంది. ఇహ ఈ పథకం అమలుకు అవసరమైన పోషకాహారం, అంగన్‌వాడీలకు చెల్లించే జీతాలు, అద్దెలు, రవాణా ఖర్చుల వంటి నెలసరి ఖర్చులన్నీ అయా రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిందే. అంటే కేంద్ర ప్రభుత్వం ఈ పథకం అమలుకు అవసరమైన భవనాలు నిర్మించి ఇచ్చి చేతులు దులిపేసుకుంటే ఆ పథకాన్ని అమలు చెయ్యడానికి కావల్సిన నిధులన్నీ రాష్ట్ర ప్రభుత్వాల నెత్తిన పడతాయి.

కేంద్రం నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే నిధుల శాతం గణనీయంగా పెరిగింది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మాత్రం భారం మోయక తప్పదని కేంద్ర సర్కారు చేసే వాదనలు పసలేనివని ఇప్పటికే అనేకమంది ప్రముఖ ఆర్థికవేత్తలు సాధికారికంగా లెక్క తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలకు బదలాయించిన పన్నుల ఆదాయంలో పెరుగుదల చూపిస్తున్నారుగానీ నిజానికి ప్రణాళికేతర వ్యయం, ప్రణాళికా గ్రాంట్లు, కేంద్ర పన్నుల ఆదాయాల నుండి రాష్ట్రాలకు బదలాయించిన ఆదాయాలు 2010–11, 2015–16 మధ్య కాలంలో తగ్గుముఖం పట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేసే వాదనలను ఖండిస్తూ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు తమకు రావాల్సిన నిధులు స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) శాతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత సంక్షేమ పథకాల అమలు అలవికాని భారాన్ని మోపుతున్నాయని ప్రకటించాయి. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రోజు ఎదుర్కొంటున్న నిధుల కొరత దృష్ట్యా ఇప్పుడున్న సంక్షేమ పథకాలను ఇవే రూపంలో ఎలా కొనసాగిస్తాయో

> **"కానీ అసలు నిజం ఏమిటి? నిజంగానే కేంద్ర ప్రభుత్వం దగ్గర నిధులు లేవా? బడా కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య వర్గాలు దేశ, విదేశీ, బహుళజాతి సంస్థలు అనేక సందర్భాలలో డిమాండు చేస్తున్న రకరకాల రాయితీల విషయంలో కూడా వారికి ప్రభుత్వం ఇదే సమాధానం చెప్పగలదా? పొరబాటున కూడా ఆ మాట అనదు."**

వేచి చూడాల్సిందే. పేద మహిళలకు, పిల్లలకు, నవజాత శిశువులకు, గర్భిణీ స్త్రీలకు ఉద్దేశించిన ఈ పథకాల కొనసాగింపుతో పాటు, ఈ పథకాల విస్తృత అమలుకోసం పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆషా, మధ్యాహ్న భోజన పథక కార్మికుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఈ అనుమానాలను తీర్చాల్సిన కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం సందేహాస్పద మౌనం పాటిస్తున్నది.

విలువైన మానవ వనరుల అభివృద్ధికి ఈ సంక్షేమ పథకాలు, సేవలు ఆవశ్యకమైనవని ప్రభుత్వం అంగీకరిస్తుంది. మానవాభివృద్ధి సాధించటానికి ప్రభుత్వం చేపడుతున్న కృషికి ఈ 'స్కీం వర్కర్లు' వెన్నెముకగా నిలుస్తున్నారని కూడా ఒప్పుకుంటుంది. అయితే ఆ కార్మికుల విషయంలో కొంత అన్యాయం జరుగుతున్న మాట వాస్తవమే. వారి డిమాండ్లు సమంజసమైనవే అని ప్రకటిస్తుంది. కానీ ఈ డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి కేంద్రంలో అధికారం చెలాయించిన కాంగ్రెస్ ప్రభుత్వంగానీ, బిజెపి ప్రభుత్వంగానీ నిధుల కొరతను సాకుగా చూపించి తప్పించుకుంటున్నాయి. పైపై ఓదార్పు మాటలతో కాలం వెళ్ళదీసుకు వస్తున్నాయి.

కానీ అసలు నిజం ఏమిటి? నిజంగానే కేంద్ర ప్రభుత్వం దగ్గర నిధులు లేవా? బడా కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య వర్గాలు దేశ, విదేశీ, బహుళజాతి సంస్థలు అనేక సందర్భాలలో డిమాండు చేస్తున్న రకరకాల రాయితీల విషయంలో కూడా వారికి ప్రభుత్వం ఇదే సమాధానం చెప్పగలదా? పొరబాటున కూడా ఆ మాట అనదు. అందులోనూ నయా ఉదారవాద విధానాల నేపథ్యంలో అటు కాంగ్రెస్, ఇటు బిజెపి ప్రభుత్వాలు రెండూ అలాంటి సమాధానం చెప్పడానికి ఏనాడూ సాహించలేదు. కార్మికుల సమంజసమైన కోర్కెలను పరిష్కరించాల్సి వచ్చేసరికి నిధుల కొరతను సాకుగా చూపిస్తున్న ప్రభుత్వం బహుళజాతి సంస్థలు కార్పొరేట్ బాబుల



కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

విషయాకొచ్చేసరికి ఏటా లక్షల కోట్ల రూపాయల మేర రాయితీలు ఉదారంగా ప్రకటించేస్తున్నది. ఈ రకమైన రాయితీలను 'పోగొట్టుకున్న ఆదాయం' అని ముద్దు పేరుపెట్టి మరీ ఏ ఏడాది ఎంత ఆదా యం వదులుకుంటుందీ బడ్జెట్‌లో చూపిస్తు న్నాయి. గత ఏడెనిమిదేళ్ళుగా చూసుకుంటే సగటున ఏటా 5 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం దేశ, విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టింది. ఇది కాకుండా ఏటా మరో నాలుగైదు లక్షల కోట్ల రూపాయల ప్రత్యక్ష పన్నులను కావాలనే వసూలు చెయ్యకుండా వదిలేస్తున్నారు. అంటే ఏటా మొత్తంగా 8 నుండి 10 లక్షల కోట్ల రూపాయలను ప్రభుత్వం వీరికి కట్టబెడుతుంది. ఇదంతా ప్రభుత్వం జేబులో సొమ్ము కాదు, ఇదంతా ప్రజాధనం.

సంక్షేమ పథకాల అమలు కోసం పనిచేస్తున్న కార్మికులకు చట్టపరంగా ఎటువంటి హక్కులూ లేకుండా చెయ్యడానికి వాళ్ళకి 'సామాజిక కార్మికులు', 'కార్యకర్తలు' అన్న నూతన నామ ధేయాలు తగిలిస్తున్నారు. పేదలకు ఇచ్చే సబ్సిడీల నేమో అనుత్పాదక వ్యయం పేరిట ఎక్కడికక్కడ కోత పెట్టాలని చూస్తున్నారు. దేశ విదేశీ కార్పొరేట్ శక్తులకు పందేరం చేస్తున్న విలువైన సహజ వనరులు, లక్షల కోట్ల రూపాయల మినహాయింపులనేమో 'రాయితీ'లుగా చలామణి చేస్తున్నారు.

ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తుంది, ఎవరి ప్రయోజనాలు కాపాడుతుంది అనేది దీన్ని బట్టే మనకి అర్థం కావాలి. ఈ దేశంలో సకల సంపదల సృష్టికి మూలం కార్మికులు, వారు వెచ్చించే శ్రమలే. అలాంటి కార్మికుల పిల్లలు, ఈ దేశ భవిష్యత్తు పౌరులు అయిన వారి ఆలనా పాలనా, పోషణ విషయంలో ప్రభుత్వం ఏ బాధ్యతా లేకుండా వ్యవహరించడం సమంజసమేనా? దేశ, విదేశీ బహుళజాతి కార్పొరేట్ శక్తులు ఒక ప్రక్కన విలువైన జాతి సంపదను కొల్లగొడుతూ మరో ప్రక్కనుండి ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి లక్షలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని అప్పులుగా తీసుకొని ఎగగొడుతూ, చెల్లించాల్సిన పన్నులు చెల్లించకుండా పేరబెడుతూ, కార్మికుల శ్రమను దోచుకుంటూ అంతులేని సంపద పోగేసుకుంటున్నా వారి లాభాల దాహానికి అంతేలేదు. ప్రభుత్వం వీళ్ళ కొమ్మే ఎందుకు కాస్తుంది? ఈ రెండు ప్రశ్నలకి జవాబులను జనం సరిగా అర్థం చేసుకుంటే తమ జీవన ప్రమాణాలు మెరుగుపరుచుకోవడానికి ఏం చెయ్యాలో వారే నిర్ణయించుకొని, చైతన్యపూరితంగా పోరాటమార్గంలోకి వస్తారు.

ప్రభుత్వం చేస్తున్న ఈ మోసాల్ని స్కీం వర్కర్లు, కార్మికవర్గం సహిస్తూ ఎంతోకాలం ఊరుకోదు. స్కీము వర్కర్లకు ముఖ్యంగా అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఆశా కార్మికులు, పారా టీచర్లు తమ డిమాండ్ల సాధనకు పోలీసు నిర్బంధాలు, అణచివేతలు, కక్ష సాధింపులు వీటన్నింటినీ తట్టుకొని వీరోచిత పోరాటం చేసిన చరిత్ర ఉంది. కుటుంబపరంగా ఎదురయ్యే ఆటంకాలను, ఇబ్బందులను అధిగమించి మరీ వీరు వీధుల్లోకి వచ్చి పోరాటాలు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులను కూడా తమ పోరాటాల్లో భాగస్వాముల్ని చేస్తున్నారు. అయినా ఇన్ని పోరాటాలు, ఇన్ని త్యాగాల తరువాత కూడా మన డిమాండ్లు అపరిష్కృతంగా ఎందుకు ఉంటున్నాయి. ప్రభుత్వం కూడా మన డిమాండ్లు న్యాయమైనవే అని చెబుతుంది కదా! అయినా వాటిని ఎందుకు పరిష్కరించడం లేదు. ఎందుకు పరిష్కరించడం లేదంటే ఈ ప్రభుత్వం అనుసరించే విధానాలే అందుకు అడ్డంకిగా ఉన్నాయి.

అటు యు.పి.ఎ. ప్రభుత్వంగానీ ఇప్పటి

(మిగతా 34వ పేజీలో)

# సరళీకరణ విధానాలు ప్రజారోగ్యం

ఆర్. రామచంద్రన్

భారతదేశంలో 1991లో ప్రారంభమైన సరళీకరణ ఆర్థిక విధానాల ఫలితంగా ఏర్పడిన దుష్ఫలితాలను ఎదుర్కొంటున్న వాటిలో 'ప్రజారోగ్యం' ఒకటి. బ్రెటన్‌ఉడ్ సంస్థలు (ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి) వ్యవస్థాగత సంస్కరణల కార్యక్రమాన్ని భారత దేశంలో నిర్వహించాలని ఒత్తిడిచేశాయి. ఆనాటి నుండే నయా ఉదారవాద ఆర్థిక విధానాలు ఇంతకు ముందున్న ప్రభుత్వాలు అమలు చేస్తూ వచ్చాయి. 20వ శతాబ్దం చివరిలో అభివృద్ధి చెందిన దేశాల చేత స్థాపించబడిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ.) ఆదేశాల ప్రకారం ఉదారవాద ఆర్థిక విధానాల అమలు ఫలితం పరోక్షంగా ఔషధాల ధరలపై, ప్రత్యక్షంగా ఆరోగ్య భద్రత కల్పన కొరకు ప్రభుత్వ పెట్టుబడులు, వైద్య విద్యపై ప్రభావం చూపుతున్నాయి.

1980 ప్రారంభంలో అభివృద్ధి చెందిన దేశాలు ముందుకు తెచ్చిన 'ప్రపంచీకరణ' కొనసాగింపు ఫలితమే అభివృద్ధి చెందుతున్న దేశాలలో 'ఆర్థిక సంస్కరణలు'. నాటి నుండి ఈ ప్రపంచీకరణే ప్రపంచవ్యాప్తంగా పరిపాలన, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలకు పునాదిని రూపొందించింది. ప్రపంచస్థాయిలో ఆరోగ్య భద్రతా వ్యవస్థను నియంత్రించిన అనేక ప్రముఖ సంస్థల నిర్మాణాలలో, విధానాలలో మార్పులు సంభవించడానికి కారణం ఈ ప్రపంచీకరణే. ఐక్య రాజ్యసమితి, దానియొక్క అంగాల మసకబారిపోయిన పాత్రతో ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య భద్రతా సలహాదారుగా, జాతీయంగా ఆరోగ్య భద్రతా పాలకవర్గంగా ఉన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ.) బలహీనపడడానికి ప్రపంచీకరణ దారితీసింది. ప్రపంచ దేశాలలో ఆరోగ్యానికి సంబంధించిన విషయాలలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ.హెచ్.ఓ.) పాత్ర క్షీణిస్తున్నది. జాతీయస్థాయిలో ఆరోగ్య విధి విధానాల రూపకల్పనలో ప్రపంచ బ్యాంకే ఒక బలీయమైన శక్తిగా ముందుకు వచ్చింది.

1987లో ప్రపంచ బ్యాంక్ "ఫైనాన్సింగ్ హెల్త్ సర్వీసెస్ ఇన్ డెవలపింగ్ కంట్రీస్" అనే పేరుతో కొన్ని పత్రాలతో బయటికి వచ్చినపుడే ఈ స్థితి ప్రారంభమైంది. 8 పత్రాల సిఫారసులు, ఆర్థిక సంస్కరణలు చేపట్టిన దేశాలలోని ఆరోగ్య రంగంపై ఆ సిఫారసులు ఒక నిర్ణయాత్మక ప్రభావం చూపడం ప్రారంభించాయి.

ఎ) ప్రభుత్వరంగ ఆరోగ్య సేవలకు రోగులు చెల్లించే మొత్తాన్ని పెంచడం బి) ప్రైవేట్ ఆరోగ్య బీమా పథకాలను అభివృద్ధి చేయడం సి) ప్రైవేట్ రంగం యొక్క పాత్రను విస్తరించడం.డి) ప్రభుత్వ ఆరోగ్య భద్రతా సేవలను వికేంద్రీకరించడం.

ఈ సిఫారసులు తరువాత మార్చబడి 1993లో 'ఇన్వెస్టింగ్ ఇన్ హెల్త్' పేరుతో విడుదల చేసిన ప్రపంచ అభివృద్ధి నివేదికలో నొక్కి చెప్పబడినాయి. దాని ఫలితంగా ఆరోగ్య భద్రత అనేది ప్రజలకు ఉపయోగపడే సేవగా పరిగణించబడకుండా, ప్రపంచీకరణ విధానంలో వ్యాపార సేవగా, మార్కెట్‌లో దొరికే ఒక సరుకుగా పరిగణించబడింది. ఈ ప్రపంచ బ్యాంకు సిఫారసులు ఉదారవాద విధానాల కొనసాగింపులో భాగంగా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో అమలు పరచబడుతున్నాయి. ఆయా దేశాలు వాటి యొక్క ఆర్థిక సంక్షోభాల నుండి బయటపడటానికి ప్రపంచ బ్యాంకు అప్పు ఇవ్వడానికి విధించిన షరతులు అవి. సిఫారసులపై వచ్చిన తీవ్రమైన విమర్శలను దృష్టిలో ఉంచుకొని ప్రపంచ బ్యాంక్ ప్రభుత్వరంగ సేవల మార్పును గురించి నొక్కి చెప్పడం తగ్గించింది. ప్రాథమిక ఆరోగ్య భద్రతను సంరక్షించే బాధ్యతలను తగ్గించి, ప్రైవేటు రంగం పాత్రను పెంచే విధానాలను ప్రభుత్వాలు కొనసాగించేటట్లు చేసింది.

దీని ఫలితంగా భారతదేశంలో ఆరోగ్య భద్రతను కల్పించే బాధ్యత నుండి ప్రభుత్వం నెమ్మదిగా తప్పుకుంటున్నది. ప్రపంచ బ్యాంక్ ఆదేశానుసారం గత రెండు దశాబ్దాలుగా ఆరోగ్య భద్రతా విధానం కొన్ని మార్పులకు గురవుతూ వచ్చింది. అవి ఎ) ప్రజారోగ్యంపై పెట్టుబడుల క్షీణత, సేవా పన్నులు లేదా యూజర్ ఛార్జీల వసూళ్ళు. ప్రజా ఆరోగ్య భద్రతలో భాగంగా రోగనిర్ధారణ పరీక్షలు చేయించడం, ప్రైవేట్ రంగం సేవలను భరించలేని పేదలను బలవంతంగా ఆ రంగం సేవల కొరకు పంపడం బి) ఆరోగ్య బీమాను ప్రవేశపెట్టడం. ఇది ప్రజారోగ్య భద్రతను బలహీనపరుస్తుంది. ఎందుకంటే ఉచిత ఆరోగ్య సేవలు లేదా తక్కువ ఖర్చుతో కూడుకున్న సేవలు అందుబాటులో ఉన్నపుడు ప్రైవేట్ ఆరోగ్య బీమా అవసరం ఉండదు సి) ఆరోగ్య భద్రత కల్పనలో ప్రైవేట్ రంగం యొక్క భాగస్వామ్యాన్ని పెంచడం. ఇది ప్రధానంగా లాభాపేక్షతో కూడుకున్న, జబ్బు రాకుండా తీసుకునే జాగ్రత్తలకు భిన్నంగా జబ్బును తగ్గించే లక్ష్యంగా, ఎక్కువ డబ్బు సంపాదించే విధంగా ఆరోగ్య సేవలను అందిస్తుంది. డి) ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం యొక్క పాత్రను మార్చివేసి స్థానికంగా ఉండే కమ్యూనిటీలకు, ప్రభుత్వేతర సంస్థలకు బాధ్యతలను అప్పజెప్పడం జరిగింది. చాలా సంస్థలు పెద్ద ఎత్తున జీవనశైలికి సంబంధించిన హెచ్.ఐ.వి., ఎయిడ్స్ లాంటి జబ్బులపై కేంద్రీకరించడం జరిగింది. అలాంటి జబ్బులకు ప్రభుత్వేతర సంస్థలకు అంతర్జాతీయంగా నిధులు చాలా తేలికగా సమకూర్చడం జరుగుతుంది.

స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో 5 శాతం ప్రజా ఆరోగ్య ఖర్చులకు నిధులు కేటాయించాలన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసులకు భిన్నంగా, భారతదేశ ప్రభుత్వం గత రెండు దశాబ్దాలుగా నిధుల కేటాయింపును కేవలం 1 శాతం వద్దే నిలిపివేసింది. 11వ పంచవర్ష ప్రణాళిక చివరి నాటికి స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో 2 శాతం కేటాయింపులకు గాను కేవలం 1.09 శాతం మాత్రమే కేటాయింపులను సాధించడం జరిగింది. 12వ పంచవర్ష

> **"లాభాలను అధికం చేసుకోవడానికి, ప్రైవేట్ రంగం యొక్క దృష్టి ఖరీదైన వైద్యంపై ఎక్కువగా ఉంటుంది. ఆ వైద్యం పేదవారికి అంతగా ముఖ్యమైనది కాదు. అంటురోగాల బారిన పడి, అత్యవసర ప్రాథమిక చికిత్స పొందవలసిన పేదలకు, ఆ ఖరీదైన వైద్యం ఉపయోగపడదు. ప్రైవేట్ రంగంలో ధరలు కూడా చాలా వేగంగా పెరుగుతున్నాయి."**

ప్రణాళికలో, ప్రణాళికా కమీషన్ 11వ పంచ వర్ష ప్రణాళికలో పెట్టుకున్న లక్ష్యం కన్నా తక్కువ లక్ష్యాన్నే పెట్టుకోవడం జరిగింది. 12వ పంచ వర్ష ప్రణాళికా కమీషన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటైన 'ఉన్నతస్థాయి నిపుణుల గ్రూపు' (హెచ్.ఎల్.ఇ.జి.) సిఫారసు చేసిన 2.5 శాతం నిధుల కేటాయింపుకు భిన్నంగా 12వ పంచవర్ష ప్రణాళిక కేవలం 1.58 శాతం కేటాయింపులను మాత్రమే సాధించింది. గత నాలుగు సంవత్సరాల బడ్జెట్ కేటాయింపుల సంఖ్యను బట్టి, రానున్న కాలంలో కేటాయింపులు దాదాపు 1.2 శాతంగా ఉండవచ్చు.

ప్రైవేట్ రంగం ఇంత పెద్ద శూన్యాన్ని పూడ్చుదానికి లోపలికి అడుగుపెట్టింది. ఈ రంగంలో జాతీయంగా అయిన ఖర్చులో 75 శాతం ప్రైవేట్ రంగానిదే. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా అయిన ఖర్చులలో ఒకటిగా ఉంటుంది. ఆరోగ్య రంగంలో పెట్టుబడులు లేని ఫలితంగా సరియైన సంఖ్యలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పి.హెచ్.సి.లు), ద్వితీయస్థాయి కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు (సి.హెచ్.సి.లు) అందుబాటులో లేని కారణంగా గ్రామీణ వ్యవస్థలో ప్రాథమిక ఆరోగ్య భద్రతను వదిలివేయడం, పేదలను సుదూర ప్రాంతాలలో ఉన్న పట్టణాలకు, ప్రైవేట్ ఆసుపత్రులకు పంపించడం జరుగుతున్నది. దీని వలన సగటు మానవుడు ఆరోగ్యంపై పెద్ద మొత్తంలో జేబులో నుండి తీసి ఖర్చు చేయటం జరుగుతున్నది. ఆరోగ్యంపై ఖర్చులో 65 శాతం స్వంతంగా భరించాల్సి రావటం ధనికులకు, పేదలకు మధ్య ఆరోగ్య భద్రత విషయంలో పెద్ద తేడా ఏర్పడడానికి అవుతున్నది.

ఔషధాలపై పెట్టే ఖర్చు, కుటుంబానికయ్యే ఖర్చులో 10 శాతంకు పైగా ఉంటున్నదని, ఆ కారణంగానే పేదలు అప్పులు తీర్చలేక పోతున్నారని అనేక అధ్యయనాలు తెలియజేశాయి. ఒక అంచనా ప్రకారం, దీని ఫలితంగా ప్రతి ఏటా 4 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువకు నెట్టబడుతున్నారు. ప్రైవేట్ పెట్టుబడి యొక్క ప్రాథమిక కర్తవ్యం లాభం పొందడం, అదే విధంగా ప్రవేట్ రంగానికి ప్రాథమిక ఆరోగ్య భద్రత పట్ల కొంత శ్రద్ధ కూడా ఉన్నది. లాభాలను అధికం చేసుకోవడానికి, ప్రైవేట్ రంగం యొక్క దృష్టి ఖరీదైన వైద్యంపై ఎక్కువగా ఉంటుంది. ఆ వైద్యం పేదవారికి అంతగా ముఖ్యమైనది కాదు. అంటురోగాల బారినపడి, అత్యవసర ప్రాథమిక చికిత్స పొందవలసిన పేదలకు, ఆ ఖరీదైన వైద్యం ఉపయోగపడదు. ప్రైవేట్ రంగంలో ధరలు కూడా చాలా వేగంగా పెరుగుతున్నాయి. సరళీకరణ విధానాలు అమలు అయిన దగ్గర నుండి ధరలు 300 శాతం పెరిగాయి. ప్రైవేట్ ఆరోగ్య భద్రత అంటే ఆరోగ్య భద్రత యొక్క కార్పొరేటీకరణ. ఆరోగ్య రంగంలో వ్యాపారం కొరకు ప్రవేశించిన కార్పొరేట్ శక్తులతో కూడుకున్న, ఆరోగ్య భద్రత యొక్క కార్పొరేటీకరణ అని నేడున్న పరిస్థితులలో అర్థం చేసుకోవాలి.

మన దేశం 25 సంవత్సరాల ఆర్థిక సంస్కరణల మైలురాయిని దాటింది. ఆ సంస్కరణలలో భాగంగా ఆరోగ్య రంగంలో సంస్కరణలు, రాష్ట్రాలలో పెరిగిపోయిన రోగాల ఫలితంగా పెరిగిన ఇబ్బందులు, ఆరోగ్య భద్రతలో, ఆరోగ్య సూచికలలో సబ్ సహారా ఆఫ్రికాకు దగ్గరగా మారుతున్నా ప్రభుత్వం ప్రైవేటురంగాన్ని ప్రోత్సహించే విధానాలనే ముందుకు తీసుకుపోతున్నది. గత యూ.పి.ఎ. ప్రభుత్వంలో ఈ రంగంలో ఏ విధమైన పెట్టుబడులు లేకపోయినప్పటికీ జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (ఎన్.ఆర్.హెచ్.ఎం.) ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య భద్రతా విధానాన్ని విస్తరించి, బలోపేతం చేసింది. ఇది (ఎన్.ఆర్.హెచ్.ఎం.) ప్రస్తుతం ఉనికిలో ఉన్న ప్రజా ఆరోగ్య విధానం, పరిమిత వనరులతో సానుకూలమైన మార్పులు సాధించవచ్చునని నిరూపించింది. కానీ దీని ద్వారా వచ్చిన ముఖ్యమైన గుణపాఠాలు మాత్రం విధాన రూపకల్పన చేసేవారికి, పాలకులకు అతి ముఖ్యమైనవిగా కనిపించడం లేదు. ప్రజలకు కల్పించాల్సిన ఆరోగ్య భద్రత పట్ల వహించవల్సిన బాధ్యతను మాత్రం నెరవేర్చ నిరాకరిస్తున్నారు.

మొట్ట మొదటిసారిగా నయా ఉదారవాద విధానాలు ప్రభుత్వ చర్చలో, విధాన నిర్ణయాలలో భాగం అయిన దగ్గర నుండి ప్రణాళికా కమీషన్ 12వ పంచవర్ష ప్రణాళికలో ఆరోగ్యంపై విడుదల చేసిన పత్రాలు, జాతీయ ఆరోగ్య విధానం (ఎన్.హెచ్.పి.) చిత్తుప్రతి 2015, బహిరంగంగా ప్రజా ఆరోగ్య భద్రత ప్రైవేటీకరించబడవలసిన అవసరాన్ని నొక్కి చెపుతూ వచ్చాయి. వాస్తవానికి ప్రజా రోగ్యాన్ని ప్రైవేట్ రంగానికి నెమ్మదిగా తనఖా పెట్టించడానికి పథకం రచించిన జాతీయ ఆరోగ్య విధానం (ఎన్.హెచ్.పి.) 2015, ప్రజా ఆరోగ్యానికి తక్కువ నిధులు ఖర్చు చేయాలన్న విధానాన్ని సమర్థించింది.

### ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం & ప్రైవేట్ బీమా

ఆరోగ్య భద్రతకు సంబంధించి, పెరుగుతున్న ప్రైవేట్ రంగం యొక్క భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనుసరించిన పద్ధతులలో ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్యం ఒకటి. ఈ పద్ధతిలో ఉన్నటువంటి లోపాలు చాలా విస్తృతంగా చర్చించబడినాయి. సరియైన పద్ధతులలో పరిశీలన చేయకుండా ప్రభుత్వ – ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతులను పాటించడం వల్ల ప్రైవేట్ రంగం లాభం పొందే విధంగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయబడతాయి అని అనేక అధ్యయనాలు వెల్లడించాయి.

ప్రైవేట్ రంగం యొక్క ప్రవేశాన్ని ప్రోత్సహించిన ప్రపంచ బ్యాంక్‌చే సిఫారసు చేయబడిన 'ఆరోగ్య బీమా' ను ప్రవేశపెట్టడం, కేంద్ర ప్రభుత్వం అనుసరించిన మరొక పద్ధతి. ప్రపంచంలోనే ఖరీదైన ఆరోగ్య విధానం అమలులో ఉన్న అమెరికా తప్ప, బాగా అభివృద్ధి చేయబడిన ఆరోగ్య భద్రతా విధానం అమలులో ఉన్న అన్ని పారిశ్రామిక దేశాలలో 'ఆరోగ్య బీమా' ఉనికిలో ఉన్నది. ఈ అన్ని దేశాలలో ప్రభుత్వ బీమా పథకాల భాగస్వామ్యమే చాలా ఎక్కువగా ఉన్నది. కానీ భారతదేశంలో ఆరోగ్య భద్రతను ప్రైవేటీకరణ దిశగా ప్రోత్సహిస్తున్నారు. ఎందుకంటే మన దేశంలో ఆరోగ్య బీమా యంత్రాంగం ఎక్కువగా ప్రైవేట్ రంగానికి సంబంధించినదే.

12వ పంచవర్ష ప్రణాళిక పత్రంలో ఆరోగ్య విధానంలో ఆరోగ్య బీమాను చేర్చే విధంగా ఉనికిలో ఉన్నటువంటి ఆరోగ్య విధానాన్ని పునర్నిర్మించనున్నట్లు స్పష్టంగా చెప్పడం

జరిగింది. దాని ప్రకారం ఆరోగ్య విధానం 'సేవ, బీమా' ల మిశ్రమంగా ఉంటుంది. పునర్నిర్మించడం అంటే అర్థం ఆరోగ్య భద్రతా విధానాన్ని జాగ్రత్తగా నియంత్రించేతీరు. ఇది ప్రభుత్వ నిధులతో ఆరోగ్య భద్రతను నిర్వహించే తీరు నుండి ప్రభుత్వమే ఒక 'మేనేజర్' గా ఉంటూ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఆరోగ్య సేవలు నిర్వహించబడే విధానం వైపు కదులుతున్నట్లు స్పష్టంగా అర్థం అవుతున్నది. ఇప్పటికే బలపడిన కార్పొరేట్ శక్తులచే నడిపించబడుతున్న ప్రైవేట్ ఆరోగ్య భద్రతా విధానాన్ని మరింత పటిష్ట పరుస్తూ, ప్రజా ధనంతో ఆరోగ్య భద్రతను కొనుగోలు చేసే కొనుగోలుదారునిగా ప్రభుత్వం మారుతోంది.

యూ.పి.ఎ. ప్రభుత్వం దేశవ్యాప్తంగా రాష్ట్రీయ స్వాస్థ్య బీయా యోజన (ఆర్.ఎస్.బి.వై.) అనే పథకాన్ని ఈ తలంపుతోనే ప్రారంభించింది. ఇది భవిష్యత్‌లో ప్రజా ఆరోగ్య భద్రత ఏ విధంగా ఉండబోతోందో సూచిస్తుంది. ఉన్నతస్థాయి నిపుణుల గ్రూపు (హెచ్.ఎల్.ఇ.జి.) ప్రస్తుత ఆరోగ్య బీయా పథకాలకు వ్యతిరేకంగా కొన్ని సిఫారసులు చేసినప్పటికీ, 12వ పంచవర్ష ప్రణాళిక పత్రం వాస్తవంగా ఆర్.ఎస్.బి.వై. లాంటి బీమా పథకాలను విస్తరించడానికి పూనుకున్నది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఒక జాతీయ బీమా విధానం ద్వారా అందరికీ ఆరోగ్య బీమాను వర్తింపజేయనున్నట్లు ప్రకటించింది.

ప్రపంచీకరణ విధానం అమలులో భాగంగా 1990లో స్థాపించబడిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ.) యొక్క మద్దతుతో జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ ఇన్ సర్వీసెస్ (జి.ఎ.టి.ఎస్.) చేసుకున్న ఒప్పందం ఫలితంగానే బీమా రంగంలో ప్రైవేట్ వ్యక్తులకు ప్రవేశం కల్పించడం వల్లనే వారికి విదేశీ బీమా ఏజెన్సీలలో భాగస్వామ్యం ఏర్పడింది. ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పరిణామాల ఫలితంగా ఆరోగ్య భద్రతా యాజమాన్య సంస్థలు, ఆరోగ్య భద్రతకు సంబంధించిన సాంకేతిక కంపెనీలు పాశ్చాత్య ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు, బీమా కంపెనీలు భారతీయ మార్కెట్ లోపలికి చొచ్చుకొనివచ్చాయి.

### ట్రిప్స్ పేటెంట్లు

ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఓ.)తో జరిగిన చర్చల్లో ఆరోగ్య రంగంపైన ప్రభావాన్ని చూపించిన దాని ఫలితమే ట్రేడ్ రిలేటెడ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ట్రిప్స్) ఒప్పందం. ఈ ఒప్పందం వలన స్వదేశీ మందుల పరిశ్రమలకు, మందులను పేటెంట్ క్రిందకు రానీయకుండా సేవలందించిన ఇండియన్

"మన పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌లోకి, పేటెంట్ మందుల నిర్ణీత గడువు సమయం (ఎక్స్‌పైరీ) పూర్తి అవడానికి ముందే, కొత్త మందులను అతి తక్కువ ధరలకు అందుబాటులో ఉంచగలిగింది. ఆ విధంగా భారతదేశం ఆఫ్రికాలో అంటువ్యాధులు ప్రబలంగా ఉన్నప్రాంతాల కు, ఇతర మూడవ ప్రపంచ దేశాలకు పెద్ద మొత్తంలో మందులను సరఫరా చేయగలిగింది."




కార్పొరేట్ ఆసుపత్రి

పేటెంట్ చట్టం, 1970ని భారత ప్రభుత్వం మార్చింది. ట్రిప్స్ నియమ నిబంధనలు వర్తింపచేస్తూ మందులు ఉత్పత్తి చేసుకునే విధంగా ఇండియన్ పేటెంట్ యాక్ట్ 2005ను తీసుకొనివచ్చింది. 1970 చట్టం ప్రకారం పరిమిత కాలంలోనే భారతీయ ఫార్మా పరిశ్రమ పేటెంట్ రక్షణకు సంబంధించిన ఇబ్బందులు ఏమీ లేకుండానే విదేశాలలో పేటెంట్ అనుమతించిన మందులను క్రొత్త రసాయన, భిన్నమైన పద్ధతి ప్రకారం పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసే ఒక కొత్త విధానాన్ని ఉపయోగించుకున్నది. ఫలితంగా శక్తివంతమైన జనరిక్ మందుల పరిశ్రమ దేశంలో ఏర్పాటు అయింది.

1980వ సంవత్సరం నాటికి భారతీయ ఫార్మా పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న దేశాలలో అభివృద్ధి చెందిన పరిశ్రమలలో ఒకటిగా తయారైంది. మందులు ఈ విధంగా తయారు చేయబడడం అనేది, పాశ్చాత్య దేశాల నుండి పేటెంట్ మందుల ధరలో ఒక చిన్న భాగంగా ఉండడం వలన 1990 నాటికి భారతదేశం అభివృద్ధి చెందుతున్న ప్రపంచానికి ఫార్మా కంపెనీగా గుర్తింపురావడం జరిగింది. మన పరిశ్రమ ప్రపంచ మార్కెట్‌లోకి, పేటెంట్ మందుల నిర్ణీత గడువు సమయం (ఎక్స్‌పైరీ) పూర్తి అవడానికి ముందే, కొత్త మందులను అతి తక్కువ ధరలకు అందుబాటులో ఉంచగలిగింది. ఆ విధంగా భారతదేశం ఆఫ్రికాలో అంటువ్యాధులు ప్రబలంగా ఉన్న ప్రాంతాలకు, ఇతర మూడవ ప్రపంచ దేశాలకు పెద్ద మొత్తంలో మందులను సరఫరా చేయగలిగింది.

వామపక్షపార్టీలు ప్రతిపక్షంలో ఉన్నందున 2005 పేటెంట్ చట్టంలో కొన్ని ఆరోగ్య రక్షణా చర్యలు సవరణలుగా ప్రవేశపెట్టబడినాయి. ఈ సవరించబడిన పేటెంట్ చట్టంలో ముఖ్యమైనదేమంటే భారతీయ జనరిక్ మందుల ఉత్పత్తిదారులు 1995–2005 మధ్య కాలంలో ప్రవేశపెట్టిన పేటెంట్ మందుల ఉత్పత్తులను కొనసాగించవచ్చును. ఈ కొత్త చట్టం పాక్షికంగానైనా ఆరోగ్య రంగంపై అపాయకరమైన ప్రభావం పడకుండా కొంతమేరకు తగ్గించింది.

కానీ ఆరోగ్య సంరక్షణ చట్టం పరిధికి లోబడి మందులను తయారుచేసే న్యాయబద్ధమైన హక్కు భారతీయ మందుల కంపెనీలకు ఉన్నప్పటికీ, బహుళజాతి కంపెనీలు ఆర్థిక బలంతో, అధికారంతో భారతీయ మందుల కంపెనీలకు వ్యతిరేకంగా కేసులు వేస్తూ వస్తున్నాయి. కానీ ఈ మధ్య కాలంలో భారతీయ కంపెనీలు వారికి ఉన్న పరిమితమైన బలంతో బహుళజాతి కంపెనీలను నిలువరించలేకపోతున్నాయి. కొన్ని సందర్భాలలో కోర్టులలో వాదనలకు తట్టుకోలేక పోరాటాల నుండి తప్పుకుంటున్నాయి. మరీ కొద్దికాలంగా బహుళజాతి కంపెనీలతో భారతీయ కంపెనీలు రాజీపడుతూ వస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాక వారి (బహుళ

> **"అంతేకాకుండా ప్రభుత్వాలు ఆరోగ్య భద్రతలో ప్రైవేట్‌రంగం వారిని భాగస్వామ్యం చేయడానికిగాను సబ్సిడీలు, ముఖ్యంగా భూములను ఉచితంగా ఇవ్వడం లాంటి కార్యక్రమానికి ప్రతిఫలంగా రోగులలో కొంత శాతం ఉచితంగా ఇన్‌పేషెంట్స్, అవుట్ పేషెంట్స్‌కు వైద్య సేవలందిస్తామన్న వారి (ప్రైవేట్‌రంగం) మాటను నిలబెట్టుకోలేదు."**

జాతి కంపెనీల) యొక్క పేటెంట్ మందులకు భారతీయ కంపెనీలు మార్కెటింగ్ ఏజెంట్లుగా తయారౌతున్నాయి.

కానీ గత కొన్ని సంవత్సరాలుగా కొత్త పేటెంట్ చట్టం యొక్క ప్రత్యక్ష ప్రభావం స్పష్టంగా కనపడుతున్నది. 2014లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం 140 పేటెంట్ మందుల ఉత్పత్తులలో కేవలం 92 ఉత్పత్తులకు సంబంధించి అవి భారతదేశంలో తయారు చేయ బడుతున్నాయా లేదా అనే విషయం పరిశీలిస్తే కేవలం 4 రకాలు మాత్రమే భారత దేశంలో తయారవుతున్నాయన్న విషయం బయటపడింది. మిగిలిన 88 రకాలను దిగుమతి చేసుకొని భారతదేశ మార్కెట్‌లో అత్యంత ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. 2012లో ఏర్పాటు చేయబడిన మందుల ధరల నియంత్రణ ఆర్డర్ (డి.పి.సి.ఓ.) కు ఈ మందుల (పేటెంట్) ధరలను నియం త్రించే అధికారం లేదు. ఒక మందుపై పేటెంట్ కలిగిన వ్యక్తి తనకున్న పేటెంట్‌ను ఉపయోగిం చనపుడు లేదా ప్రజారోగ్యాన్ని సంరక్షించే ఆ పేటెంట్ మందు కొనగలిగిన ధరలో అందు బాటులో లేనపుడు భారతీయ మందుల తయారీదారులకు ఆ పేటెంట్ మందును తయారుచేయడానికి అనుమతించే కంపల్సరీ లైసెన్సింగ్ (సి.ఎల్.) చట్టం ఈ కేసులో అంతగా ఉపయోగించబడడం లేదు. దాని ఫలితంగా కొన్ని మందుల ధరలు సగటు మానవుని కొనుగోలు శక్తికి మించి ఎక్కువగా ఉంటున్నాయి.

**వైద్య పర్యటనలు ( మెడికల్ టూరిజం)**

ప్రపంచీకరణ అనంతరం ఆరోగ్య భద్రతలో ప్రైవేట్ రంగం యొక్క మితిమీరిన జోక్యంతో ఈ మధ్య కొత్తగా పెద్ద ఎత్తున పెరిగిపోయిన "వైద్య పర్యటన" ఒకటి. ఇది ముఖ్యంగా ప్రైవేట్ రంగం, భారతీయ ప్రజానీకానికి ఆరోగ్య భద్రత సేవలు అందించాల్సిన ప్రభుత్వంచే ముందుకు తీసుకొని వెళ్ళబడింది. ఉదాహరణకు 2002 జాతీయ ఆరోగ్య విధానం ఈ విధంగా చెబుతుంది. "ద్వితీయ, తృతీయ రంగాలలో మన దేశ ప్రజలు అనుభవిస్తున్న ఆరోగ్య సౌకర్యాలలో ధరల అనుకూలతను వినియోగించుకొని మన ఆరోగ్య విధానం విదేశాలలోని రోగులకు చెల్లింపులతో కూడుకున్న వైద్య సేవలను ప్రోత్స హిస్తుంది. ఆ విధంగా విదేశీ మారకంతో అందించబడుతున్న సేవలు "ఎగుమతులు"గా పరిగణించబడతాయి. ముఖేష్ అంబానీ, కుమార మంగళం నాయకత్వంలోని ఇంతకు ముందున్న ప్రధానమంత్రి యొక్క "వాణిజ్య, పరిశ్రమల సలహామండలి" చేత తయారు చేయబడిన "ఆరోగ్య భద్రతలో సంస్కరణలు" అనే పత్రంలో ఈ అంశాలను చెప్పారు. కార్పొరేట్ రంగంచే తయారు చేయబడిన సిఫారసుల ఆధారంగా పై విధానం అమలు చేయబడింది.



ప్రభుత్వాసుపత్రిలో కిక్కిరిసిన వార్డు

ముఖ్యంగా ఖర్చుతో కూడుకున్న వైద్య సేవలను భరించగలిగిన భారతీయ జనాభాలో కొద్దిశాతం మంది ప్రజలకు అందించిన ప్రైవేట్ రంగం గత దశాబ్దకాలంగా తన లాభాలను పెంచుకొనేందుకు, ఇతర అవకాశాల కొరకు ఎదురుచూస్తుంది. భారతదేశం కన్నా విదేశాలలో వైద్య ఖర్చులు ఎక్కువగా ఉండడంతో అక్కడి ప్రజలు భారతదేశానికి వచ్చి ప్రైవేట్ రంగంలో వైద్య సేవలను పొందుతున్నారు. ఆ విధంగా విదేశాలలో ఆరోగ్యాన్ని కోరుకునే వారికి భారతదేశం ఒక ప్రధానమైన కేంద్రంగా తయారయింది. వైద్య పర్యటనా పరిశ్రమ సంవత్సరానికి 30 శాతం పెరుగుదలను తాకింది. ఒక తాజా అంచనా ప్రకారం వైద్య పర్యటన 2015 నాటికి 3 బిలియన్ డాలర్లు ఉండగా, 2020 నాటికి 8 బిలియన్ డాలర్లను తాకనున్నది.

వైద్య పర్యటనా పరిశ్రమ కార్పొరేట్లచే నడపబడుతున్న పెద్ద ప్రత్యేకమైన ఆసుపత్రులకు పరిమితమైయున్నది. గడచిన దశాబ్దకాలంలోనే ఆ పరిశ్రమ చాలా ఎక్కువగా పెరిగిపోయింది. వైద్య పర్యటన ద్వారా పెద్ద మొత్తంలో వచ్చిన ఆదాయాన్ని, దిగజారిపోతున్న ప్రజారోగ్య సేవలకు ప్రైవేట్ రంగం వినియోగిస్తుందని ఎవ్వరూ ఊహించలేరు. అంతేకాకుండా ప్రభుత్వాలు ఆరోగ్య భద్రతలో ప్రైవేట్ రంగం వారిని భాగ స్వామ్యం చేయడానికి గాను సబ్సిడీలు, ముఖ్యంగా భూములను ఉచితంగా ఇవ్వడం లాంటి కార్యక్రమానికి ప్రతిఫలంగా రోగులలో కొంత శాతం ఉచితంగా ఇన్‌పేషెంట్స్, అవుట్ పేషెంట్స్‌కు వైద్య సేవలందిస్తామన్న వారి (ప్రైవేట్‌రంగం) మాటను నిలబెట్టుకోలేదు. నేడు ప్రైవేట్ ఆసుపత్రులలో మంచి అనుభవం ఉన్న వైద్యులు అందరూ కూడా ప్రభుత్వ రంగం నుండి వచ్చినవారే. ఆ విధంగా వైద్య పర్యటన అంతర్గతంగా ఆరోగ్య రంగంలో నిష్ణాతులైన వైద్యులను ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్ళేటట్లు ప్రోత్సహిస్తుంది. ఇప్పటికే సరళీకరణ విధానాలు ఆరోగ్య భద్రతను కాపాడే భారతీయ వైద్యులను (దాదాపు 60 శాతం) నగరాలలో నివశించేటట్లు చేశాయి. వైద్య పర్యటన ఆరోగ్య భద్రతను కాపాడే వైద్యులను పెద్ద పెద్ద నగరాలలోని కేంద్రాలకు, ముఖ్యంగా కార్పొరేట్ సంస్థలు నడిపే ప్రత్యేక వైద్య విద్యా సంస్థలకు వెళ్ళేటట్లు చేసింది.

బ్రెటన్‌ఉడ్స్ సంస్థలు ప్రజా సంక్షేమ విధానంపై ప్రభుత్వ ఖర్చును తగ్గించడాన్ని ప్రోత్సహించాయి. దాని ఫలితంగా సరళీకరణ విధానాలు ఇతర సామాజిక అంశాలు అంటే ఆహారం, పౌష్టికాహార భద్రత, వ్యవసాయం మొదలగు రంగాలపై పెట్టుబడులు పెట్టడానికి అనుకూలమైన ప్రభావాన్ని చూపించాయి. అదే విధంగా సేవా రంగంలో భాగంగా ఉన్న విద్యా రంగంలో కూడా అత్యంత ఖర్చుతో కూడుకున్న విద్యను అందించడంలో ప్రైవేట్ రంగం చాలా పెద్ద పాత్రను పోషిస్తుంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వైద్య విద్యా సంస్థలు సందేహాత్మకమైన వైద్యులను తయారుచేస్తున్నాయి. ఫలితంగా ఈ మధ్య కాలంలో ఆరోగ్య భద్రతపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపాయి.

**అనువాదం: బోడపట్ల రవీందర్**

# వ్యవసాయంలో పెట్టుబడిదారీ విధానం

**డా॥ అర్చనా ప్రసాద్**



రచయిత జెఎన్‌టియు ప్రొఫెసర్

వ్యవసాయ రంగంలో బడా కంపెనీలు భారీ పెట్టుబడులతో ఉత్పత్తి ప్రక్రియపై బహుళజాతి కంపెనీలు పట్టు సాధించడానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. ధనం, రాజకీయ వినియోగం అనేక రూపాలు తీసుకోవచ్చు. భూమి కొనుగోలు ద్వారా భూమిపైన, ఉత్పత్తి పైన ప్రత్యక్ష పట్టు సాధించడం మొట్టమొదటిది. వ్యవసాయ సరఫరాల చైన్ గణనీయంగా విస్తరించిన ఆఫ్రికా దేశాల్లో ఇది ఎక్కువగా జరిగింది. ఆ దేశాల్లో పూర్తి యాజమాన్య హక్కు ద్వారా లేదా దీర్ఘకాలిక లీజు ద్వారా కంపెనీలకు భూమిపై పెత్తనం లభించింది. కాంట్రాక్టు వ్యవసాయం/ ఔట్ గ్రోయర్ మోడల్ రెండవ రకం. దీని ద్వారా భూమిపై యాజమాన్యహక్కు లేకపోయినా ఆ భూమిలోని ఉత్పత్తిపై మాత్రం ఆ కంపెనీలే పూర్తి పట్టు సాధించాయి. పరపతి, ఉత్పాదకాల సరఫరా, ధరలు, మార్కెట్ వ్యవహారాలు తదితరాలన్నీ కంపెనీలే నిర్వహిస్తాయి. కాబట్టి రైతు చట్ట రీత్యా భూయజమాని మాత్రమే తప్ప ఉత్పత్తి కార్యకలాపాలన్నీ కంపెనీల కనుసన్నలలోనే జరుగుతాయి.

టెక్నాలజీ, డబ్బు, మార్కెట్‌పై తమకున్న పట్టుతో కార్పొరేట్లు ఒక కొత్త తరహా పెట్టుబడిదారులు – భూస్వాముల్లా ఉద్భవిస్తున్నారు. కాబట్టి గ్రామ సీమల్లో ఉత్పత్తి సంబంధాలను రీస్ట్రక్చర్ (పునర్నిర్మాణం) చేసే అంశాల్లో ద్రవ్య పెట్టుబడి కీలకంగా వుంది.

**వ్యవసాయంలో కార్పొరేట్ భూమి ఒప్పందాలు (అమ్మకాలు) :**

క్రమ పద్ధతిలోగల సమాచారం లేకపోయినా వున్న పరిమిత సమాచారం ఆధారంగా పరిశీలిస్తే దక్షిణార్ధగోళంలో బహుళజాతి సంస్థల పెట్టుబడులు వ్యవసాయ రంగంలో పెరిగాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. ల్యాండ్ మాట్రిక్స్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం గత దశాబ్ద కాలంలో బహుళజాతి కంపెనీల ఒప్పందాలు (కొనుగోళ్ళు) పెరిగాయి. (పట్టిక చూడండి)

వ్యవసాయ భూమికోసం బహుళజాతి సంస్థల పెట్టుబడులు పెరుగుతున్నాయని పై టేబుల్ ద్వారా స్పష్టమవుతున్నది. మౌఖిక లేదా రాతమూలక కాంట్రాక్టు ద్వారా జరిగిన లీజు ఒప్పందాల్లో మూడింట రెండువంతులకు పైగా బహుళజాతి సంస్థలతో జరిగినవే. ఓషియానా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిలిప్పీన్స్ తదితర దేశాలు, లాటిన్ అమెరికా, ఆఫ్రికాలలో ఇది ఎక్కువగా వుంది. ఆసియాలో 50%గా వుంది.

భారత్‌కు సంబంధించిన 77 దేశీయ, బహుళజాతి ఒప్పందాలలో అత్యధికం మైనింగ్‌కి సంబంధించినవే కావడం గమనార్హం. ఇందులో ఏడు మాత్రమే వ్యవసాయానికి సంబంధించినవి కాగా వాటిలో ఐదు బహుళజాతి కంపెనీలవే. దేశీయ ఒప్పందాల్లో కూడా అన్నీ సెకండరీ ఇన్వెస్టర్స్ (పెట్టుబడి పెట్టేవి) బహుళజాతి కంపెనీలవే. వాటిలో బ్రిటన్‌కు చెందిన నందన్ బయోటెక్ ప్రధానమైనది. భారత్‌లో వ్యవసాయ భూమి మైనింగ్ కోసం విస్తారంగా మళ్ళించబడుతోంది.

ఆఫ్రికాలో వ్యవసాయం కోసం భూమిపై పెట్టుబడులు పెడుతున్న మొదటి ఐదు దేశాల్లో భారత్ ఒకటి కావడం గమనించవలసిన ముఖ్యాంశం.

ఆయా కంపెనీలు పెడుతున్న పెట్టుబడులు స్వభావాన్ని పరిశీలించడం అవసరం. (ఈ విషయంలో పరిమితమైన సమాచారం కేవలం ల్యాండ్ మెట్రిక్స్‌లోనే లభిస్తోంది) ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఆహారేతర పంటలు (ఎగుమతి ఆధారిత వ్యవసాయం, ఫ్లెక్సిబుల్ పంటలు) బహుళ ప్రయోజన పంటలు (మొక్కజొన్న, చెరకు మొదలైనవి) ఎక్కువగా వున్నాయి. పెట్టుబడులలోనూ, పంటల సరళిలోనూ మార్పుల మూలంగా రైతాంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది. బహుళ ప్రయోజన పంటలతో వ్యవసాయ రంగంలో డబ్బు పాత్ర పెరిగింది. దాంతో రైతు రుణభారం పెరిగిందని ఆఫ్రికా దేశాల వ్యవసాయంపై చేసిన అనేక అధ్యయనాలు నిర్ధారించాయి. అంతేగాక రైతాంగం ఈ పంటలనుండి వేరే వాటికి మారడానికి కూడా

**ప్రాంతాలవారీగా వ్యవసాయంలో భూమి ఒప్పందాలు (కొనుగోళ్ళు)కోసం పెట్టుబడులు :**

| ప్రాంతం | అన్ని ఒప్పందాల్లో విస్తీర్ణం | మొత్తంఒప్పందాల్లో శాతం | | ముగిసిన ఒప్పందాల్లో శాతం | | జరిగి ముగించవలసిన ఒప్పందాలు | |
|---|---|---|---|---|---|---|---|
| | మొత్తం | బహుళజాతి | దేశీయ | బహుళజాతి | దేశీయ | బహుళజాతి | దేశీయ |
| ఆఫ్రికా | 32681344 | 87.43 | 12.57 | 83.98 | 16.02 | 93.28 | 6.72 |
| అమెరికా | 7873645 | 70.38 | 29.62 | 69.56 | 30.45 | 100.00 | 0.00 |
| ఆసియా | 13786451 | 70.99 | 29.01 | 60.24 | 39.76 | 92.10 | 7.90 |
| యూరోప్ | 10406704 | 58.58 | 41.42 | 58.34 | 41.66 | 100.00 | 0.00 |
| ఓషియానా | 2518516 | 93.04 | 6.96 | 93.04 | 6.96 | 0.00 | 0.00 |
| మొత్తం | 67266660 | 77.81 | 22.19 | 72.63 | 27.37 | 93.07 | 6.93 |

గణన : 31.జులై 2016 www.landmatrix.org వెబ్‌సైట్ నుండి సేకరించిన వివరాల ప్రకారం

వీలు కావడంలేదని ఆఫ్రికా వ్యవసాయ అధ్యయనాలు స్పష్టం చేశాయి. రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోవడాన్ని కూడా ధ్రువపరిచాయి.

**ఔట్ గ్రోయర్ మోడల్ :**

కార్పొరేట్ కంపెనీలు కాంట్రాక్టు వ్యవసాయం/ ఔట్ గ్రోయర్ విధానాలను అనుసరిస్తున్నాయి. దానివల్ల భూమిపై ప్రత్యక్ష పట్టు లేకపోయినా ఉత్పాదకాల మొదలు మార్కెటింగ్ వరకు అన్ని దశల్లోనూ బహుళజాతి కంపెనీల పెత్తనమే ఉంటుంది. ఈ అంశంపై అనేక కేస్ స్టడీస్ ఉన్నాయి.

ఐటిసి కంపెనీ మధ్యప్రదేశ్‌లో చేపట్టిన ఈ చౌపల్ ప్రాజెక్టు బహుశా మొదటి వెంచర్ అయి వుండవచ్చు. సోయాబిన్ సేద్యంలో సన్న, చిన్నకారు రైతులను సంఘటితంజేయడంలో ఐటిసి కంపెనీకి సహాయపడిన పెద్ద, ధనిక రైతులే ఇందులో భాగస్వాములు. ఇలాంటి పెద్ద రైతులను అన్ని ప్రాంతల్లోనూ ఐటిసి సమీకరించి వారితో ఆధునిక వ్యవసాయ పద్ధతులను మొదట ఉపయోగించి మిగిలిన రైతులను ప్రభావితం చేస్తారు. దీనివలన ఆ పెద్ద రైతులు ఐటిసికి ట్రాన్సాక్షన్ (నిర్వహణ) ఖర్చులు మిగిలిస్తారు. ప్రతి ఆధునిక/ పెద్ద రైతు 15-20 మంది రైతుల వ్యవసాయ ఉత్పత్తిని పర్యవేక్షిస్తూ వారికి సాంకేతిక సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందజేస్తారు. అంటే ప్రయోగాలు చేయడానికి, రిస్క్ తీసుకోవడానికి సిద్ధపడే పెద్ద రైతులు కార్పొరేట్ కంపెనీలతో మిలాఖత్ అవుతారు. సన్న,చిన్నకారు రైతులకు, పెట్టుబడికి వారు మధ్యవర్తులన్నమాట. ప్రత్తి వ్యవసాయంలో 90% ఉత్పత్తిని, 6 కోట్లమంది రైతులు వాడే ఉత్పాదకాలను మోన్సాంటో కంపెనీ నియంత్రిస్తున్నదని తాజా గణాంకాలు వెల్లడించాయి.

ఔట్ గ్రోయర్ పద్ధతిలో రైతులను గ్రూపులుగా ఏర్పాటుచేసి ఉత్పత్తి సాగిస్తారు. ఔట్‌గ్రోయర్ పద్ధతికి బయట ఉన్న రైతులు తమ ఉత్పత్తులు అమ్ముకోవడానికిగానీ, వ్యవసాయానికవసరమైన రుణాలకోసంగానీ, సాంకేతిక పరిజ్ఞానంకోసంగానీ కార్పొరేట్ కంపెనీలపై ఆధారపడవలసి వస్తోందని ఓక్‌లాండ్ ఇనిస్టిట్యూట్ (2015) అధ్యయనం నిర్ధారించింది.

వ్యవసాయ రంగంలో ఎగుమతి ఆధారిత వ్యవసాయ విధానం, బహుళజాతి సంస్థలపై ఆధారపడే పరిస్థితి, భూమిపై కార్పొరేట్ల పట్టు పెరుగుతోంది. భారతదేశ పరిస్తితుల్లో త్వరితిగతిన వ్యవసాయ రంగంలో వస్తున్న ఈ మార్పులను కార్యకర్తలు, మేధావులు నిర్దిష్టంగా అధ్యయనం చేసి కీలకమైన వాటిని గుర్తించాలి.

ఒక అంశంపై సరియైన అవగాహనకు రావడం ప్రతిఘటనకు సంబంధించిన మొట్ట మొదటి అడుగు అన్న విషయం మరువరాదు. గ్రామీణ భారతంలో వస్తున్న మార్పులను అవగాహన చేసుకోవాలి. నానాటికి మన రైతాంగం సెమీ ప్రొలిటేరియనైజేషన్ (సొంత ఆస్తి కోల్పోతూ శ్రమ మాత్రమే చేయగలవారు) అవుతున్నారు.

**స్వేచ్ఛానువాదం : బి.తులసీదాస్**

# కేంద్రీకృత ప్రజాస్వామ్యం

(14వ పేజీ తరువాయి)

ట్టయితే పార్టీ శ్రేణులలో విశ్వాసం కోల్పోతారు. అసంతృప్తులు మొదలవుతాయి. అనైక్యతకు దారితీయవచ్చు. ముఖ్యంగా క్షేత్రస్థాయి పరిస్థి తులు గాని, ప్రజలు, పార్టీ శ్రేణుల స్పందనలు గాని తెలుసుకునేందుకు ఇదొక మంచి అవ కాశం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. కొన్ని సందర్భాలలో కిందిస్థాయి కార్యకర్తల అభిప్రాయాలను తృణీకరించడం గమనిస్తాము. విమర్శల పట్ల ఆగ్రహం ప్రదర్శించడం కూడా జరుగుతుం టుంది. ఓపికగా వివరించే బదులు ఇది నిర్ణయమనీ, అమలు జరపాలని దబాయించడం చూస్తుంటాము. ఇది నాయకుల బలహీనత తప్ప బలం కాదు.

5) సమిష్టి నిర్ణయాలు, వ్యక్తిగత బాధ్యత, తనిఖీ అనే సూత్రాల ఆధారంగా అన్ని స్థాయి ల్లోనూ కమిటీలు, శాఖలు పని చేయాలి. దీనిని మరో సందర్భంలో వివరంగా చూడవచ్చు.

6) అంతర్జాతీయ, జాతీయ పరిస్థితుల విషయంలో గానీ, ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్రాలతో ముడివడి ఉన్న విషయాల్లో గానీ కేంద్ర కమిటీయే నిర్ణయం చేస్తుంది. వివిధ రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఇలాంటివే. హైదరాబాద్ శాంతి భద్రతల విషయంలో గవర్నర్ అధికారాల గురించి తలెత్తిన వివాదం రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యగా మారటం కూడా మనం గమనించాము. కాశ్మీర్ సమస్య కూడా ఆ రాష్ట్రానికి మాత్రమే సంబంధించినదిగా పరిగణించలేము. దాని ప్రభావం దేశ సమగ్రత, సమైక్యతల మీద పడుతుంది. అంతర్జాతీయంగా కూడా దాని ప్రభావం ఉంటుంది. ఇలాంటి సందర్భాలలో సహజంగానే కేంద్రకమిటీ జోక్యం చేసుకుని తగు నిర్ణయాలు చేయవలసి ఉంటుంది. అన్ని స్థాయిల్లోనూ పార్టీ శ్రేణులు ఇలాంటి నిర్ణయాలకు ముందు తమ అభిప్రాయాలు తెలియజేసే హక్కు ఉంటుంది. ఏదైనా ఒక రాష్ట్రానికి సంబంధించిన విషయం మీద కేంద్రకమిటీ నిర్ణయం తీసుకోవలసి వస్తే ముందుగా సంబంధిత రాష్ట్ర కమిటీని సంప్రదించాలి. తర్వాత మాత్రమే కేంద్రకమిటీ నిర్ణయం తీసుకోవాలి. కింది కమిటీలు చేసే నిర్ణయాలు పైకమిటీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉండకూడదు. అఖిలభారత స్థాయిలో పార్టీ విధానానికి సంబంధించిన విషయాలమీద పార్టీ దృక్పథాన్ని మొట్టమొదటిసారిగా వెల్లిడించాల్సిన సందర్భాలలో అట్లా ప్రకటించే హక్కు కేంద్ర నాయకత్వానికి మాత్రమే ఉంటుంది. కేంద్ర నాయకత్వం పరిశీలన కోసం దిగువ కమిటీలు, వ్యక్తులు సకాలంలో తమ అభిప్రాయాలు సూచనలు పంపవచ్చు. ❋

## 'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,** 'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక,
ప్రజాశక్తి ప్రెస్,గవర్నరుపేట, విజయవాడ-2

# మహిళలు సోషలిజం కోసం పోరాటం

అలెన్ ఉడ్స్



రచయిత ఇండియానా యూనివర్శిటీలో తత్వశాస్త్ర ప్రొఫెసర్

సమాజంలోని అన్ని రకాల అణచివేతకు, హింసకు మూలం భిన్నవర్గాలుగా సమాజం విభజింపబడటమే కారణంగా మార్క్సిస్టులు పరిగణిస్తారు. అణగద్రొక్కడమనేది భిన్న రూపాల లో ఉంటుంది. వర్గ అణచివేతతోపాటుగా, ఒక దేశం మరో దేశంపై, ఓ జాతి మరో జాతిపై, స్త్రీలపై... ఇలా పలు రకాలుగా అణచివేత, హింస మానవ సమాజంలో పాతుకొని పోయి ఉంది.

మహిళలపై వివక్ష ఏ రూపంలో ఎదురైనా, అణచివేతకు వ్యతిరేకంగా దాస్య విమోచన కోసం మార్క్సిస్టులు పోరాటం చేయవలసి ఉంది. సమాజంలో విప్లవాత్మకమైన మార్పు రావాలంటే వర్గ బానిసత్వం నుండి విమోచనకు అనుగుణమైన పరిస్థితులను కల్పించాలి. బానిసత్వాన్ని నిర్మూలించే క్రమంలో, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం ప్రాతిపదికగా నిజమైన మానవ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలి.

మహిళలపై అణచివేత మొదటి నుండి లేదు. ప్రస్తుత సమాజంలోని కుటుంబ వ్యవస్థ రూపం, గతంలో ఈ విధంగా లేదు. వర్గ సమాజం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యం ప్రాతిపదికగా ప్రస్తుత వ్యవస్థ అభివృద్ధి చెందినట్లుగా మార్క్సిజం తెలియజేస్తుంది. సమాజం వర్గ ప్రాతిపదికగా విడిపోయి ఎంత కాలమయ్యిందో, స్త్రీలపై అణచివేత ఆరంభమై కూడా అంతే కాలమైంది. వర్గ రహిత సమాజం ఏర్పడినప్పుడు మాత్రమే స్త్రీలపై అణచివేతను నిర్మూలించడమనేదిసాధ్యం. అది సోషలిస్టు విప్లవం ద్వారా సాధ్యమవుతుంది.

శ్రామికవర్గం అధికారంలోకి రాగానే స్త్రీల పై అణచివేత తగ్గుతుందని, అదృశ్యమౌతుందని కాదు. స్త్రీ, పురుషుల మధ్య, సమానత్వంతో కూడిన, సిసలైన మానవ సంబంధాలు ఏర్పరచ గలిగే సామాజిక పరిస్థితులుంటేనే అనాదిగా వస్తున్న మొరటైన మానసిక వారసత్వం నశిస్తుంది. శ్రామికవర్గం పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోసి, వర్గరహిత సమాజాన్ని సాధించ గలిగితేనే స్త్రీల దాస్య విమోచన సాధ్యం అవుతుంది.

పురుషాధిక్యత, వివక్ష, అవమానాలు భరిస్తూ సోషలిస్టు సమాజం వచ్చేవరకూ సమస్యలను సహించాలని స్త్రీ జాతికి చెప్పలేం. వర్తమాన సమాజంలో నిత్యం ఎదురయ్యే సమస్యలపై పోరాటం చేయకుంటే, సమానత్వం దిశగా విప్లవాన్ని ఊహించలేం. చిన్న చిన్న అంశాలలో మార్పు కోసం నిరంతరం పోరాడితేనే, చారిత్రక ఘటనలు సాధ్యమవుతాయి. పోరాట ఫలితంగా లభించే అధికారం, విజయం చిన్నవైనప్పటికీ, క్రమేణా విస్తరిస్తాయి.

అనేకమంది యువతులు తాము నివసిస్తున్న సమాజంలోని అసమానతలను గుర్తించి మహిళా హక్కుల పోరాటం వైపు అడుగులు వేశారు. నిస్సంకోచంగా, నిర్దయగా స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను గ్రహించడమేగాక, ప్రజాస్వామ్య పద్ధతిలో, న్యాయం కోసం పోరాడటానికి ప్రేరణ పొందుతారు. వివక్ష, అణచివేత, అసమానత్వం ఏ రూపంలో ఉన్నప్పటికీ ఎదుర్కోవడానికి సిద్ధపడతారు.

### విప్లవం ఆవశ్యకత

సమాజంలోనూ, పనిచేసే ప్రాంతం లోనూ ఉన్న వివక్షపై పోరాటం చేయడానికి ఇప్పటికిప్పుడే ఎన్నో డిమాండ్లున్నాయి. సమాన పనికి, సమాన వేతనం, అబార్షన్ హక్కు, విడాకుల హక్కు, ఒంటరి తల్లుల పట్ల చూపే వివక్ష, పురుషుల నుండి ఎదురయ్యే హింస, లైంగిక వేధింపులు, అత్యాచారం, గృహహింస, ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఉద్యోగం, పిల్లల సంరక్షణ కోసం ఉన్నతస్థాయి వసతులు మొదలగునవి.


ఇవన్నీ ఖచ్చితంగా అవసరం. పెట్టుబడిదారులు, బ్యాంకర్ల, ఆధిపత్యంలో ఉన్న సమాజంలో, స్త్రీల దాస్య విమోచన పూర్తిగా సాధ్యం కాదు. స్త్రీలపై అణచివేతకు ముగింపు పలకాలంటే, వర్గ దోపిడీకి స్వస్తి పలకాలి. అంటే స్త్రీల అణచివేతపై జరిగే పోరాటం, సోషలిజం కోసం జరిగే పోరాటానికి అత్యంత సహజసిద్ధంగా అనుసంధానమై ఉంది.

సోషలిస్టు విప్లవం తీసుకువచ్చే క్రమంలో, ప్రపంచంలోని శ్రామికవర్గమంతా తమ సంస్థలతో పాటుగా భాష, ప్రాంత, మత, జాతి, లింగ భేదాలకతీతంగా ఐక్యమై పని చెయ్యాల్సి ఉంటుంది. మరోవిధంగా చెప్పాలంటే భిన్న రూపాల్లో ఉన్న అణచివేతను, వివక్షను ఎదుర్కొనే క్రమంలో శ్రామికవర్గం, వివిధ స్థాయిల్లో, సమాజంలో ఎదురయ్యే అనేకానేక అణచివేతలను, పోరాటాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులను సైతం ఎదుర్కోవలసి ఉంటుంది. అణచివేతకు గురవుతున్న భిన్న వర్గాలకు నాయకత్వం వహిస్తూ పోరాటం కొనసాగించాలి.

బూర్జువాలు, బూర్జువా ముసుగు వేసుకున్న జాతీయవాదులు, జాతీయ భావనల ఆధారంగా శ్రామికవర్గాన్ని విడదీయడానికి హానికరమైన పాత్ర వహిస్తున్నారు. సుదీర్ఘకాలంగా అణచివేతకు, వివక్షకు లోనవుతున్న వారి ఆగ్రహాల ఆధారంగా, హింసాత్మక జాతీయతని తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. లెనిన్, రష్యన్ మార్క్సిస్టులు ఈ విధానంపై ఓవైపు, మరోవైపు తమ స్వార్థ ప్రయోజనాలకై వ్యవహరిస్తున్న వారిపై అలుపెరుగని పోరాటం చేశారు. పెట్టుబడిదారీ విధానానికి, భూస్వామ్య విధానానికి వ్యతిరేకంగా, జాతీయత కతీతంగా, శ్రామిక వర్గం ఏకమై పోరాటం చేయడమే సోషలిస్టు ఫెడరేషన్ ఏర్పడడానికి మార్గమని స్పష్టం చేశారు.

మరోవిధంగా చెప్పాలంటే, శ్రామికవర్గ ఆలోచనా దిశలోనే మార్క్సిస్టు దృక్పథం ఉంది. మహిళలపై అణచివేత, హింస విషయంలో సైతం మార్క్సిస్టు దృష్టికోణం ఇదే. వివక్షను, అణచివేతను ఎదుర్కొనే క్రమంలో సమస్య ఏదైనా వర్గ దృష్టితోగాక, స్త్రీ, పురుషుల సంఘర్షణగా పరిగణించటాన్ని తిరస్కరించాలి. శ్రామికుల మధ్య విభజనైనా, మహిళలకు వ్యతిరేకంగా పురుషులైనా, నల్ల జాతివారిపై శ్వేత జాతీయుల వివక్ష అయినా, ప్రొటెస్టెంట్లపై క్యాథలిక్‌లైనా, షియాలపై సున్నీలైనా శాశ్వతమైన వర్గ

> **"ఫ్రెంచ్, రష్యన్ విప్లవాలలో మహిళలు పోషించిన ప్రముఖపాత్రకు సరైన గుర్తింపు రాలేదు. మధ్య తరగతి, విద్యాధికులైన స్త్రీ వాదుల పాత్ర గురించి కాదు మనం చర్చించేది. విప్లవ సమయంలో పనిచేసిన సామాన్య మహిళలు, శ్రామిక వర్గ స్త్రీల పాత్ర గురించి, తమపై జరుగుతున్న అణచివేతను వారు ప్రతిఘటించిన విధానం గురించి చర్చిస్తున్నాం."**



కోట ముట్టడిలో పాల్గొన్న ఫ్రెంచ్ మహిళలు

బానిసత్వాన్ని నిర్మూలించే క్రమంలో వివక్ష శ్రామికవర్గ ప్రయోజనాల హాని కలిగిస్తుంది.

### మహిళలు – విప్లవం

ఉద్యమ చరిత్రను సమగ్రంగా పరిశీలించినప్పుడు, మహిళలలో అణచివేతకు గురవుతున్న వారి కోసం విప్లవాత్మక మార్పుల కోసం ఉద్యమించేవారికి, మహిళల అణచివేతను ప్రశ్నిస్తూ తమ వ్యక్తిగత స్వార్థం కోసం పనిచేస్తున్న మహిళలకు మధ్య సుస్పష్టమైన వ్యత్యాసముంది. ప్రతి పోరాటంలోనూ ఈ భేదం అడుగడుగునా కన్పిస్తుంది. ఈ కోణంలో రెండు ఉదాహరణలు పరిశీలిద్దాం.

17వ శతాబ్దారంభంలో రాజకీయ, సామాజిక విమోచన కోసం డిమాండ్లతో మహిళలు ముందుకొచ్చారు. నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, సమాన హక్కుల కోసం ఇంగ్లీషు విప్లవంలో అధికశాతం మహిళలు ఉద్యమించారు. 1649లో లండన్ నగరంలోని మహిళలు "మా యొక్క సృష్టి, భగవంతుని ప్రతిరూపంగా, పురుషులకు సమానంగా జరిగిందని నమ్మాం. స్వేచ్ఛ, ప్రజా ప్రభుత్వంలో మాకు సమానమైన భాగముందని విశ్వసించాం. కానీ మీ దృష్టిలో మేము దుఃఖ భాజితులుగా, తుచ్ఛమైన వారిగా గోచరిస్తున్నాం. అందువలన, గౌరవనీయమైన సభకు మా సమస్యలను విన్నవించడం అవసరమని భావిస్తున్నాం". అని విజ్ఞాపన పత్రంలో పేర్కొన్నారు.

ఈ దేశంలోని పురుషులతో పాటుగా, మాకు సమానత్వం లేదా? భూ హక్కులపైనా, చట్టబద్ధమైన హక్కులపైనా మాకు స్వేచ్ఛ, అధికారం, స్వాతంత్ర్యం లేదా? (జె.ఒ. ఫావోలైనన్ మరియు డబ్ల్యు. మార్టిన్స్).

విప్లవాత్మక సంఘాలలోనూ, మతానికి సంబంధించిన తెగల్లోనూ, మార్పుకోసం, మంత్రిత్వశాఖల్లో స్థానం కోసం, మత ప్రచారకులుగా వ్యవహరించడం కోసం గణనీయమైన పోరాటాలను చేశారు. ఉదా:– మేరీ క్లారీ "ఫిఫ్త్ మోనార్క్"తో అనుబంధమై ఉద్యమించింది.

### ఫ్రెంచ్ విప్లవంలో మహిళలు

ఫ్రెంచ్ విప్లవ సమయానికి పరిస్థితులు మారాయి. వర్గ సంబంధాలలో స్పష్టత, పదును రావడమే గాక సద్వివేకం సైతం కలిగింది. విప్లవం ఇంకెంత మాత్రం బైబిల్ ముసుగులో ఉండాల్సిన అవసరం లేకుండాపోయింది. అందుకు బదులుగా తర్కబద్ధమైన కారణాలతో, పురుషుల హక్కుల పట్ల అవగాహనతో ముందు కొచ్చింది. మరి మహిళల హక్కుల సంగతేంటి?

వర్గ దృక్పథం కోణంలోనే ఫ్రెంచ్ విప్లవాన్ని అర్థం చేసుకోగలం. వేరు వేరు పార్టీలు, సంఘాలు, ఆలోచనలు, దృక్పథాలు, వ్యక్తులు, అన్నీ కూడా కలగలిసి, సముద్రంలోని ఉధృత అలల్లాగా ఎగసిపడ్డాయి. ఆనాటి పరిస్థితులకు, పరిణామాలకు అనుగుణంగా వర్గ పోరాటం రూపుదిద్దుకుంది. ఉద్యమంలో సహజ లక్షణం, ప్రతి పోరాటం ఓ నూతన పంథాను ఏర్పరుచుకొని అలసిపోయే వరకు ఆగకుండా కొనసాగుతుంది. క్రమంగా వ్యతిరేక పవనాల కనుగుణంగా ముగుస్తుంది. ఇది బూర్జువా విప్లవాలకు తప్పనిసరి ముగింపు. ప్రజా సమూహాల నుండి ఉద్భవించిన వ్యవస్థాపకుల భ్రమలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య ఖచ్చితమైన విరుద్ధత స్పష్టమౌతుంది.

విప్లవోద్యమంలో ఆదినుండి వర్గ విభజన భాగంగానే ఉంది. బూర్జువావర్గ ప్రతినిధులుగా ఉన్న గిరోండియన్లు ఉద్యమాన్ని మధ్యలో ఆపి, చట్టబద్ధ రాజరికాన్ని ఏర్పరచడం కోసం రాజుతో ఒప్పందం చేసుకున్నారు. విప్లవానికిది ఆత్మహత్యా సదృశ్యం. ప్రతీఘాతకులతో తమ సమస్యలను పరిష్కరించుకోవటానికి ఉధృతంగా ఎగిసిన విప్లవంలోకి సామాన్యులు ఉవ్వెత్తుగా రావటంతో విప్లవానికి ఆ తీవ్రత వచ్చింది.

ఉధృతంగా ఎగసిన ప్రజలు ఫ్రెంచ్ విప్లవాన్ని విజయవంతం చేసి, పాతవ్యవస్థను విచ్ఛిన్నం చేయటాన్ని క్రోపాట్కిన్ తన పుస్తకంలో చక్కగా వివరించాడు.

ఫ్రెంచ్, రష్యన్ విప్లవాలలో మహిళలు పోషించిన ప్రముఖపాత్రకు సరైన గుర్తింపు రాలేదు. మధ్య తరగతి, విద్యాధికులైన స్త్రీ వాదుల పాత్ర గురించి కాదు మనం చర్చించేది. విప్లవ సమయంలో పనిచేసిన సామాన్య మహిళలు, శ్రామిక వర్గ స్త్రీల పాత్ర గురించి, తమపై జరుగుతున్న అణచివేతను వారు ప్రతిఘటించిన విధానం గురించి చర్చిస్తున్నాం. 1789వ సంవత్సరంలో పారిస్‌లో, ఫ్రెంచి విప్లవం సమయంలో శ్రామిక మహిళలు, సామాన్య మహిళలు తొలుతగా గళమెత్తింది తమ ఆహారావసరాల గురించి తప్ప, మహిళలపై జరుగుతున్న అణచివేత, హింసలపై కాదు. క్రమంగా రెండు అంశాలు విప్లవోద్యమంలో భాగమయ్యాయి.

ప్రముఖ సమాజాలలో సైతం "ఓటు" హక్కు నుండి మహిళలు దూరం చేయబడ్డారు. ఓటు హక్కు సాధన కోసం స్త్రీలు పోరాటపథంలో అడుగిడి తిరగబడ్డారు. ముఖ్యంగా 1789వ

సంవత్సరం అక్టోబర్ నుండి, 1792వ సంవత్సరం ఆగస్టు 10 వరకూ, తిరిగి 1795వ సంవత్సరం వరకూ, (వీటినే ఆనాటి సంవత్సరాల పేరిట జెర్మినల్ మరియా ప్లెరియల్‌గా నామకరణం చేసి 1792లో విప్లవ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు) ఎంతో విప్లవాత్మక వనితలుగా పేర్గాంచిన వారు సైతం ఓటు కోసం గట్టిగా డిమాండ్ చేయలేదు. 18వ శతాబ్దంలో మగవారిని సమాజ పరిధిలోను, స్త్రీలు వ్యక్తిగత పరిధిలోనూ ఉండేవారిగా పరిగణించేవారు. మహిళలకు సంబంధించి కొన్ని సొసైటీలను ఏర్పరిచారు. అందులో ప్రధానమైనది "సొసైటీ ఫర్ రెవల్యూషనరీ రిపబ్లికన్ సిటిజన్స్". కానీ ఈ సొసైటి కేవలం 1793వ సంవత్సరం మే నుండి అక్టోబర్ వరకు మాత్రమే పనిచేయగలిగింది. ప్రముఖ చిత్రకారులు "డొమ్నిక్ గోడిన్యూ", డార్లిన్ లెవీ" ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ, "దీని అర్థం రాజకీయ, ఆర్థిక కార్యక్రమాలలో స్త్రీలు పాల్గొనలేదని కాదు. స్త్రీలు ఉత్సాహంగా పాల్గొనేవారు. కానీ పురుషులను ప్రోత్సహిస్తూ గ్యాలరీలలో కూర్చొని ఉత్సాహపరిచేవారు. ఆహారశాలల నుండి, మార్కెట్ స్థలాల నుండి రోడ్లపైకి వచ్చి తమదైన శైలిలో మాత్రమే పాల్గొనేవారు. (ది ఫ్రెంచ్ రివల్యూషన్, 1787-1799 మరియు ది పీపుల్స్ అండ్ ది ఫ్రెంచ్ రివల్యూషన్ - ప్రొఫెసర్ గ్విన్ లూయిస్)

దీర్ఘకాలంగా ఉన్న అసంతృప్తులను, పైకి వెల్లడించలేని మానసిక భావాలను, ముఖ్యంగా అణగారిన వర్గాల ప్రజల కడగండ్ల దుస్థితిని విప్లవోద్యమ సమయం వెలికి తీస్తుంది. మహిళలపై అణచివేత అనే డిమాండ్, అంత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ డిమాండ్ వర్గ ప్రాధాన్యతలు, అసక్తులపై ఆధారపడి భిన్న రూపాలను సంతరించుకుంది. పారిస్‌లోని పేద, మధ్య తరగతి శ్రామిక మహిళలు విప్లవపంథాను ఆశ్రయించడంలో ఆశ్చర్యం లేదు. సమాజంలో తీవ్రమైన అణచివేతకు గురైన వారు, సమాజంలోని హింసను బలవంతంగా భరించడం అలవాటైన వారు, రాజకీయ పోరాటాలతో, సంఘాలతో ఎలాంటి పరిచయం, అనుబంధం లేనివారు ఎటువంటి భావజాలానికి లోనుకాకుండా స్వచ్ఛందంగా పోరాటంలోకి వచ్చారు. పురుషులు వీరికి పూర్తిగా భిన్నమైన నేపథ్యంతో వచ్చారు. ఈ వ్యత్యాసం అనేక కాలాల్లో, సందర్భాలలో తటస్థపడేదే. మగవారికన్నా మరింత దూకుడుగా, ధైర్యంగా, ఉత్సాహంగా మహిళలు సమ్మెల్లో పాల్గొనడం చాలా సందర్భాలలో నిరూపితమైంది. వర్గ సంబంధ విషయాలలో ఇదే జరిగింది. ఎప్పుడైతే నిత్యావసరాల ప్రశ్న తలెత్తిందో మహిళల్లో అధిక శాతం స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. "పెట్రోగ్రాడ్"లో వంద సంవత్సరాల తర్వాత మరోసారి ఇదే ఋజువైంది.

"మగవారికన్నా మరింత దూకుడుగా, ధైర్యంగా, ఉత్సాహంగా మహిళలు సమ్మెల్లో పాల్గొనడం చాలా సందర్భాలలో నిరూపితమైంది. వర్గ సంబంధ విషయాలలో ఇదే జరిగింది. ఎప్పుడైతే నిత్యావసరాల ప్రశ్న తలెత్తిందో మహిళల్లో అధిక శాతం స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. 'పెట్రోగ్రాడ్'లో వంద సంవత్సరాల తర్వాత మరోసారి ఇదే ఋజువైంది."

ఫ్రెంచ్ విప్లవం ముఖ్య ఘట్టాలన్నింటిలో, మరీ ముఖ్యంగా తొలినాళ్ళలో అట్టడుగువర్గాలను శ్రామిక మహిళలే ముందుకు నడిపారు. 1789వ సంవత్సరంలో అసెంబ్లీలోని గౌరవనీయ పురుష నాయకులు సమాజంలోనూ, చట్టాలలోనూ తీసుకురావాల్సిన మార్పుల గురించి సుదీర్ఘంగా చర్చిస్తూ ఉపన్యసిస్తున్న సమయంలో, పారిస్ నగరంలోని పేద మహిళలు, చేపలనమ్ముకొనే స్త్రీలు, చాకలి వనితలు, దుకాణాల్లో పనిచేసే యువకులు, పనివాళ్ళు, శ్రామికుల భార్యలు స్వచ్ఛందంగా, అనూహ్యంగా ఉద్యమ భాగస్వాములయ్యారు. ఈ మహిళలంతా లోదుస్తులు లేకుండా పారిస్ టౌన్‌హాల్ వరకూ "తక్కువ ధరకు బ్రెడ్" కావాలని ప్రదర్శన నిర్వహించి, పురుషులు అవమానపడేటట్లు చేశారు. అంతేగాక పురుషులంతా అనివార్యంగా "వెర్సైల్స్" వెళ్ళి రాజును, రాణిని గృహ నిర్బంధం నుండి బయటకు తీసుకువచ్చేలా చేశారు. "జార్జిరూడ్ ఈ సంఘటనను ఇలా వర్ణించాడు.

"ఈ సమయానికి మహిళలంతా చేతులు కలపడం ఆరంభించారు. ఆహార (బ్రెడ్) సమస్య పూర్తిగా వారికి సంబంధించిన విషయం. అందువలన ఇప్పటి నుండి ఉద్యమంలో వీరిదే అగ్రస్థానం. హోర్టీ అధికారిక రికార్డ్ ప్రకారం సెప్టెంబర్ 16న మహిళలంతా కలిసి ఐదు బండ్ల ఆహార ధాన్యాలను ఛైలెట్ వద్ద ఆపి, వాటిని పారిస్‌లోని "హోటల్ డివిల్లె"కు తెచ్చారు. 17వ తారీఖు మధ్యాహ్నానికల్లా హోటల్ డివిల్లెను కోపోద్రిక్తులైన మహిళలంతా చుట్టుముట్టారు. బెయిలీ, మున్సిపల్ కౌన్సిల్‌లోని వంటవాళ్ళ (బేకర్స్) ప్రవర్తనపై వారు ఫిర్యాదు చేశారు. పురుషులు సమస్యలను అర్థంచేసుకోలేరని, అందువలన సమస్యలను తాముగానే పరిష్కరించుకుంటామని వారు ప్రకటించారు. ఆ మర్నాడు కూడా హోటల్ డివిల్లెను ముట్టడించారు. వారికి

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, 'మార్క్సిస్టు'** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

> **"పారిస్‌లోని శ్రామిక మహిళలు తమ సమస్యలపట్ల ఎలా పోరాటం చేశారో ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతుంది. మగజాతి నిష్క్రియ పట్ల అసహనం, అసంతృప్తి పెల్లుబుకి తామే ముందుండి తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. ఇది పురుషుల పట్ల స్త్రీల వ్యతిరేకతగా, పోరాటంగా చూడగలమా?"**



పతాకంతో పోరాటంలో పాల్గొన్న మహిళ

కొన్ని వాగ్దానాలు చేశారు. ఆ రోజు సాయంత్రం బండి నిండుగా ఆహార ధాన్యాలను "డెస్ ట్రాయిస్ మెరీన్" అనే ప్రాంతం నుండి స్థానిక జిల్లా ప్రధాన కేంద్రానికి తరలించడం హార్టీ స్వయానా చూశాడు. అక్టోబర్ 5 రాజకీయ ఉద్యమం తర్వాత కూడా ఇది కొనసాగింది.

### మరలా ఆరంభం

హోటల్ డివిల్లెలో జరిగిన ఈ సంఘటన ప్రధాన లక్ష్యం "ఆహారం" (బ్రెడ్) కాగా, తర్వాత తమ పురుషుల కోసం ఆయుధాలు, మందుగుండు సామాగ్రి సేకరణ దిశగా ఉద్యమం ఉపందుకుంది. బజారులో వెళుతున్న వ్యక్తులు అపరిచితులైనా వారిని ఆపి, తమతో టౌన్‌హాల్‌కు వచ్చి కొంత బ్రెడ్ తీసుకోవలసిందిగా వారు కోరుతున్నారు. అక్కడున్న రక్షక భటుల చేతుల్లో ఆయుధాలు లేవు. కారణం వారి ఆయుధాలు ఆ మహిళల భర్తల చేతుల్లోకి మారాయి. హోటల్ డి-విల్లెలోని క్యాషియర్ కూడా జరుగుతున్న సంఘటనలకు సాక్షిగా ఉన్నాడు. ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయంలో భారీ సంఖ్యలో మహిళలు, కొద్దిమంది పురుషులు హోటల్‌లో ప్రవేశించి, మెట్ల పైభాగానికి చేరి కార్యాలయాన్ని, భవంతిని ధ్వంసం చేయనారంభించారు. కొందరు కర్రలు, బల్లెములు చేపట్టగా, గొడ్డళ్ళు, పలుగులు, దుడ్డుకర్రలు, తుపాకులు చేపట్టి మరికొందరు హోటల్‌లో ప్రవేశించడం చాలామంది చూశారు. ఆయుధాలు, మందుగుండు సామాగ్రి కోసం వెదుకుతున్న ప్రదర్శనకారులు డాక్యుమెంట్లను, లెడ్జర్లను, ఖాతాపుస్తకాలను, కొన్ని డబ్బునోట్లను ధ్వంసం చేశారు. ఉద్యమకారుల ఉద్దేశ్యం, దొంగతనం కానీ, లూటీగానీ కాదు. నగర కోశాధికారి పోలీసులకు చెప్పిన సమాచారం ప్రకారం 3.5 మిలియన్ విలువైన డబ్బు నోట్లు అలాగే ఉండిపోయాయి. అంతేగాక ముందు పోయిన వంకుపైగా నోట్లు కూడా కొన్ని వారాల తర్వాత తిరిగి పంపబడ్డాయి. సుమారు పదకొండు గంటల సమయంలో ప్రదర్శనకారులు "ప్లేస్ డి గ్రీవ్" ప్రాంతానికి వెళ్ళిపోయారు.

మెయిలార్డ్, అతని కార్యకర్తలు కలిసి అదే సమయంలో ఆ ప్రాంతానికి వచ్చారు. మెయిలార్డ్ ప్రకారం ఆ సమయంలో బెయిలీ, లాఫమెట్టె ప్రాణాలకు హాని కలిగిస్తామని ఆ మహిళలు బెదిరిస్తున్నా నిజానికదో విధ్వంసాన్ని ఆపడానికో, లేక కేవలం దేశభక్తుల రాజకీయ లక్ష్యాలను చేరుకోవడానికో మాత్రమే. మెయిలార్డ్ తనకు తానే ముందుకొచ్చి ఓ నాయకుడిలా వ్యవహరిస్తూ, వెర్సయిల్స్ వరకూ 12 మైళ్ళు నడచి, "పారిస్‌కి ఆహారం అందించవలసింది" గా రాజుకు, అసెంబ్లీకి పిటిషన్ ఇచ్చాడు. సాయంత్రం ఛాట్‌లెట్ నుండి ఫిరంగులను తొలగించారు. తమను కలిసిన మహిళలందరినీ తమతో కలిసేలా చేశారు.

పారిస్‌లోని శ్రామిక మహిళలు తమ సమస్యలపట్ల ఎలా పోరాటం చేశారో ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతుంది. మగజాతి నిష్క్రియ పట్ల అసహనం, అసంతృప్తి పెల్లుబుకి తామే ముందుండి తమ సమస్యల పరిష్కారానికి పోరాటం చేశారు. ఇది పురుషుల పట్ల స్త్రీల వ్యతిరేకతగా, పోరాటంగా చూడగలమా? లేదు. ధనవంతుల అణచివేతకు లోనయిన పేద ప్రజల పోరాటంగా మాత్రమే భావించగలం. ఆర్థిక కారణాలైన ఆహారం ప్రాతిపదికగా ప్రారంభమైన పోరాటం, క్రమంగా రూపుమారి ఆయుధాల కోసం పోరాటంగా మారింది. నిజానికి ప్రారంభంలో తమ మగవాళ్ళను అవమానించాలని భావించిన పారిస్ మహిళల తెలివితేటలు ఉద్యమానికి అద్భుతంగా సహకరించాయి.

రాజకీయ చిత్రంపై నూతన సమూహాల ఆవిర్భావం ఏ ఉద్యమానికైనా ప్రాథమిక లక్షణం. మహిళల విషయంలో ఇది సత్యం. ఫ్రెంచ్ విప్లవంలో మహిళలు పురుషుల కోసం తమ రాజకీయ ఆకాంక్షలను విడిచి పెట్టలేదు. తదనంతరమే పారిస్‌లో "రివల్యూషనరీ రిపబ్లికన్ ఉమెన్ సిటిజన్స్" ఏర్పడటమే గాక, ఎరుపుపై తెలుపున్న పంట్లాములు, స్వేచ్ఛా సంకేత టోపీలను తలపై ధరించి, భుజాలపై ఆయుధాలతో ప్రదర్శన చేశారు. మహిళలకు ఓటు హక్కు, మిలటరీలోనూ, ప్రభుత్వంలోనూ ఉన్నత పదవులను డిమాండ్ చేశారు. పురుషులతో సమానంగా రాజకీయ సమానత్వం, తమ హక్కుల కోసం ప్రాణాలైనా ఇచ్చి పోరాటం మొదలైనవన్నీ విప్లవంలో భాగమైపోయాయి.

విప్లవం కొనసాగుతున్నంత కాలం, రాజకీయ పార్టీలు, భిన్న భావాల వ్యక్తులు కలిసి చేసిన సుదీర్ఘ పోరాటంలో ఆధునిక పద్ధతుల కన్నా, విప్లవాత్మక ధోరణులే అధికంగా ప్రభావితం చేశాయి. విప్లవం తీవ్రస్థాయి నుండి తిరోగమనం చెందే వరకూ ఇదే కొనసాగింది. ఈ పార్టీ వివిధ వర్గాల మధ్య అట్టడుగు స్థాయి నుండి జరిగిన పోరాటాన్ని ప్రతిఫలించింది. గిరాండియన్ కుట్ర, బూర్జువా వర్గం విధానాన్ని కొంతవరకు అలవరచుకొని, ప్రజా సమూహాలను భయపెట్టి, రాజుతో ఒప్పందం దిశగా వ్యవహ

రించింది. ఈ వర్గ వైరుధ్యాలు, విరోధాలు, ఫ్రెంచ్ విప్లవంతో కొంత చేదుని నింపినా, స్త్రీల ప్రశ్నలను ప్రాథమికంగా ప్రభావితం చేశాయి.

స్త్రీల సమస్యలు, హక్కుల కోసం పోరాటం సలుపుతూ ఉన్నతస్థానాలలో ఉన్న కొంతమంది గిరోండియన్ ఉద్యమ కారిణులు పేద మహిళలు లో దుస్తులు లేకుండా ప్రదర్శించిన నిరసనను వేరే దృక్కోణంలో చూశారు. కుట్టుపని వాళ్ళు అంతకన్నా ఏం చేస్తారని వ్యంగ్యంగా వక్రీకరించారు. పారిస్‌లోని పేద మహిళలు తమ సమస్యల పరిష్కారానికి విప్లవ కాంక్షతో, ధనికుల పట్ల ఏహ్య భావంతో పాల్గొని తమకు కావాల్సిన దానిని సాధించుకున్నారు. కానీ గిరోండియన్ మహిళలు, ఉన్నతస్థాయి పదవుల్లోనున్న మధ్య తరగతి స్త్రీలు, బూర్జువా భావజాలమున్న కుటుంబాలు మాత్రం పారిస్ పేద మహిళల సమస్యను వక్రీకరించారు.

గిరోండియన్లు విడాకుల చట్టాన్ని తీసుకురావడం మహిళాభ్యుదయంలో ముందడుగే. స్త్రీలకు ఆస్తి హక్కును ఈ చట్టంలో ప్రతిపాదించారు. ఫ్రెంచ్ విప్లవం సమయంలో అధికశాతం మహిళలకు ఇది ఏమాత్రం ఉపయోగించని అంశం. కారణం అధికశాతం భర్తలు పేదవాళ్ళ, ఎలాంటి సొంత ఆస్తి లేనివాళ్ళు. లోదుస్తులు లేకుండా ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు విప్లవంలో చురుకైన పాత్ర వహించినప్పటికీ "ఆస్తిపై పవిత్రమైన హక్కు"ను వ్యతిరేకించారు. కారణం వర్గ స్వభావ రీత్యా నిరుపయోగమైన హక్కుగాబట్టి.

బూర్జువా స్వభావంతో చేసిన చట్టాలపట్ల వ్యతిరేకతతో విప్లవపథంలో ముందు నిలబడినప్పటికీ, వెంటనే మరో వాదానికి తెరలేచింది. స్త్రీ, పురుషుల సమానత్వం కోసం కేవలం చట్టం ముందు మాత్రమేగాక, సమాజంలో సమానత్వం కోసం, వర్గరహిత సమాజం కోసం, ధనిక, పేద వ్యత్యాసాలు లేని ప్రపంచం కావాలని కోరారు. నిజానికి ఫ్రెంచ్ విప్లవం సమయంలోని సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ఇది అసాధ్యం. సోషలిస్టు సమాజం కోసం కేవలం పునాది పడుతున్న కాలం అది. ఫ్రెంచ్ విప్లవం బూర్జువా వర్గ స్వభావం కలిగినది.

సామాజిక తరగతులకతీతంగా మహిళలందరూ ఏకం కావాలంటూ ఇచ్చిన పిలుపును శ్రామిక మహిళలు ఖాతరు చేయలేదు. న్యాయమైన సమాజం కోసం తమ మగవారితో కలిసి పోరాడినవారు స్త్రీజాతి ఐక్యత కోసం ఆసక్తి చూపలేదు.

### ఓటు హక్కుకోసం వర్గ విభజన

బ్రిటన్‌లో శ్రామికోద్యమం జరుగుతున్న తొలికాలం, శ్రామిక మహిళా ఉద్యమాలు కూడా ఊపందుకున్న సమయం. 19వ శతాబ్దం చివరలో ఏర్పడిన "క్రొత్త ట్రెండ్ యూనియన్ల సంస్కృతికి మూలం. వరుసగా జరిగిన సమ్మెలు అసంఘటిత రంగ కార్మికుల ఐక్యతను పెంచాయి. గతంలో వీరెవ్వరూ పోరుబాట పట్టలేదు. మ్యాచ్‌గాల్స్ స్ట్రైక్ మొదలగు ఉద్యమాలు ఈ సమయంలోనే జరిగాయి. మార్క్స్ కుమార్తె "ఎలినార్" ఈ సమ్మెలోనూ, అదే సమయంలో జరిగిన అనేకానేక సమ్మెలలో ఉత్సాహంగా పాల్గొంది.

మధ్య తరగతి మహిళలలో సైతం ఓటు హక్కుకోసం ఉద్యమం ఉధృతంగా ఊపందుకుంది. ఓటు హక్కు కోసం ఉద్యమించిన మధ్య తరగతి వారు స్త్రీలకు లభించిన ఓటు హక్కుతో సంతృప్తి చెందారు. తమ తరగతికి చెందిన ఆస్తిపరులకు ఇది సంతోషాన్నిచ్చింది. ఇక్కడో విషయాన్ని గమనించాలి. ఆ సమయంలో చాలామంది మగవారికి ఓటు హక్కు లేదు. తర్వాత జరిగిన సంఘటనలు బూర్జువా మహిళావాదుల శ్రామికవర్గ వ్యతిరేకత, చివరకు శ్రామిక మహిళల వ్యతిరేక స్వభావాన్ని కూడా బట్టబయలు చేశాయి.

"బూర్జువా స్వభావంతో చేసిన చట్టాలపట్ల వ్యతిరేకతతో విప్లవపథంలో ముందు నిలబడి నప్పటికీ, వెంటనే మరో వాదానికి తెరలేచింది. స్త్రీ, పురుషుల సమానత్వం కోసం కేవలం చట్టం ముందు మాత్రమేగాక, సమాజంలో సమానత్వం కోసం, వర్గరహిత సమాజం కోసం, ధనిక, పేద వ్యత్యాసాలు లేని ప్రపంచం కావాలని కోరారు."



సిల్వియా ఫాంక్‌హర్స్ట్

ఇదే అంశాన్ని "సిల్వియా ఫాంక్‌హర్స్ట్"పై జెన్ ఫిక్కర్ట్ రాసిన వ్యాసంలో స్పష్టపరిచింది. ఫాంక్‌హర్స్ట్ కుటుంబాన్ని మహిళల ఓటు హక్కుకోసం జరిగిన పోరాటానికి పర్యాయ పదంగా చెప్పవచ్చు. కానీ సిల్వియా ఫాంక్‌హర్స్ట్‌ను తన తల్లి ఎమ్మాలిన్, సోదరి క్రిస్టబెల్‌తో భిన్నంగా చూయించినవి వర్గ సమస్యల పట్ల ఆమె దృక్పథం. తత్ఫలితంగా 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత 1920లో టోరీ పార్లమెంటరీ అభ్యర్థినిగా "ఎమ్మోలిన్" పోటీ చేయగా, సిల్వియా బ్రిటీష్ కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరుగా ఉన్నది.

1903లో మహిళల ఓటు హక్కు వలన ఇండిపెండెంట్ లేబర్ పార్టీలో కొంత అనిశ్చితి ఏర్పడి "ది ఉమెన్స్ సోషల్ అండ్ పొలిటికల్ యూనియన్" ఏర్పడింది. త్వరితంగా ఎదిగి, ఉపాధ్యాయులను, షాపులలో పనిచేసే యువతులను, క్లర్క్‌లను, దుస్తుల తయారీదారులను, వస్త్ర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులను సభ్యులుగా చేర్చుకుంటూ 1907వ సంవత్సరానికల్లా 3,000 శాఖలుగా వృద్ధి చెందింది. స్త్రీలకు ఓటు హక్కు అనే వార్తాపత్రిక వారానికి 40 వేల కాపీల స్థాయికి ఎదిగింది. హైడ్‌పార్క్‌లో ఆల్బర్ట్ హాల్‌లో 25,000 మందితో ప్రదర్శన నిర్వహణ స్థాయికి ఎదిగింది.

1911వ సంవత్సరంలో, ఆస్క్విత్ లిబరల్ ప్రభుత్వం ఐర్లాండ్‌లో హోమ్‌రూల్ తెచ్చే హామీనిస్తూ, ఆస్తిపరులైన మహిళలకు ఓటుహక్కు కూడా ఎరచూపింది. రెండు హామీలను లిబరల్స్ నెరవేర్చకుండా మోసం చేశారు. ఓటు హక్కు కోసం మహిళలు ఎదురు తిరిగి పోరాటం చేసినప్పుడు లాఠీ దెబ్బలు, అరెస్టులు, ముక్కులో నుండి పొట్టలోకి పైపువేసి బలవంతంగా ఆహారం ఇవ్వటం ( ఫోర్స్ ఫీడింగ్) వంటి పైశాచిక కృత్యాలతో అణచివేసే ప్రయత్నం చేశారు. మధ్య తరగతి మహిళలే ఈ ప్రదర్శనను చేప ట్టారు. బూర్జువా వర్గానికి చెందిన కార్యకర్తలు కిటికీలను ధ్వంసం చేయడమనే కార్యక్రమం చేపట్టినప్పటికీ

**"మార్పుకోసం వచ్చిన మహిళలుగా మాటల్లో చెబుతూ, సామాన్య ప్రజల తరఫున ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నట్లు పైకి కన్పిం చినా, వాస్తవానికి శ్రామికవర్గానికి ప్రతికూలంగా, తమ వర్గ పురుషుల కనుగుణంగా పనిచేశారు. బాధలతో, హింసకు లోనవు తున్న ప్రజల పక్షం వహించక, సౌకర్యవంత జీవన విధానాన్ని గడుపుతూ, బూర్జువా మనస్తత్వంతోనే వ్యవ హరించారు."**



ఫ్రెంచ్ విప్లవంలో పాల్గొన్న మహిళలు

ఫలితం లేకపోయింది. మహిళ లకు ఓటుహక్కు నివ్వడానికి పాలకవర్గం నిరాకరించింది.

మహిళా హక్కుల కోసం చేసే ఉద్యమాలు ముందుకు పోవాలంటే ఆ సమయంలో పెట్టుబడిదారీ వర్గంతో తీవ్ర పోరాటం చేస్తున్న కార్మికవర్గంతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవటం సరైన మార్గం. ఇది బ్రిటన్‌లో వర్గ పోరాటాలు పెరుగుతున్న కాలం. నౌకాశ్రయంలో పనిచేసే కార్మికులు, రవాణా వ్యవస్థలో కార్మికు లు మూకుమ్మడి సమ్మెలు చేస్తున్న సమయం. సౌత్ వేల్స్‌లో మైనింగ్ కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి "ఉదారవాది" ఆస్క్విత్ సైనికదళాలను పంపాడు. లండన్ తూర్పు ప్రాంతంలోని శ్రామిక మహిళలలో ఆందోళన, ప్రచారాలను నిర్వహించడం అనే పద్ధతులను "సిల్వియా పాంక్‌హర్ట్స్ అనుసరించింది.

లండన్ దక్షిణ ప్రాంతంలోని బెర్మాండ్‌సీ లోని ఫుడ్ ఫ్యాక్టరీలో సమ్మె చేస్తున్న మహిళలకు మద్దతుగా, మిగిలిన కర్మాగారాల నుండి దుకాణాల వరకు 15,000 మంది మహిళలు ఓ మహా ప్రదర్శనను సౌత్ వార్క్ పార్క్‌లో నిర్వహించారు. తమ జీతాల పెంపును, ఓటు హక్కును వారు డిమాండ్ చేశారు. ఈ విధంగా వర్గ పోరాటం ఆర్థిక డిమాండ్ల నుండి రాజకీయ డిమాండ్లుగా మారి, ఆఖరుకు స్త్రీలకు ఓటు హక్కు వరకూ పరిణతి చెందింది.

వర్గ దృక్పథం ఓటు హక్కు ఉద్యమంతో పాటు ఫ్రాంక్ హర్ట్స్ కుటుంబంలో సైతం చీలికలు తెచ్చింది. యుద్ధానికి కొన్ని నెలల ముందు 1914వ సంవత్సరం జనవరిలో తల్లి ఎమ్మలిన్ పిలుపు మేరకు సిల్వియా ప్యారిస్ రావడం జరిగింది. ప్రశాంత వాతావరణంలో తల్లితో, సోదరి క్రిస్టాబెల్‌తో సమావేశం జరిగింది. ఆరోగ్యానికి ప్రతీకలా క్రిస్టాబెల్ ఓ వైపు, సమ్మెల వలన పాలిపోయి, అలసిపోయిన శరీరంతో సిల్వియా శ్రామిక మహిళలకు ప్రతి రూపంగా మరోవైపు కూర్చున్నారు. పరస్పర వ్యతిరేక భావజాలానికి నిలువెత్తు రూపాలు ఆ అక్కా చెల్లెళ్ళది. ఉమన్ సోషల్ అండ్ పొలిటికల్ యూనియన్‌ను పురుషుల పార్టీనుండీ స్వతంత్ర్యంగా ఉంచాలని, డబ్ల్యుఎస్‌పియులో ఉన్న ఈస్ట్ లండన్ ఫెడరేషన్‌ను తొలగించాలని క్రిస్టాబెల్ సిల్వియాపై ఒత్తిడి తెచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రామిక మహిళలను ఓటు హక్కు ఉద్యమం నుండి తొలగించాలని బలవం తం చేసింది.

ఈస్ట్ లండన్ ఫెడరేషన్‌కు ప్రజాస్వామిక రాజ్యాంగం ఉండాలని, శ్రామిక మహిళలపై అధికశాతం ఆధారపడాలని సిల్వియా వాదిం చింది. కూతుళ్ళు ఇద్దరి మధ్య సయోధ్య చేయా లని ఎమ్మలిన్ ప్రయత్నించినప్పటికీ క్రిస్టాబెల్ అంగీకరించక, స్పష్టత కావాలని పట్టుబట్టింది. ఆ విధంగా 1914 సంవత్సరం జనవరిలో డబ్ల్యు.ఎస్.పి.యు నుండి ది ఈస్ట్ లండన్ ఫెడరేషన్ బలవంతంగా తొలగించబడి ప్రత్యేక మైన సంస్థగా ఏర్పడింది. అదే "ది ఈస్ట్ లండన్ ఫెడరేషన్ ఆఫ్ సఫ్రాజెట్స్. ఈ సంఘటన మధ్య తరగతి స్త్రీవాదుల మనస్తత్వాన్ని, శ్రామిక మహిళల పట్ల వారి దృక్పథాన్ని ప్రస్ఫుటింప జేస్తుంది. 1911 నుండీ 1914 మధ్యకాలంలో శ్రామికులలోని ప్రతి వర్గమూ (నౌకాశ్రయ కూలీ లు, రవాణా కార్మికులు, రైల్వే సిబ్బంది, ఇంజ నీర్లు) విస్తృతంగా సమ్మెలలో పాల్గొంది. డబ్ల్యుఎస్పియు సభ్యులు జైళ్ళలో నెట్టబడ్డారు. దుర్భరమైన పరిస్థితులను, శిక్షలను శ్రామిక మహి ళలు ఎదుర్కొన్నారు. హింసను భరించారు.

ఇక్కడ కూడా వర్గానికి సంబంధించిన ప్రశ్న ప్రాథమికమైనది. ఓటు హక్కు బూర్జువా ఉ ద్యమకారిణుల ఆలోచనా విధానం శ్రామిక మహిళలకు, కార్మికోద్యమాలకు, సోషలిజానికి వ్యతిరేకంగా ఉండటమే! మహిళలకు వ్యతిరేకం గా పురుషులు అన్న ఆలోచన ఎక్కడికి దారితీస్తుందో ఇక్కడ మనం చూడవచ్చు. 1914 లో ఈ చీలిక ఏర్పడే కొద్దికాలానికి ముందు మొదటి ప్రపంచయుద్ధం బ్రిటన్‌లోని వర్గ పోరాటాన్ని కాస్త నిలువరించింది. ఓటు హక్కు ఉద్యమంలో తిరుగుబాటుదారులుగా ముద్రపడిన ఎమ్మలీన్, క్రిస్టబెల్‌లు క్రమంగా సాంఘిక దేశభక్తులుగా మారి, డబ్ల్యుఎస్‌పియు పత్రిక పేరును బ్రిటన్ కోసం మహిళలుగా మార్చారు. "రాజు, దేశం, స్వాతంత్ర్యం"లను ప్రధాన నినాదంగా( మోటో)పెట్టారు.

మార్పుకోసం వచ్చిన మహిళలుగా మాటల్లో చెబుతూ, సామాన్య ప్రజల తరఫున ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నట్లు పైకి కన్పిం చినా, వాస్తవానికి శ్రామికవర్గానికి ప్రతికూలం గా, తమ వర్గ పురుషుల కనుగుణంగా పనిచేశారు. బాధలతో, హింసకు లోనవుతున్న ప్రజల పక్షం వహించక, సౌకర్యవంత జీవన విధానాన్ని గడుపుతూ, బూర్జువా మనస్తత్వంతోనే వ్యవ హరించారు. మరో విధంగా చెప్పాలంటే అనాదిగా ఎదురవుతున్న కథే పునరావృతమైంది.

సిల్వియా ఫాంక్‌హర్ట్స్ యుద్ధాన్ని వ్యతిరేకిం చింది. తన విధానం పట్ల స్పష్టతతో, కర్మాగా రాల్లో సమాన వేతనం కోసం, యుద్ధ సామగ్రి

తయారీ ప్రాంతాలలో మహిళలకు బదులు పురుషుల నియామకం కోసం ప్రచారం నిర్వహించింది. "కార్మికుల ధైర్యం" పేరుతో ఓ పేపర్‌ను ప్రచురించింది. తర్వాత కాలంలో ఆమె కమ్యూనిస్టుపార్టీలో చేరింది. మార్క్సిజం పట్ల ఆమె అవగాహన పరిమితమైనప్పటికీ వర్గ పోరాట స్వభావాన్ని అలవరచుకుంది. 1918వ సంవత్సరంలో, 30 సంవత్సరాల వయస్సు పైబడిన మహిళలకు ఓటుహక్కు వచ్చింది. అయితే తమకు ఓటుహక్కు కోసం చేసిన పోరాటాల ఫలితంగానో, అనుసరించిన విధానాల వలనో మాత్రం కాదు. రష్యా విప్లవం వలన, మొదటి ప్రపంచ యుద్ధానంతర పరిణామాల్లో బ్రిటీష్ పాలకవర్గంపై వచ్చిన ఒత్తిడి ఫలితంగా రాయితీలు ఇవ్వక తప్పలేదు. ఇక్కడ కూడా విప్లవోద్యమాల ఉప ఫలితాలుగా సంస్కరణలుంటాయని స్పష్టమౌతున్నది.

### "రష్యా విప్లవంలో మహిళలు"

శ్రామిక మహిళల పాత్ర రష్యాలో 1917వ సంవత్సరం ఫిబ్రవరిలో మరోసారి స్పష్టమైంది. నరమేధం జరుగుతుందని స్థానిక బోల్షివిక్‌లు సలహా ఇచ్చినప్పటికీ మహిళా కార్మికులు సమ్మెకు, ప్రదర్శనకు దిగిన ఫలితంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జార్ ప్రభుత్వం కూల్చివేయబడింది. శ్రామికవర్గ సహజ లక్షణాలతో అభ్యంతరాలన్నింటినీ పక్కన పెట్టి విప్లవాన్ని ప్రారంభించారు. బోల్షివిక్ విప్లవంలో "అలెగ్జాండ్రా కొల్లంటాయ్"లాంటి ఉద్యమ కారిణులు ప్రముఖపాత్ర పోషించారు.

అక్టోబర్ విప్లవం ఫలితంగా ప్రపంచంలో ఏ దేశంలో లేని హక్కులన్నీ మహిళలకు లభించాయి. స్త్రీల స్వేచ్ఛకు, కుటుంబంలో మార్పులకు బోల్షివిక్‌లు ప్రతీకగా నిలబడ్డారు. తరాల తరబడి గ్రామాల్లో పాతుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థ, బానిసత్వం, అణచివేతలన్నీ కొట్టుకు పోయి, స్త్రీల జీవితాలలో ఉషోదయం ఆరంభమైంది. విప్లవానికి పూర్వం భార్యను కొట్టడమనేది భర్తకున్న అత్యంత సహజ హక్కు. వివాహచట్టం ద్వారా మహిళలకు చట్టపరమైన సమానత్వం బోల్షివిక్‌లు ఇచ్చారు. 1918వ సంవత్సరం అక్టోబర్ మాసంలో కుటుంబ సంరక్షణా బాధ్యతలను సవరించి ఆమోదించారు. వైవాహిక బంధంలో జన్మించిన బిడ్డలతో సమానమైన స్థాయిని, హక్కులను వివాహేతర బంధంలో జన్మించిన పిల్లలకు కూడా కల్పించారు.

మహిళల కోరిక ప్రకారం విడాకులు మంజూరు చేయడం, అబార్షన్ చట్టబద్ధం చేయడం జరిగింది. "సమాన పనికి – సమాన వేతనం సూత్రాన్ని చట్టబద్ధం చేశారు. బోల్షివిక్

"అక్టోబర్ విప్లవం ఫలితంగా ప్రపంచంలో ఏ దేశంలో లేని హక్కులన్నీ మహిళలకు లభించాయి. స్త్రీల స్వేచ్ఛకు, కుటుంబంలో మార్పులకు బోల్షివిక్‌లు ప్రతీకగా నిలబడ్డారు. తరాల తరబడి గ్రామాల్లో పాతుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థ, బానిసత్వం, అణచివేతలన్నీ కొట్టుకు పోయి, స్త్రీల జీవితాలలో ఉషోదయం ఆరంభమైంది."



అలెగ్జాండర్ కొల్లంతాయ్

మహిళలు సాధించిన ఈ హక్కులు ఉద్యమకారుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా మహిళా ఉద్యమకారులకు చేరాయి. శ్రామిక మహిళలకు, రైతుల భార్యలకు రాజకీయ విద్యను అందించటం కోసం తరగతుల నిర్వహణ, వ్యభిచారానికి వ్యతిరేకంగా పోరాటం ఆరంభమైంది.

అక్టోబర్ విప్లవం తర్వాత వచ్చిన రక్తం చిందిన వర్గపోరాటంలో వాస్తవానికి మహిళల అవసరం లేకున్నప్పటికీ అధిక సంఖ్యలో రెడ్ ఆర్మీలో స్వచ్ఛందంగా చేరారు. 1920వ సంవత్సరానికల్లా సుమారు 50 వేల నుండి 70 వేల మంది వరకు మహిళలు రెడ్ ఆర్మీలో చేరినట్లు అంచనా. మహిళల సహకారాన్ని బోల్షివిక్‌లు ఏవిధంగా పొందగలిగారో ఈ సంఘటనే నిరూపిస్తుంది. మహిళల దాస్య విమోచనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన లెనిన్ "ఇంటి పనుల నుండి మహిళలకు వెసులుబాటు అవసరమని, అప్పుడే సమాజం కోసం మహిళలు తమ సంపూర్ణ శక్తియుక్తులను కేటాయించగలుగుతారని" స్పష్టీకరించారు.

ప్రపంచంలో శ్రామికవర్గం దాస్య విమోచన పొందిననాడే మహిళల దాస్య విమోచన సాధ్యమవుతుంది. మానవ సంబంధాల మధ్య సమానత్వం, వ్యక్తిత్వాల అభివృద్ధి, స్త్రీ పురుష సంబంధాల్లో స్పష్టత, సమానత్వం మొదలగునవన్నీ సోషలిజంలోనే సాధ్యం. బాహ్య ఒత్తిడులు, సామాజిక, ఆర్థిక, మతపరమైన అవరోధాలన్నీ సోషలిజం వలననే సమసిపోతాయి. ప్రస్తుతం అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల కన్నా ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధి అధికస్థాయిలో ఉన్నప్పుడే అటువంటి సమాజం సాధ్యమౌతుంది.

వెనుకబాటుతనం వలన 1917 అక్టోబర్ విప్లవం నాటికి రష్యాలో అటువంటి పరిస్థితి లేదు. విప్లవం ద్వారా విస్తృతమైన మార్పులు సంభవించినప్పటికీ, రష్యాలో మహిళల స్థానం మాత్రం వెనక్కు నెట్టబడింది, ముందుగా స్టాలినిజం, తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ పునరావిర్భవించడం వలన, రష్యా, తూర్పు యూరప్‌లలో మహిళలకు గతంలో కన్నా దుర్భర పరిస్థితులు ఎదురయ్యాయి. ఇదెవ్వరినీ ఆశ్చర్యపరచలేదు. కారణం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉంటే రష్యాలో, లేదా మరెక్కడైనా ఈ పరిస్థితి అత్యంత సహజం.

1917 తర్వాత మహిళల పరిస్థితి లాంటి ఉదాహరణలు భవిష్యత్తులో కూడా చూస్తాం. పెట్టుబడిదారీ వ్యవస్థను కూల్చి, సోషలిజం సాధించే క్రమంలో మహిళలు గణనీయమైన పాత్రను పోషిస్తారు. అయితే ఈ క్రమంలో శ్రామిక మహిళలు తమ స్వీయ విమోచన కోసం ఎంత వరకు కృషి చేస్తారు అన్నదే ప్రశ్న. సమాజంలోని దాస్య విమోచన కోసం పోరాటం ఎంత అవసరమో, తమకు తాము విమోచన పొందడం కూడా అంతే అవసరం.

వర్గ పోరాటాలలో పాల్గొనడం వలన శ్రామిక మహిళలు, పురుషులు క్రమంగా వర్గ దృక్పథం, ఆత్మవిశ్వాసం పుంజుకున్నారు. సమాజాన్ని మార్చడానికి పోరాటం చేసే క్రమంలో స్త్రీలు, పురుషులు తమను తాము సైతం మార్చుకోగలిగారు. ఒక్కో సమ్మెలో కార్మికులు అనుసరించిన నూతన విధానాలు, ఉద్యమ

> **"సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి, ప్రజాస్వామిక పద్ధతిలో ఉత్పత్తి సాధనకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే వ్యక్తి చుట్టూ అల్లుకొని ఉన్న కుటుంబ సంబంధాలు మారి నూతన స్వేచ్ఛాపూరిత మానవ సంబంధాలు ఏర్పడతాయి."**




రష్యన్ విప్లవంలో పాల్గొన్న మహిళలు

స్వరూపాలు మారాయి. పాత ఆలోచనలు విడనాడి, నూతన దృక్పథంతో, వ్యవహారశైలితో, అంతకుముందెన్నడూ తమ జీవితాలలో తారసపడని ఎన్నో అంశాలు నేర్చుకున్నారు. విప్లవ పథం మరెన్ని మార్పులకు దోహదం చేసిందో?

నిజమైన స్వేచ్ఛకు ఇదే మార్గం. కేవలం కొద్దిమంది మహిళలకే ఇది పరిమితం కాదు. మహిళలందరికీ, పురుషులకు కూడా ఇదే వర్తిస్తుంది. ఇవి రెండూ పరస్పరాధారితం, ఒకదానినొకటి విడచి ఉండవు. ఇది ఎవరో ఒకరి కోసం కాదు. విశ్వ మానవాళి స్వేచ్ఛ కోసం. త్వరితగతి అభివృద్ధి కోసం మహిళలను ఉద్యమాలకు దూరంగా ఉంచాల్సిన అవసరం లేదు. ఎంత చిన్న అంశమైనా, ఎలాంటి వివక్షైనా, అభివృద్ధి నిరోధక ఆలోచన అయినా ఖచ్చితంగా పోరాటం చేస్తేనే కనుమరుగవు తుంది. విప్లవ పథంలో కార్మికోద్యమాలు ముందుండాలి.

**మహిళల దాస్య విమోచన సోషలిజం**

గతంలో జరిగిన బూర్జువా పోరాటాలు పురుషుల హక్కుల కోసం జరిగాయి తప్ప, స్త్రీలకు సమానత్వ సాధన కోసం కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థలో స్త్రీల పరిస్థితి ఎంతో కొంత మారిందంటే, వర్గ పోరాటాల ఫలితం. ఉత్పత్తి క్రమంలో స్త్రీల భాగస్వామ్యం కూడా మరో కారణం. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ సమాజాలలో స్త్రీలకు రాజకీయ హక్కులు కొంతవరకు లభించినప్పటికీ సంపూర్ణ దాస్య విమోచన జరగలేదు. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఏనాటికీ సాధ్యం కాదు.

1848 ఆరంభంలో మార్క్స్, ఏంగెల్స్ బూర్జువా కుటుంబ వ్యవస్థను నశింపచేయాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా కుటుంబాన్ని నశింపజేయడం సాధ్యం కాదని తర్వాత అర్థం చేసుకోగలిగారు. అందుకు భౌతిక ప్రాతిపదిక లేకపోతే దానిని సాధించలేం. ప్రైవేటు ఆస్తిపరుల, ప్రభుత్వ కబంధహస్తాల నుండి ఉత్పత్తి శక్తులు ఎప్పుడు విడిపించబడతాయో అపుడు ఊహించని స్థాయిలో ఆర్థికాభివృద్ధిని సాధించటం సాధ్యమౌతుంది. పాత మనస్తత్వమైన అన్నీ తమకే చెందాలన్న దురాశ, అసూయ, భయం, పిసినారితనం తదితర భావాలకున్న భౌతిక పరిస్థితులు అంతమైపోతాయి.

జీవన పరిస్థితులలో విప్లవాత్మక మార్పులకు తగిన పరిస్థితులు ఏర్పడతాయి. స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు తొలగి తమ ఆలోచనల్లో, ప్రవర్తనలో ఓ స్పష్టత ఏర్పడుతుంది. విప్లవాత్మక ధోరణితో చర్యలు చేపట్టకపోతే ప్రజల స్వభావం, మనస్తత్వంలో మార్పు రావడమనేది కేవలం భ్రమల్లోనే మిగిలిపోతుంది. వర్గ సమాజంలోని అనాగరికత, స్వార్థం, అహంకారం, మానవుల బాధలకు స్పందించకపోవటం బానిసత్వపు అవశేషంగా చూడవచ్చు. బూర్జువా సమాజపు ఒత్తిళ్ళకు, ద్వంద్వ స్వభావానికి, దిగజారుడు తనానికి శ్రామికవర్గం దూరంగా ఉండలేదు. శ్రామికోద్యమాలలో స్త్రీలను తక్కువగా చూసే వెనుకబాటు ధోరణి ఉన్నది. ఈ విషానికి వ్యతిరేకంగా శక్తివంతంగా పోరాడాలి.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వం ఉన్న సమాజం కోసం కృషి చేయడం అంటే పెట్టుబడిదారీ అనాగరికతపై యుద్ధం చేయడమే. స్త్రీ, పురుషుల మధ్య ఐక్యతకు విఘాతం కల్పించే వెనుకబడిన ఆలోచనా విధానంపై పోరాటం చేస్తూ, సోషలిస్టు నైతికతను నిలబెట్టే దిశగా ఉద్యమాన్ని ప్రక్షాళన చేయటానికి కృషిచేయాలి. మహిళల పట్ల అణచివేతకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా కార్మికవర్గం జరిపే పోరాటంతో దృఢంగా అనుసంధానం చేయటం అవసరం. విజయానికి ఇదొక్కటి మాత్రమే సరైన మార్గం.

పురాతన సమాజపు వికృతపు గుర్తులైన స్వార్థపూరిత లెక్కలు, దురాశ, అహంకారం రాత్రికి రాత్రి నశించిపోవు. పెట్టుబడిదారీ వ్యవస్థ నశించినప్పటికీ అవశేషాలు నశించవు. పాత వ్యవస్థ ప్రక్షాళన జరిగి, నూతన వ్యవస్థ ఆవిర్భావానికి కొంతకాలం ఖచ్చితంగా అవసరం. అయితే స్త్రీ పురుషుల మధ్య సత్సంబంధాలు వృద్ధి చెందుతాయి. దుర్భరమైన ఆర్థిక పరిస్థితుల వలన అస్తవ్యస్థమైన జీవితాలు, గతించిన మానవ సంబంధాలు, మొదలగునవన్నీ మంచి విద్య, ఉద్యోగం, ఉపాధి, గృహవసతి లభించిన రోజు మార్పులకు లోనవుతాయి.

సమాజాన్ని అభివృద్ధిపథంలో నడిపించడానికి, ప్రజాస్వామిక పద్ధతిలో ఉత్పత్తి సాధనకు పకడ్బందీ ప్రణాళికలు రూపొందించాలి. అప్పుడే వ్యక్తి చుట్టూ అల్లుకొని ఉన్న కుటుంబ సంబంధాలు మారి నూతన స్వేచ్ఛాపూరిత మానవ సంబంధాలు ఏర్పడతాయి. వర్గ సమాజంలోని మురికి మనస్తత్వాలు, బానిస మనస్తత్వాలు తొలగి నూతన మానవ సంబంధాలు, స్త్రీ పురుషుల సమానత్వం ఏర్పడుతుంది. సుహృద్భావ వాతావరణంలో స్వేచ్ఛాయుత జీవనం సాధ్యమవుతుంది. బానిస మనస్తత్వం నశిస్తుంది. ప్రాపంచిక అసమానతల సంకెళ్ళు తెంచుకొని, పరస్పరాధారిత, స్వేచ్ఛాభావన వెల్లివిరుస్తుంది. సమానత్వం ప్రాతిపదికగా అహంకారం, అణచివేత, హింసా ప్రవృత్తులు లేని సమాజం సాధ్యమవుతుంది.

**అనువాదం : డాక్టర్ శమంతకమణి**

# మతోన్మాదాన్ని బలహీనపర్చటానికి సమగ్ర వ్యూహం ఉండాలి

సందేహాలు సమాధానాలు



- బి.వి.రాఘవులు

**ప్రశ్న: జులై నెల 15న టర్కీ దేశంలో సైనిక తిరుగుబాటు జరిగింది. దీన్ని టర్కీ ప్రభుత్వం ఎదుర్కొని నిలువరించింది. తిరుగుబాటుకి సూత్రదారుడైన "గులెన్"ను అప్పగించమని టర్కీ ప్రభుత్వం అమెరికాను డిమాండ్ చేస్తున్నది. దీన్ని అమెరికా తిరస్కరించినందువల్ల టర్కీ ప్రభుత్వం 50 ఏండ్ల క్రిందట సోవియట్ యూనియన్‌ను దెబ్బతీయడానికి తమ దేశంలో వైమానిక స్థావరం పెట్టి, అందులో ఉంచిన బి 61 డ్రాప్ బాంబ్స్‌ను తొలగించమని అమెరికాను డిమాండ్ చేస్తున్నది. దీన్ని లెక్కచేయనందువల్ల వైమానిక కమాండర్‌ను అరెస్టు చేసింది. ఆ స్థావరాన్ని స్వాధీనం చేసుకొన్నది. విమానాల రాకపోకలను ఆపేసింది. అంతేగాకుండా విద్యుత్, ఇతర వసతులు తొలగించింది.**

**ఇంత చిన్న దేశం అంతేసి చర్యలు అమెరికాపై తీసుకోవడం అమెరికా బలహీనతను తెలుపుతున్నది కదా? టర్కీ విధానాన్ని అనుసరించడానికి ఇతర దేశాలకు ఇదొక పాఠంగా నిలుస్తుంది కదా? దీనితోనైనా అమె రికాతో భాగస్వామ్యం ఏర్పర్చుకున్న భారత దేశానికి కనువిప్పు కలుగుతుందా?**

**- ఇలిపిళ్ళ సూర్యనారాయణ,** విజయవాడ

టర్కీలో ఎర్డోగాన్ నాయకత్వంలో నడుస్తున్న జస్టిస్ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చాలని జూలై 15న సైనిక తిరుగుబాటు జరిగింది. ఈ తిరుగుబాటు విఫలమైంది. ప్రభుత్వ అనుకూల సైనిక దళాలు తిరుగుబాటును అణిచివేయగల్గాయి. ఈ సందర్భంలో 270 మందికి పైగా పౌరులు మరణించారు. వేలాదిమంది గాయపడ్డారు. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన సైనిక కమాండర్లను అరెస్టు చేశారు. కొంతమంది దేశం విడిచి పారిపోయారు. ఈ తిరుగుబాటుకు సైనిక కమాండర్లు ముందున్నా అసలు సూత్రధారి అమెరికాలో కాందిశీకుడుగా వున్న మత ప్రచారకుడు 'గులెన్' అని టర్కీ ప్రభుత్వం ఆరోపించింది. గులెన్ అనుయాయులుగా భావించి వేలాదిమంది న్యాయాధికారులను, పోలీసు అధికారులను పదవులనుండి ప్రభుత్వం తొలగించింది. గులెన్‌ను 'టర్కీ'కి పంపించాలని (డిపోర్టు) అమెరికాను టర్కీ ప్రభుత్వం డిమాండ్ చేసింది. తిరుగుబాటుకు అమెరికా గూఢచారి సంస్థల సహకారం ప్రోత్సాహం ఉందని కూడా ప్రభుత్వాధినేతలు ప్రకటించారు. టర్కీ ప్రజలలో అత్యధికులు అమెరికా హస్తం వుందని నమ్ముతున్నట్లు మీడియాలో వచ్చింది. 'గులెన్'ను పంపడానికి అమెరికా ముందుకు రాకపోవడాన్ని 'ఎర్డోగాన్' తీవ్రంగా విమర్శించారు. అమెరికా సైనిక స్థావరాలను కొనసాగనీయమని కూడా హెచ్చరించారు. కొన్ని బెదిరింపు చర్యలు కూడా తీసుకున్నారు.

తిరుగుబాటు నేపథ్యంలో అమెరికా-టర్కీల మధ్య మనస్పర్థలు తీవ్రంగా పెరిగినా, ఈ తగాదా శాశ్వతమైనదని, సర్దుబాటు కాదని భావించరాదు. ప్రశ్నలో పేర్కొన్నట్లు టర్కీ అమెరికా వైమానిక కమాండర్‌ను అరెస్టు చేయలేదు. తిరుగుబాటుకు సహాయంగా విమానాలను పంపిన టర్కీ కమాండర్‌ను అరెస్టు చేశారు. ఒకవైపు అమెరికా టర్కీ మధ్య వివాదం నడుస్తుండగానే సిరియాలోకి వెళ్తున్న టర్కీ యుద్ధ ట్యాంకులకు మద్దతుగా అమెరికా యుద్ధ విమానాలు వెళ్తున్నాయి. టర్కీ నాటో కూటమిలో ఒక ముఖ్యమైన దేశం. మధ్య ప్రాచ్యంలో అమెరికా ప్రయోజనాలకు ఎప్పుడూ అండగా ఉంటున్నది. అందువలన తిరుగుబాటు సందర్భంగా ఉత్పన్నమైన తగాదా శాశ్వతంగా సంబంధాలను దెబ్బతీస్తుందని భావించరాదు.

టర్కీ ప్రక్కనే ఉన్న రష్యాకు బలమైన ఆర్థిక, వ్యాపార సంబంధాలున్నాయి. రష్యా యుద్ధ విమానాల్ని కూల్చివేసినప్పుడు రెండు దేశాల మధ్య వైరుధ్యం తీవ్రమైంది. అయితే ఈ మధ్య రెండు దేశాలు సర్దుకొని స్నేహాన్ని పునరుద్ధరించాయి. టర్కీతో స్నేహ సంబంధాలు రష్యాకు అవసరం. అమెరికా ఒత్తిడిని ఎదుర్కోవడానికి లాభసాటి బేరసారాలను ఆడడానికి టర్కీకి రష్యాతో స్నేహం ఉపయోగపడుతుంది. అందువలన రష్యాతో స్నేహాన్ని కూడా అమెరికా వ్యతిరేక వ్యూహంలో భాగంగా భావించాల్సిన అవసరం లేదు.

తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్నాడని చెప్పబడుతున్న 'గులెన్' ఒకప్పుడు ప్రస్తుత టర్కీ అధ్యక్షుడు 'ఎర్డోగాన్' స్నేహితుడే. ఇద్దరు కలిసే టర్కీలో మత మౌఢ్య భావాలను పెంపొందించడానికి పనిచేశారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత మహమ్మద్ కెమాల్ పాషా నాయకత్వాన టర్కీ లౌకిక రాజ్యంగా కొనసాగింది. సైన్యం లౌకిక వాదానికి అండగా నిలిచింది. ఈ పరిస్థితిని మార్చి టర్కీ సమాజాన్ని మతతత్వ భావాలతో నింపడంలో, ఆ భావ వ్యాప్తి మీద ఆధారపడి పౌర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఎర్డోగాన్‌కు 'గులెన్' పూర్తిగా సహకరించారు. అంతేగాక జస్టిస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత, తన పలుకుబడిని ఉపయోగించి 'గులెన్' ప్రభుత్వ యంత్రాంగంలో న్యాయ పోలీసు, సైనిక వ్యవస్థలలో, తన అనుయాయులను చొప్పించాడు. దశాబ్దం క్రితం 'గులెన్'ను 'ఎర్డోగాన్' మధ్య సంబంధాలు చెడడంతో గులెన్ అమెరికాకు వలసవెళ్ళి అక్కడ స్థిరపడ్డాడు. ఈ నేపథ్యం మూలంగానే 'ఎర్డోగాన్' గులెన్‌ను అనుమానించడం 'గులెన్' తిరస్కరించినప్పటికీ, తిరుగుబాటులో గులెన్ అనుయాయుల పాత్ర నిర్వివాదం.

అయితే మొత్తం తిరుగుబాటు ఘటనలో అమెరికా వ్యతిరేక స్వభావాన్ని మతోన్మాద స్వభావాన్నో వెదకడం అత్యాశ అవుతుంది. టర్కీ పాలక వర్గాల్లో వచ్చిన ఘర్షణ రూపంగా చూడాలి. ఇటువంటి సందర్భాలలో అమెరికా గూఢచారి సంస్థలు తమకు దగ్గరగా ఉండి సహకరించే బాపతుకు ప్రోత్సాహం ఇవ్వడం మామూలే.

**కార్యకర్తల నుండి వస్తున్న ప్రశ్నలు**

**ప్రశ్న : మన పార్టీ మహాసభ ఇతర బూర్జువా పార్టీలతో పొత్తులు లేకుండా కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా స్వతంత్రంగా ప్రజల్ని సమీకరించాలని నిర్ణయించింది. బిజెపి కొత్త తరగతులు, ప్రాంతాలలోకి చొచ్చుకుపోతూ బలపడుతున్నది. ఇటువంటి స్థితిలో ఇతర బూర్జువా పార్టీలతో పొత్తులు లేకుండా మతోన్మాద శక్తులను నిలువరించటం సాధ్యమౌతుందా?**

మతోన్మాద శక్తులను నిలువరించడానికి బూర్జువా పార్టీతో పొత్తులు అవసరం అన్న దృక్పథం ఒకటి ఉన్నది. ఈ అంశం గురించి 21వ పార్టీ మహాసభ కూలంకషంగా చర్చించి కొన్ని నిర్ధారణలకు వచ్చింది. పెరుగుతున్న హిందుత్వ, మతోన్మాద ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు పార్టీ అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ బూర్జువా పార్టీలలో ఎన్నికల పొత్తులను పెట్టుకొని నష్టపోయింది. మతోన్మాద శక్తులను

బలహీనపర్చలేకపోయింది. ఈ కాలంలో మతోన్మాద శక్తి బిజెపి బలం పుంజుకోవడం, వామపక్ష శక్తులు బలహీనపడడం జరిగింది. అందువలన మతోన్మాదాన్ని బలహీనపర్చాలంటే ఎన్నికల పొత్తులే సరిపోవు. ఒక సమగ్ర వ్యూహం కావాలని పార్టీ నిర్ధారించింది. ఈ వ్యూహంలో ప్రధానంగా 1) మతతత్వానికి ఆలంబనగా నిలుస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడడం 2) మతోన్మాదానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటం చేయడం 3) మతోన్మాదాన్ని వ్యతిరేకించే లౌకిక శక్తులను, వ్యక్తులను ఒకే వేదికమీదకు తెచ్చి మతోన్మాదాన్ని ప్రతిఘటించడం 4) సాంస్కృతిక రంగాన్ని మతోన్మాద శక్తులకు వదిలివేయకుండా లౌకిక శక్తుల జోక్యాన్ని పెంచడం 5) సామాజిక న్యాయ పోరాటాన్ని ఉధృతం చేయడం 6) ఎన్నికలలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల గెలుపుకు కృషి చేస్తూ మతోన్మాదాన్ని బలహీనపర్చే ఎత్తుగడలను అనుసరించడం ఉన్నాయి. ఇందులో ఎన్నికల ఎత్తుగడలు అనేవి ఒక చిన్న భాగం. ఇదే సర్వస్వం అయితే మతోన్మాదాన్ని బలహీనపర్చలేం సరికదా, మనం కూడా బలహీనమవుతాం.

**ప్రశ్న : మనం ప్లీనం తీర్మానంలో మాస్‌లైన్ అమలు చేయాలని నిర్ణయించాం. గతంలో మనం కొంతబలంగా ఉండి, ప్రస్తుతం బలహీనపడిన చోట్ల ప్రజలు ఇపుడు మనవద్దకు రావటం లేదు. కాబట్టి మనం చేయగలిగింది పరిమితంగా ఉంటుందని కార్యకర్తలు భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో మాస్‌లైన్‌ను ఏ విధంగా అమలు చేయాలని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మాస్‌లైన్ అమలు చేయాలంటే మనపని పద్ధతులలో ఎటువంటి మార్పులు రావాలి?**

మనం బలహీనపడినప్పుడు సహజంగానే మన శక్తిపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుంది. మనవైపు చూడడం, మన దగ్గరకు రావడం తగ్గుతుంది. అందుకే ప్రజలు మన దగ్గరకు రావాలని ఎదురు చూడకుండా మనమే ప్రజల దగ్గరకు వెళ్ళాలి. ప్రజలు అడగకపోయినా, ఆహ్వానించకపోయినా వారి మధ్యకు వెళ్ళాలి. తద్వారా వారి విశ్వాసాన్ని పొందాలి. ఇదే మాస్‌లైన్ అంటే. వామపక్షాల శక్తి తగ్గిన నేపథ్యంలో మాస్ లైన్ అదనపు ప్రాధాన్యత సంతరించుకున్నదని సిపిఐ (ఎం) భావిస్తున్నది. పార్టీ నాయకుల, కార్యకర్తల, కమిటీల పని విధానంలో ఎటువంటి మార్పు రావాలో కలకత్తా నిర్మాణ ప్లీనంలో సవివరంగా చెప్పబడింది.

❋

# మోడీ ప్రభుత్వ విధానాలకు ప్రతిఘటన

(19వ పేజీ తరువాయి)

'మోడీ' ప్రభుత్వంగానీ ఒకే రాజకీయ ఆర్థిక విధానాలను అవలంభిస్తూ వచ్చాయి. ఈ విధానాలు కష్టజీవుల, కార్మికుల సమస్యలు పరిష్కరించే విధానాలు కాదు. సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలకు మేలు చేసే విధానాలు కావు. ఇవి పెట్టుబడిదారులకు మేలు చేసే విధా నాలు. ప్రపంచబ్యాంకు సలహాలతో జనంమీద రుద్దిన నయా ఉదారవాద విధానాలు. కార్మికులు, కష్టజీవులు ఈ ఉదారవాద విధానా లకు వ్యతిరేకంగా ఏకోన్ముఖంగా, గరిష్ట ఐక్యత తో పోరాడిన రోజునే, ఈ విధానాలను తిప్పి కొట్టిన రోజునే మనకు మంచి రోజులు వస్తాయి. కార్మికులకు, కష్టజీవులకు పేద, సామాన్య, బడుగు, బలహీనవర్గాలకు అనుకూలమైన రాజకీయ, ఆర్థిక విధానాలను సాధించుకొనే లక్ష్యంతో మన పోరాటాలు ముందుకు సాగాలి.

అటువంటి పోరాటాలను ఉరకలెత్తించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించకుండా చేతులు ముడుచుకు కూర్చున్న ఈ ప్రభుత్వాన్ని ఉపేక్షించకూడదు. ఏళ్ళ తరబడి పోరాటాల ద్వారా సాధించుకున్న కొద్దిపాటి సంక్షేమ పథకాలను, ప్రయోజనాలను ఈ ప్రభుత్వం ఊడగొట్టాలని చూస్తున్నది. అంటే మన కుటుంబాల్లోని మహిళలకు, పిల్లలకు ఇప్పటిదాకా అందుతూ వచ్చిన పౌష్టికాహారం, విద్య, వైద్యం వంటి సౌకర్యాలను దూరం చెయ్యాలని చూస్తున్నది. అసంఘటితరంగంలో పనిచేస్తున్న లక్షలాది కార్మికులకు వయసు ఉడిగిపోయిన తరువాత ఎలాంటి భరోసాలేని బతుకుల పాల్జెయ్యాలని చూస్తున్నది. ఇవన్నీ సాగనిద్దామా లేక తిరగబడి పోరాటం చేద్దామా అనేది ఇప్పుడు తేల్చుకోవాలి.

'సమరానికి సై' అని చెప్పాల్సిన రోజు వచ్చింది. మన శక్తినంతా సమీకరించుకొని మరీ మనం పోరుబాట పట్టాలి. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు సరిపడా నిధులు కేటాయించేలా ఈ సర్కారు మీద మనం ఒత్తిడి తేవాలి. స్కీం వర్కర్ల కనీస వేతనం, ఉద్యోగాల క్రమబద్ధీకరణ, సామాజిక సంక్షేమ, బీమా, పెన్షన్ సదుపాయాలు రాబట్టుకోవడానికి ఉమ్మడి గా ఒక పట్టు పట్టాలి. ఈ పోరాటానికి అన్ని తరగతుల ప్రజానీకం నుండి ముఖ్యంగా ఈ పథకాల మూలంగా లబ్ధిపొందే తరగతుల ప్రజానీకం నుండి గట్టి మద్దతు సమీకరించుకోవాలి.

ఈ పోరాటం ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలపై సమరశంఖం పూరించాలి. అది బి.జె.పి.యా, కాంగ్రెస్సా లేక రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీయా అనే దానితో నిమిత్తం లేకుండా నయా ఉదారవాద విధానాలు అలవంభించేలా ఏ పార్టీకయినా కనువిప్పు కలిగేలా పోరాటానికి సిద్ధంకావాలి. అందుకే కార్మికవర్గంలోని అన్ని తరగతుల మధ్య ఐక్యత సాధించేందుకు ప్రతినబూనాలి. సెప్టెంబర్‌లో జరగనున్న సార్వత్రిక సమ్మె అలాంటి పోరాటంలో అంతర్భాగమే. ప్రజా వ్యతిరేక, కార్మిక-ఉద్యోగి, వ్యతిరేక నయా ఉదారవాద విధానాలను తిప్పి కొట్టేందుకు సాగు తున్న సుదీర్ఘ పోరాటంలో ఇది మరొక మలుపు. కేంద్ర కార్మికసంఘాల నాయకత్వాన దేశంలోని యావత్ కార్మికవర్గం ఈ సమ్మెకు సిద్ధపడుతుంది. ప్రజా వ్యతిరేక విధానాలు వదులుకోకుంటే అధికారాన్ని కోల్పోతారని ఈ ప్రభుత్వానికి హెచ్చరిక చేయడానికి రాబోయే సార్వత్రిక సమ్మెని విజయవంతం చేయాలి.

**అనువాదం: కె సత్యరంజన్**

## పాఠకుల అభిప్రాయాలు

మా మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక సంపాదకులకు నమస్కరించి వ్రాయునది. ఆగస్టు సంచికపై నా అభిప్రాయం ప్రచురించ కోరుతున్నాను.

గౌరవనీయులైన తెలకపల్లి రవిగారు సంకలనం చేసిన 'భగత్‌సింగ్' పుస్తకంలోని 'నేను ఎందుకు నాస్తికుడనయ్యాను' వ్యాసాన్ని పాఠకులకు అందించినందులకు ధన్యవాదాలు. 23 సంవత్సరాల వయసులో అమరుడైనారు. ఆయన త్యాగానికి మారుపేరు. నేనెందుకు నాస్తికుడనయ్యాను అని వ్రాసిన రచన ఎంతోమందికి ఉత్తేజాన్ని కలిగించింది. అనేక అంశాలపై భగత్‌సింగ్ వివరంగా వ్రాశారు. ఉరికొయ్యలో తలపెట్టే ముందు కూడా భగత్‌సింగ్ దేవుని ప్రార్థించలేదు. అది అహంభావం కాదు... శాస్త్రీయ ఆలోచన. కమ్యూనిస్టులు విప్లవకారులు అమ్మ నవల తరువాత భగత్‌సింగ్ రచనలు తప్పనిసరిగా చదవాలి.

**- తుంపాల శ్రీరామమూర్తి,** గాజువాక

మొబైల్ : 9440260280

# 'కస్తూరి' కుటుంబరావు

(2వ పేజీ తరువాయి)

ఆ రోజుల్లో ఎవరైనా దళాల్లోకి ఎంపికయితే కొత్తపట్నం వద్ద శిక్షణ ఇచ్చే వారు. ఆ తర్వాత నల్లమల అడవులకు పంపేవారు. ఆ సమయంలో కుటుంబరావు వేటపాలెం దళంతో కలిశారు. దళాలపై పోలీస్ నిఘా పెరిగింది. అహార సరఫరా మార్గాలను మూసేశారు. చివరకు దళాలు స్థావరాలు మార్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కుటుంబరావు కూడా దళంతోనే ముందుకు సాగాల్సి వచ్చింది. వారితో కలసి కొత్తపట్నం బయలు దేరాడు. చినగంజాం వరకూ వెళ్ళిన తరువాత కొత్త పట్నం రావద్దని కబురు చేరింది.

ఆ దళం చినగంజాం నుండి వెనక్కిమళ్లాక పందిళ్ళపల్లి చేరింది. అక్కడికి పడమర దిక్కు నున్న ఆకు తోటల్లో తలదాచుకున్నారు. ఓ కొరియర్ అన్నం మూట తెచ్చారు. అది ఒక్క రోజుకే సరిపోయింది. 1950మే ఒకటో తేదీన కుటుంబరావు, బాలానందం, బండారు సుబ్బారావు (కొరియర్) రైలు కట్ట పడమరకు స్థావరాన్ని మార్చారు. తోటల్లో గుండా స్వర్ణ వైపు వెళ్ళారు. అక్కడ మాగాణుల్లోని వరి కుప్పల కాపలా కోసం వేసిన చిన్న గుడిసెలోకి దళం చేరింది. ఆ రోజంతా వారికి తిండి లేదు. రెండోతేదీ ఉదయం జాండ్రపేట వెళ్ళి అన్నం తెస్తానని కొరియర్ సుబ్బారావు బయలు దేరాడు. కాని మధ్యలోనే మనసు మార్చుకొన్నాడు. భయంతో పోలీసులకు లొంగిపోయాడు. సా యంత్రం వరకూ అతని కోసం ఎదురు చూసిన దళ సభ్యులు ఏదో జరిగి ఉంటుందని అనుమానించారు. వెంటనే వేషాలు మార్చుకున్నారు.నొస టి వెంట్రుకలు తీసేశారు. తలకి గుడ్డలు చుట్టుకున్నారు. రైలుకట్ట సమీపంలోని తోటల్లో చేరారు.

మూడో తేదీ కూడా బాహ్య ప్రపంచంతో వారికి సంబంధాలు ఏర్పడలేదు. మే నెల ఎండలు మండి పోతున్నాయ్. హోరున వడగాలి వీస్తోంది. రెండు రోజులుగా ఆహారం లేదు. దళ సభ్యులంతా నీరసించి పోయారు. భయానక వాతావరణం. నర సంచారం లేదు. చిన్న చిన్న గుంటల్లో ఇంకి పోవడానికి సిద్ధంగా వున్న బురద నీటిని తాగి దాహార్తి తీర్చుకున్నారు. ఆ రాత్రికి రైలు కట్టదాటి రామక్రిష్ణాపురం, హస్తినాపురం మధ్యనున్న సిపాయి పేట తోటల గుండా కుందేరు ఒడ్డుకు చేరారు. కుందేరులోనూ నీరు లేదు. ఆ ఏరులోని జమ్ము గుబురులు దాటి తూర్పు ఒడ్డునున్న పొదల్లో రక్షణ తీసుకున్నారు.

నాలుగో తేదీ తెల్లవారుతుండగా అక్కాయి పాలెం నుండి పెరుగు అమ్ముకునేందుకు వెళుతున్న ఒక సోదరి కనిపించింది. ఆమెను పలకరించిన బాలానందం ఓ చీటీ రాసి ఇచ్చారు. దాన్ని ఆమోదగిరి పట్నం (నేటి నూలుమిల్లు ప్రాంతం)లోని పన్నెం సుబ్బారావుకు చేర్చమని కోరాడు. ఆమె విషయం అర్థం చేసుకుంది. చీటీని భద్రంగా దాచుకుంది. ఆ చీటీ చేరగానే సుబ్బారావు తమకు ఆహారం తెస్తాడని ఎదురు చూశారు. ఆ ప్రయత్నం ఫలించ లేదు. సాయంత్రం అయింది. ప్రొద్దుగుంకుతుంది. అకస్మాత్తుగా పొదల్లో నుండి తుపాకి పేలిన శబ్దం వినిపించింది. పోలీసులే కాల్పులు ప్రారంభించారని అనుమానించారు. ఎవరిలోనూ పరుగెత్తే ఓపిక లేదు. శరీరాలు చచ్చుబడి పోయాయి. అలానే నేలపై పాక్కుంటూ పొదల మాటు నుండి ఇద్దరూ బయటకు వచ్చారు. సమీపంలోని సరివి తోటల్లోకి పరుగెడుతూ కళ్ళు తిరిగి పడిపోయారు.

తుపాకీతో పిట్టల వేట కోసం వచ్చినజాండ్ర పేటకు చెందిన బీరక మల్లయ్య బాలానందాన్ని గుర్తుపట్టాడు. "నందిగాడు (సూర్య బాలానందం)లా ఉన్నాడు" అని పెద్దగా కేక వేశాడు. ఆ మాటలను సమీపంలోని జనం విన్నారు. వెంటనే గ్రామంలోకి కబురు వెళ్లింది. క్షణాల్లో మునసబు మనుషులు వచ్చి వారిద్దరిని పట్టుకున్నారు. సూర్య బాలానందం ధృఢకాయుడు. కుటుంబరావు చిన్న మనిషి. ఎప్పుడూ ఏదో ఆయుధాన్ని వెంటే వుంచుకునే సూర్యబాలానందం వద్ద ఆ రోజు ఎటువంటి ఆయుధమూ లేదు. ప్రతిఘటించే శక్తీ లేదు. కస్తూరి కుటుంబరావు, సజ్జా బాలానందాన్ని జాండ్రపేట మునసబు వద్ద హాజరు పరిచారు. ఈ దుర్వార్త క్షణాల్లో ఆ ప్రాంతం అంతా పాకింది. హఠాత్ పరిణామంతో మగ్గాల శబ్దం ఆగిపోయింది. నేతన్నల గుండెలు అవిసి పోయాయి. అందరిలోనూ కన్నీరుబికింది.


అదే సమయంలో పందిళ్ళపల్లి కామ్రేడ్ బండారు వెంకటేశ్వర్లు రైలుకట్ట పడమర నాగవరపమ్మ దేవాలయం ప్రాంతంలోని ఆకు తోటలో జ్వరంతో బాధపడుతుండగా పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. ముగ్గురినీ గుంటూరు జిల్లాలోని పాలపర్తి మలబారు పోలీసు క్యాంపుకు తీసుకు వెళ్లి చిత్రహింసలకు గురిచేశారు.

కనగాల గ్రామంలో కరణాలుగా ఉంటున్న కుటుంబరావు పెదనాన్న కుమారులు పోలీసులకు లొంగిపోతే కేసులన్నీ రద్దు చేయిస్తామని కస్తూరికి హితవు చెప్పారు. ప్రాణాలు కోల్పోవద్దని, భార్యాబిడ్డలను అనాధల్ని చేయ వద్దని అభ్యర్థించారు. ఉపాధ్యాయ వృత్తిలో శేష గ్గా బతకొచ్చని ఒప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. వారి మాటలకు కస్తూరి చిరునవ్వు నవ్వారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన అమర వీరులకూ భార్యాబిడ్డలున్నారని అన్నారు. తాను ఉద్యమాలను వీడేది లేదని తేల్చి చెప్పాడు. అతని పట్టుదల తెలిసిన సోదరులు నిరాశగా వెనుదిరిగారు.

1950 మే 12వతేదీన అమరుల రక్తంతో పాలపర్తి పోలీసు క్యాంపు తడిసింది. రెచ్చిపోయిన పోలీసులు వీరులపై తుపాకులు ఎక్కుపెట్టారు. అరెస్టుచేసిన అందరినీ పాలపర్తి ఊరు వెలుపలకు బలవంతంగా ఈడ్చుకెళ్లారు. అక్కడే చింత చెట్లకు కట్టేశారు. కర్కశంగా తుపాకులతో కాల్చి చంపారు. కస్తూరి కుటుంబరావు, సజ్జా సూర్య బాలానందం, బండారు వెంకటేశ్వర్లుతో పాటు,చివుకుల శేషశాస్త్రి, గుంటూరు జిల్లా ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి ముక్తినూతలపాటి లక్ష్మీనారాయణ రక్తంతో ఆ ప్రాంతం రుధిర క్షేత్రమైంది. తుపాకుల శబ్దాలు విన్న పరిసర ప్రాంతాల ప్రజలు పరుగు పరుగున అక్కడకు వచ్చారు. రక్తం మడుగులో నిర్జీవులైన పడివున్న తమ ప్రియతమ నాయకులను చూసి అవాక్కయ్యారు. అశ్రుతర్పణ చేశారు. కన్నీటి ధారలతో జోహారులు అర్పించారు. వారి ఆశయబాటను మరువలేమంటూ ప్రతిన బూనారు. వారి స్మృతి చిహ్నంగా పాలపర్తిలో స్తూపం నిర్మించారు. ఇటీవలే వేటపాలెం సెంటర్‌లోనూ ఆ ముగ్గురు అమరవీరుల పేర స్థూపం నిర్మించారు. జాండ్రపేటలో కస్తూరి కుటుంబరావు స్మారక కళ్యాణ మండపాన్ని నిర్మిస్తున్నారు. కుటుంబరావు మరణం తర్వాత ఆయన భార్య హైమావతి అనేక కష్టాలు అనుభవించారు. వేటపాలెంలో చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ పిల్లల్ని పోషించారు. తర్వాత తెనాలి, విజయవాడలో ఏదో ఒక పని చేస్తూ వారిని చదివించారు. రెండో కుమారుడు రాజేశ్వరరావు ప్రస్తుతం రాజమండ్రిలో ఉన్నారు. అప్పట్లోనే పెద్ద కుమారుడు జితేంద్ర నాథ్‌కు విజయవాడ విశాలాంధ్ర దినపత్రికలో పార్టీ ఉపాధి కల్పించింది. హైమావతి 1989లో మరణించారు. రాజేశ్వరరావు రాజమండ్రి రైల్వే పాఠశాలలో పని చేసి 2005లో రిటైరయ్యారు. ఆయన భార్య సువర్ణ రాజమండ్రిలోనే చిన్న పాఠశాల ప్రారంభించారు. దాన్ని ప్రస్తుతం వారి కుమారుడు పవన్‌కుమార్ నడుపుతున్నారు. జితేంద్రనాథ్ 2001లో మరణించారు. కుటుంబరావు స్మారక స్థూపం రేపల్లె సమీపంలోని ఇసుకపల్లెలోనూ ఉంది.

**(కుటుంబరావు సహచరులు కామ్రేడ్స్ పత్తిపాటి ఆదినారాయణ, పింజల వెంకట సుబ్బారావు, గొర్రె నాగలింగేశ్వరరావు, రాజమండ్రికి చెందిన ప్రకాష్ ఇచ్చిన సమాచారం ఆధారంగా)**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-09-2016 Postal Regd. No H/SD/407/16-18



# నూతన వ్యవస్థ నిర్మాణం కోసం మాతో కలిసి నడవండి

మాక్సిం గోర్కి

"యుద్ధం ముగిసింది. జర్మన్ సామ్రాజ్యవాదం ఓడిపోయింది. ప్రపంచాన్ని దోపిడీచేయాలన్న తన విధానానికి ప్రతిఫలంగా తనకు విధించబోయే పెద్దశిక్షను అనుభవించటానికి బలవంతంగా సిద్ధమౌతున్నది. యుద్ధం వలన కౄరమైన హింసను అనుభవించిన, ఆకలితో నిరసించిపోయిన జర్మన్ కార్మికవర్గం తనను పాలించిన వర్గం అనుసరించిన విధానానికి మూల్యం చెల్లించాల్సి వస్తున్నది. యుద్ధంలో విజయం సాధించటం ద్వారా ప్రపంచవ్యాపితంగా హక్కులు, ఆనందకరమైన జీవితం కోసం వేలమందిని బలిపెడుతున్నామని నిన్నటి వరకు చెప్పిన విజేతలు బ్రెస్ట్ లిటోవ్స్క్ సంధి కన్నా పదిరెట్లు కౄరమైన, జర్మనీని అనివార్యంగా కరువు కోరల్లోకి నెట్టే సంధికి అంగీకరించమని జర్మన్ ప్రజలను ఒత్తిడి చేస్తున్నారు. గడుస్తున్న ప్రతిరోజూ సామ్రాజ్యవాదుల కౄరత్వాన్ని, అమానవీయతను మరింతగా బయటపెడుతూ నూతన యుద్ధాలు, నూతన జన సంహారం గురించి యూరప్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నది. నిన్నటి వరకు ప్రజల స్వాతంత్ర్యం, ప్రజాస్వామిక హక్కుల రక్షణ గురించి మాట్లాడిన శక్తివంతమైన సైన్యం కలిగిన అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ ప్రజలు ఇప్పటికే అన్ని హక్కులను అనుభవిస్తున్న, అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న, తమకు సాధ్యమైన మేరకు నూతన రాజ్యవ్యవస్థకు పునాదులు వేయటానికి ప్రయత్నిస్తున్న విప్లవకర రష్యాలో శాంతిని పునరుద్ధరించటం గురించి మాట్లాడుతున్నాడు.

"అన్ని యూరోపియన్ దేశాలలోనూ, జాతుల హృదయాలలోని జంతుప్రవృత్తిని యుద్ధం నిద్రలేపిందనేది వాస్తవం కాదా? జీవితం యొక్క విలువను నిదానంగా అవగాహన చేసుకొంటున్న, పని యొక్క నిజమైన గౌరవాన్ని తెలుసుకుంటున్న మనిషిలోని విచక్షణను ఈ యుద్ధం అంతం చేయలేదా? పరిస్థితి అంత అర్థంకాని విధంగా లేదు. అమెరికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్, జపాన్‌లలోని సామ్రాజ్యవాద పత్రికల రచయితలు రాస్తున్నంత ఊహాజనితంగా ( ఐడియలిస్టిక్) ఏమీలేదు. పరిస్థితి చాలా స్పష్టంగా ఉంది. మూడుఖండాలలోని ప్రజల అభిమతానికి విరుద్ధంగా తమకు అధికారాన్ని కట్టబెట్టే సంస్థలను, పరిస్థితులను సృష్టించటానికి, వాటిని బలపరచటానికి ప్రయత్నం చేస్తున్నారు. మెజారిటీ ప్రజల జీవితం, మరణం గురించి ఏ మాత్రం అదుపులేని అతిచిన్న మైనారిటి నిర్ణయించే పరిస్థితులున్నాయి. ఆ మైనారిటీయే ఈ విధమైన రక్తపాతానికి దారితీసే విధానాలను అనుసరించింది. కష్టాలకు, కౄరత్వానికి, దురహంకారానికి, కపటత్వానికి, మూర్ఖత్వానికి కారణమైన పెట్టుబడిదారి విధానం గురించి ప్రపంచంలోని నిజాయితీపరులందరూ అర్థం చేసుకుంటున్నారు. పెట్టుబడిదారి విధానం సృజనాత్మకతను కోల్పోయిందని, అది గతకాలానికి చెందిన అవశేషంగా మిగిలిపోయిందని, ప్రపంచ సంస్కృతి అభివృద్ధి కావటానికి ఆటంకంగా ఉందని, అది ప్రజలు, కుటుంబాలు, వర్గాలు, దేశాల మధ్య శతృత్వాన్ని, అసహ్యాన్ని పెంచుతుందని, ప్రజల మధ్య సహోదరత్వాన్ని సాధించాలన్న ఉన్నతమైన కల పెట్టుబడిదారి విధానంలో నిజం కాదని నిజాయితీపరులైన, ఆలోచనాపరులైన వారందరూ భావిస్తున్నారు. పెట్టుబడి మానవజాతిలోని శ్రమతత్వానికి అందించిన సేవలను, ఈ సామాజిక వ్యవస్థ చర్మం, రక్తంతో కలిసి పూర్తిగా న్యాయమైన, మరింత సమగ్రమైన సామాజిక వ్యవస్థ అయిన సోషలిస్టు వ్యవస్థలోకి పరిణామం చెందటానికి అవసరమైన పరిస్థితులను కల్పించటాన్ని కాని నేను తిరస్కరించటం లేదు. ఈ వ్యవస్థ అశక్తత, అమానవీయత, పాత వ్యవస్థలోని కౄరత్వం, మూర్ఖత్వం, కుళ్ళిపోవటాన్ని ఈ యుద్ధం బట్టబయలు చేసింది. కాబట్టి ఇపుడు పెట్టుబడిదారి విధానానికి మరణశిక్ష విధించబడింది.

"మేము మా గురించి, మనుషులు, వస్తువులను గురించిగాని ఆలోచించకుండా నూతన జీవితం కోసం చేస్తున్న పోరాటంలో పాల్గొనటానికి ముందుకు వచ్చి, మాతో కలిసి నడవండి. మేము పొందుతున్న ఆనందాలు, అనుభవిస్తున్న కష్టాలు, మా శ్రమలోని గొప్ప సంతోషం, అభివృద్ధి వైపుకు సాగిపోగలమనే మా ఆకాంక్షను, మా చర్యలపై తీర్పు చెప్పటాన్ని చరిత్రకు వదిలివేస్తున్నాం. పాత వ్యవస్థకు వ్యతిరేకంగా నూతన వ్యవస్థ నిర్మాణం కోసం చేస్తున్న పోరాటంలో మాతో కలిసిరండి. స్వేచ్ఛ కోసం, జీవిత మాధుర్యాన్ని అనుభవించటం కోసం ముందుకు సాగండి".

**(1919 ఫిబ్రవరి 6వ తేదీన మాక్సిం గోర్కి రాసిన "ప్రపంచానికి ఒక విజ్ఞప్తి" వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Hyderabad Prajasakti Printing Press, Plot Not. 21/1, Azamabad, Hyderabad-20. Phone : 040-27673787. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.11, No.5. Published on September 1, 2016